

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

తుఫాన్ వచ్చినా సకాలంలోనే నైరుతి

ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షాలు

వర్షం కురిసే రోజులు మాత్రం తక్కువ

ఎక్కువగా కుండపోత వానలకు అవకాశం: ఐఎండీ

బలపడిన అల్పపీడనం.. తీవ్ర తుఫాన్‌గా మారే చాన్స్

26న బంగ్లాదేశ్, బెంగాల్ మధ్య తీరంపైకి?

ఏపీకి ముప్పు లేనట్టే.. పెరగనున్న ఎండలు, వడగాడ్పులు

11

శుక్రవారం | 24-5-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 38 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 7.25 తదుపరి విదియ; నక్షత్రం: అనూరాధ ఉ. 10.10 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ. 3.52-5.29; దుర్ముహూర్తం: ఉ. 9.19-9.11, మ. 12.37-1.29; అమృతఘడియలు: రా. 1.38-3.16; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.39 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పిన్నెల్లికి ముందస్తు బెయిల్

6 వరకు ఆయన్ను అరెస్టు చేయొద్దు: హైకోర్టు



పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోవద్దు.. కదలికలపై నిరంతరం నిఘా

పిన్నెల్లి వెంట నలుగురికి మించి ఉండకూడదు.. దర్యాప్తునకు ఆటంకం కలిగించరాదు

సాక్షులను బెదిరించడానికి వీల్లేదు.. ఎలాంటి నేరాలకూ పాల్పడకూడదు

న్యాయమూర్తి స్పష్టీకరణ.. తాడిపత్రి టీడీపీ, వైసీపీ అభ్యర్థులకూ బెయిల్

చింతమనేని ప్రభాకర్, గోపిరెడ్డికి సైతం ఊరట

11



దాగుడుమూతలు

హైకోర్టులో భారీ ఊరట

అంతకుముందు రోజంతా హైడ్రామా

నరసరావుపేట కోర్టు వద్ద లొంగిపోతారంటూ పగలంతా హడావిడి

ఈవీఎం ధ్వంసం వ్యవహారంలో పీవో, ఏపీవోలు సస్పెన్షన్

జాయింట్ కలెక్టర్ తీరుపైనా సందేహాలు

గిరిజనులనూ వదలని పిన్నెల్లి

పోలింగ్ కేంద్రం నుంచి టీడీపీ ఏజెంట్ల తరిమివేత

పారిపోతున్న రేఖ్యానాయక్‌పై దాడి

ఏజెంట్లను బలవంతంగా కారులోకి ఎక్కించి తరలింపు..

మరో వీడియో వెలుగులోకి

పోలీసులు వెంటాడుతున్నా పిన్నెల్లి 'భద్రం'

ఈవీఎం బద్దలుకొట్టిన కేసులో మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. 'పరారీ'లో ఉన్న ఆయన ముందస్తు బెయిలు కోసం గురువారం హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం కోర్టు ఆయనకు భారీ ఊరట కలిగించింది. ఫలితాలు వెలువడి, కోడ్ ముగిసేదాకా... అంటే జూన్ 6వ తేదీ వరకు ఆయనపై తదుపరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఈసీ సీరియస్, ప్రత్యేక బలగాల గాలింపుతో 'పరారీ'లో ఉన్న పిన్నెల్లికి ఇది భారీ ఊరటే. ఇక... వివిధ కేసుల్లో ముందస్తు బెయిలు కోరిన అభ్యర్థులందరికీ 6వ తేదీ దాకా అరెస్టులనుంచి హైకోర్టు ఉపశమనం కల్పించింది.

పిన్నెల్లిపై ఈసీ సీరియస్‌గా ఉంది



పరామర్శ కోసం మాచర్లకు టీడీపీ వెళ్లకుంటే మంచిది

సీఈవో మీనా సూచన


లెక్కింపునకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలి

ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

11

అంత ఆత్రమేల జవహరా!

అస్మదీయులకు ఐఏఎస్ కట్టబెట్టేందుకు ఆరాటం



కోడ్ ఉందని తెలిసీ యూపీఎస్సీకి లేఖ.. ఇంటర్వ్యూలకు జూన్ 7న కమిషన్ షెడ్యూలు

ఈ నెలాఖరులోపే పూర్తి చేసేద్దామన్న సీఎస్.. ఫలితాల తర్వాత తాము బిజీ అవుతామని వెల్లడి

కోడ్‌ఉండగా కుదరదని తేల్చిన యూపీఎస్సీ.. ఫిబ్రవరిలో అత్యంత గోప్యంగా నోటిఫికేషన్

సమాచారం లేక అర్హులకు అన్యాయం.. గతంలో ఇద్దరు అస్మదీయులకు ఐఏఎస్ హోదా

ఇప్పుడూ అదే పని చేసేందుకు జవహర్, ధనుంజయ్ పన్నాగం

కనీస అనుభవం లేని మహిళాధికారి పేరూ ప్రతిపాదన

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు కూడా భర్తీ చేయరు. కానీ... ఏకంగా కన్ఫర్డ్ ఐఏఎస్‌ల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిద్దామని సీఎస్ జవహర్ రెడ్డి యూపీఎస్సీకి లేఖ రాశారు. సర్కారు మారిపోతే సంగతేమిటో అనే ఆందోళనతో తెగ ఆరాటం ప్రదర్శిస్తున్నారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లూ అడ్డగోలుగా అస్మదీయులకు మేళ్లు చేసిన వైసీపీ సర్కారు.. చివరికి, ఎన్నికలు ముగిసి, ఫలితాల ముంగిటా అదే పని చేస్తోంది. అయిన వారికి కన్ఫర్డ్ 'ఐఏఎస్' కట్టబెట్టేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆపసోపాలు పడుతున్నారు. ఎడతెగని ఆత్రం ప్రదర్శిస్తున్నారు. ఇంటర్వ్యూల నిర్వహణకు యూపీఎస్సీ ఖరారు చేసిన తేదీలను కూడా మార్చేసి... ఫలితాలు వెలువడే లోగానే పని పూర్తి చేసుకోవాలని తహతహలాడుతున్నారు. సీఎస్ ఆరాటం, ఆత్రం చూసి అధికార యంత్రాంగం కూడా ముక్కున వేలేసుకుంటోంది. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉంది. పోలింగ్, అనంతరం జరిగిన హింసతో రాష్ట్రం అట్టుడుకుతోంది. కౌంటింగ్ రోజు ఇంతకంటే భారీగా గొడవలు జరిగే ప్రమాదముందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సీఎస్‌గా దీనిపై దృష్టి సారించాల్సిన జవహర్ రెడ్డి.. వీటన్నింటినీ పక్కనపెట్టేశారు. తన వాళ్లకు ఐఏఎస్ ఇప్పించుకునే అంశంపైనే దృష్టి పెట్టారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇప్పుడు కొత్త పోస్టింగ్‌లు ఇవ్వడానికి లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని యూపీఎస్సీ కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతులకు సంబంధించిన ఇంటర్వ్యూలను జూన్ 7న నిర్వహించాలని నిర్ణయించింది. కానీ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తర్వాత రాజెవరో, బంటు ఎవరో తెలియదు! తమ వాళ్లకు ఐఏఎస్ దక్కుతుందో లేదో తెలియదు! అందుకే.. ప్రభుత్వం మారే లోపే పని పూర్తి

మిగతా 12వ పేజీలో...



హేమ రక్త నమూనాలో

డ్రగ్స్ జాడలు

మరో నటి ఆషి రాయ్ బ్లడ్ శాంపిల్‌లోనూ!

రేవ్ పార్టీకి హాజరైన 86 మంది నమూనాల్లోనూ నిర్ధారణ అయిందన్న పోలీసులు

అందరికీ నోటీసులు పంపనున్నట్టు వెల్లడి

2



ఏబీవీ వ్యవహారంలో

తీర్పు రిజర్వ్

క్యాట్ ఉత్తర్వుల రద్దుకు ప్రభుత్వం అప్పీల్

హైకోర్టులో ముగిసిన ఇరు పక్షాల వాదనలు

12



బలైన బలగం

తండ్రుల ఆవేశానికి పిల్లలు బలి

పల్నాడులోని జూలకల్లు విషాదగాథ



35 ఏళ్ల క్రితం ఎంతో ఘనమైన ఊరు

రాజకీయ గొడవలకు ఛిన్నాభిన్నం

హత్యలు, అల్లర్లతో గ్రామస్థులు జైలుకు

వ్యవసాయ కూలీలుగా మహిళలు

పిల్లల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం

చిన్నప్పటి నుంచీ అంతా ఒక్కచోట పెరిగారు. సరదాలు, సంబరాల్లో పాలుపంచుకున్నారు. కలసి పండగలు చేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామంలో అందరిదీ ఒకే మాట. చిన్నా పెద్దా అన్న పట్టింపు పెద్దగా ఉండేది కాదు. 35 ఏళ్ల క్రితం ఎన్నికల సందర్భంగా జరిగిన ఓ చిన్న గొడవ ఆ గ్రామాన్ని ఛిన్నాభిన్నం చేసింది. ఆ గొడవ చినికి చినికి గాలివానలా మారి పచ్చటి పల్లెటూరును రావణకాష్టం చేసింది. అప్పటి వరకు ఆప్తులుగా ఉన్నవారే ఒకర్నొకరు చంపుకొన్నారు. పగతో సొంత అన్నలే చెల్లెళ్ల మాంగల్యాలను తెంపేశారు. కేసుల్లో ఇరుక్కుని మగవాళ్లు జైలుపాలయ్యారు. మగదిక్కు లేక మహిళలు, పిల్లలు ఎన్నో బాధలు పడ్డారు. సాగు చేసేవారు లేక పొలాలు బీడుగా మారిపోయాయి. ఓ చిన్న గొడవ కారణంగా ఏకంగా ఓ తరమే ఎంతో నష్టపోయింది. తండ్రుల ఆవేశానికి పిల్లలు శిక్ష అనుభవించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు గ్రామ విషాదగాథ ఇది. ఆ గొడవలు గుర్తొస్తే నేటికీ ఆ ఊరి ప్రజలు వణికిపోతున్నారు. అలాంటి గొడవలు మళ్లీ ఎప్పుడూ జరగరాదని కోరుకుంటున్నారు. ప్రస్తుతం గొడవలతో అట్టుడికిపోతున్న పల్నాడు పల్లెలను చూస్తుంటే ఛిద్రమైన జూలకల్లు జీవన చిత్రం కళ్ల ముందు కనపడుతుంది.

పల్నాడులో తాజాగా రగిలిన రాజకీయ చిచ్చు ఊళ్లకు ఊళ్లను తగలబెట్టేస్తోంది. బాధితులు, బాధ్యులు అందరూ ఇరుగు పొరుగు వారే. తలలు పగులుతున్నా గొడవలకు కాలు దువ్వుతున్న వారంతా ఒక్కసారి జూలకల్లులో

బలగమంతా ఎలా బలైందో ..2లో చదవండి

2047 వరకు కష్టపడతా!

దేవుడు నాకప్పటి వరకు టైమిస్తాడు.. నన్ను ప్రత్యేక కార్యం మీద పంపాడు.. వికసిత్ భారత్ కల నెరవేరుస్తా..

ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు.. మరో 2 దశాబ్దాలు క్రియాశీల రాజకీయాల్లో.. ప్రజలకు ప్రధాని సంకేతం



గురువారం పటియాలా ర్యాలీలో కృపాణంతో మోదీ

న్యూఢిల్లీ, మే 23: వికసిత్ భారత్ కల సాకారం కోసం 2047 వరకు నిరంతరం శ్రమించే బాధ్యతను దేవుడు తన మీద పెట్టాడని ప్రధాని మోదీ అన్నారు. రజత్ శర్మ 'సలాం ఇండియా' షోలో అయన మాట్లాడారు. దేవుడు తననో ప్రత్యేక కార్యం మీద

మిగతా 2వ పేజీలో...



ఐఐటీయన్లకు ఉద్యోగాలు కరువు

ఈ ఏడాది 7 వేల మందికి దొరకని నియామకాలు

ఏటా పెరుగుతున్న సమస్య.. బిట్స్‌లోనూ ఇదే పరిస్థితి

చాట్ జీపీటీ, పలు దేశాల్లో ఎన్నికల ప్రభావంతోనే..!

పూర్వ విద్యార్థుల సాయం కోరుతూ ఐఐటీల లేఖలు

న్యూఢిల్లీ, మే 23: ఐఐటీలో సీటు లభించిందంటే ఇక బంగారు భవిష్యత్తే అని అనుకుంటాం. కోర్సు పూర్తి కావస్తుండగానే స్వయంగా కంపెనీలే వచ్చి లక్షలు, కోట్లలో వార్షిక వేతనాలు ఆఫర్ చేస్తూ ఉద్యోగాల్లోకి తీసుకుంటాయని వింటాం. కానీ, ఐఐటీల ప్రభ క్రమంగా మసకబారుతోందని తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 23 ఐఐటీల్లో 2023-24 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల్లో 38 శాతం మందికి (7 వేల మందికిపైగా) ఇంకా ఉద్యోగాలు దొరకలేదని తాజాగా వెల్లడైంది. ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి

మిగతా 2వ పేజీలో...




ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఏడుగురు నక్సల్స్ మృతి.. సంఖ్య పెరిగే చాన్స్

గత 70 రోజుల్లో 101 మంది మావోయిస్టుల హతం

సైలెన్స్ డ్రోన్లను వినియోగించి ఆనుపానుల గుర్తింపు

2





ఎన్నికల బరిలో 121 మంది నిరక్షరాస్యులు

న్యూఢిల్లీ, మే 23: లోక్‌సభ ఎన్నికల బరిలో 121 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు ది అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. 1263 మంది తాము బడికి వెళ్లకపోయినా చదవడం రాయడం వచ్చని చెప్పారని, 2436 మంది 5 నుంచి 12వ తరగతుల మధ్య చదివినట్లు తెలిపారని పేర్కొంది. 18వ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల విద్యార్హతలను అధ్యయనం చేసిన ఏడీఆర్ సంస్థ గురువారం ఆ వివరాలను వెల్లడించింది. 42 మంది డిప్లొమా చదివినట్లు చెప్పారని, 1303 మంది 12వ తరగతి పూర్తి చేసినట్లు చెప్పారని పేర్కొంది. 4211 మంది డిగ్రీ ఆపై చదివినట్లు చెప్పారని వెల్లడించింది. 198 మంది అభ్యర్థులు డాక్టరేట్ పట్టా పొందినట్లు పేర్కొంది. 23 మంది తమ విద్యార్హతలకు సంబంధించిన వివరాలు చెప్పేందుకు ఇష్టపడలేదని వెల్లడించింది. కాగా, ఇప్పటివరకు ఐదు దశల పోలింగ్ ముగియగా, ఆరో దశ మే 25న.. ఏడో దశ పోలింగ్ జూన్ 1న జరగనుంది.



వైఎస్ భాస్కరరెడ్డి కోర్టు అనుమతితో 13వ తేదీన హైదరాబాద్ నుంచి బాకరాపురం వచ్చి ఓటు వేశారు. ఈ సందర్భంగా పులివెందులకు చెందిన డిప్యూటీ సర్వేయరు, స్ట్రాంగ్‌రూము ఇన్‌చార్జి నాగరాజు పోలింగ్ కేంద్రం వద్ద భాస్కర్‌రెడ్డిని కలిసి, షేక్‌హ్యాండ్ ఇచ్చారు. ఇద్దరూ చేతులు పట్టుకుని నడుస్తూ వెళ్లారు. స్ట్రాంగ్ రూము వద్ద ఉండకుండా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి భాస్కర్‌రెడ్డితో తిరగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. - ఆంధ్రజ్యోతి- కడప

హేమ రక్త నమూనాలో డ్రగ్స్ జాడలు

- మరో నటి ఆషి రాయ్ బ్లడ్ శాంపిల్‌లోనూ!
- బెంగళూరు రేవ్ పార్టీకి హాజరైన 86 మంది రక్త నమూనాల్లో మాదకద్రవ్యాల జాడలు!
- అందరికీ నోటీసులు పంపనున్నట్టు పోలీసుల వెల్లడి

బెంగళూరు, హైదరాబాద్ సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): 'అబ్బే నేనసలు బెంగళూరు రేవ్ పార్టీకి ఎప్పుడెళ్లాను? హైదరాబాద్‌లోనే ఉన్నాను' అంటూ బుకాయించిన నటి హేమ అడ్డంగా దొరికిపోయింది. ఆమెతోపాటు మరో నటి ఆషీ రాయ్ సహా.. బెంగళూరు రేవ్ పార్టీలో పట్టుబడినవారిలో 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు.. వారందరి రక్తనమూనాలూ సేకరించి వైద్యపరీక్షలు చేయగా వాటిలో డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్టు వెల్లడైందని పోలీసులు వెల్లడించారు. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీలోని జీఆర్ ఫాంహౌస్‌లో ఆదివారం రేవ్ పార్టీలో పాల్గొన్న 103 మందిని సీసీబీ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. పార్టీ జరిగిన ప్రాంతంలో ఎండీఎంఏ, కొకైన్, హైడ్రో గాంజాను కూడా వారు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న 103 మందిలో 73 మంది పురుషులు, 30 మంది మహిళలు ఉన్నారు. వారిని అక్కడే ఉంచి సోమవారం మధ్యాహ్నం వారందరి రక్తనమూనాలను సేకరించారు. డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ అయిన అందరికీ నోటీసులు ఇచ్చేందుకు సీసీబీ పోలీసులు సిద్ధమయ్యారు. రేవ్ పార్టీలో నటి హేమ పేరు బయటకు రావడంతో ఆమె జాగ్రత్తపడింది. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లి నేను బెంగళూరు పార్టీలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కానీ నేను హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో చిల్ అవుతున్నానంటూ వీడియో విడుదల చేసింది. కానీ బెంగళూరు పోలీసులు ఆమె ఫొటోను విడుదల చేయడమే కాకుండా, ఆమె కృష్ణవేణి (అసలు పేరు)పేరుతో పార్టీకి వచ్చిందని ధృవీకరించారు.

దుష్ప్రచారం చేస్తే.. లీగల్ యాక్షన్: శ్రీకాంత్


బెంగళూరు రేవ్ పార్టీలో పాల్గొన్నవారిని వదిలిపెట్టవద్దని సినీనటుడు శ్రీకాంత్ అన్నారు. తనకు, ఆ పార్టీకి సంబంధం లేదని తేల్చిచెప్పారన్నారు. తనపై దుష్ప్రచారం చేస్తే ఊరుకోనని.. అది మీడియా అయినా, బెంగళూరు పోలీసులైనా న్యాయపరంగా ముందుకు వెళ్తానన్నారు. ఆ రోజు తానొక ఆడియో ఫంక్షన్‌కు వెళ్లానని చెప్పారు. శ్రీకాంత్ అంటేనే ఫ్యామిలీ మెన్.. తనపై అవాస్తవ ఆరోపణలు సబబు కాదని ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో అన్నారు.

బూత్‌ల వారీ పోలింగ్ శాతం వెల్లడించలేం

ఈసీ వెబ్‌సైట్లో పెడితే ఇబ్బందులు.. ఫామ్ 17(సి) పబ్లిక్ డాక్యుమెంటు కాదు

- దాన్ని బయట పెట్టాలని చట్టంలో లేదు.. పోలింగ్ తర్వాత కాపీ పొందొచ్చు
- సుప్రీంలో ఎన్నికల సంఘం అఫిడవిట్

న్యూఢిల్లీ, మే 23: పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ శాతం తెలపడం, దాన్ని వెబ్‌సైట్లో పెట్టడం కుదరదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇందువల్ల ఎన్నికల యంత్రాంగంలో గందరగోళం ఏర్పడుతుందని చెప్పింది. ఒక పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో తెలియజేసే ఫామ్ 17(సి)ని బయటపెట్టాలని చట్టంలో ఎక్కడా లేదని గుర్తు చేసింది. వాటిని బయట పెడితే ఎవరైనా కొంటె పనుల్లో భాగంగా గణాంకాల ఫోటోలను దిద్ది తప్పుడు ప్రచారం చేస్తే మొత్తం ఎన్నికల ప్రక్రియకు అవాంతరం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. తాజా ఎన్నికల మొదటి రెండు దశల్లో పోలింగ్ నాడు చెప్పిన శాతానికి తర్వాత ప్రకటన విడుదల చేసినపుడు పేర్కొన్న శాతానికి మధ్య 5-6 శాతం తేడా ఉందని వస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. పోలింగ్ ముగిసిన 48 గంటల్లో బూత్‌లో పోలింగ్ శాతాన్ని తెలిపే ఫామ్ 17(సి)ని ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో పెట్టాలని కోరుతూ ఏడీఆర్ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌కు స్పందనగా ఎన్నికల సంఘం బుధవారం ప్రమాణపత్రాన్ని దాఖలు చేసింది. వెబ్‌సైట్లో పెట్టాల్సి వస్తే అది చట్టం తమకు ఇచ్చిన అధికారాలకు వ్యతిరేకమే కాకుండా ఇప్పటికే సగం పూర్తయిన లోకసభ ఎన్నికల ప్రక్రియను గందరగోళంలో పడేస్తుందని పేర్కొంది. 2019 లోకసభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ శాతం అవకతవకలు జరిగినట్లుగా ఒక్క అభ్యర్థి కానీ, ఒక్క ఓటర్ కానీ పిటిషన్ వేయలేదని గుర్తు చేసింది. ప్రస్తుత పిటిషన్ ఆధారం లేని తప్పుడు పిటిషన్ అని పేర్కొంది. చట్ట ప్రకారం పోలింగ్ ఏజెంటు పోలింగ్ పూర్తయ్యాక బూత్‌లో పోలింగ్ శాతాన్ని సూచించే ఫామ్ 17(సి) నకలును తీసుకోవచ్చని గుర్తు చేసింది. ఫామ్ 17(సి) అసలు ప్రతి ఈవీఎంలు ఉంచే గదిలో ఉంటుందని, పోలింగ్ ఏజెంట్లు అందుకొనే నకలు మీద ఏజెంటు సంతకం ఉంటుందని వెల్లడించింది. అంటే బయటకు వచ్చే ప్రతీ 17(సి) కాపీకి సంతకం ఉన్న సంబంధిత ఏజెంటు బాధ్యుడు అవుతాడని చెప్పింది. ఈ వివరాలను వెబ్‌సైట్లో పెట్టడం, వాటికి


(CHAPTER 21, PARA 29.1.4)
FORM 17C
PART I-ACCOUNT OF VOTES RECORDED

తుంటరులు తప్పుడు నకలు తయారు చేయడం వల్ల మొత్తం ఎన్నికల ప్రక్రియ మీద ప్రజల్లో అనుమానాలకు తావిచ్చినట్లు అవుతుందని వివరించింది. పిటిషనర్ వాదనను సుప్రీంకోర్టు అంగీకరిస్తే ఏ ఓటరైనా పోలింగ్ కేంద్రానికి వచ్చి, 17(ఎ) ప్రజా బాహుళ్య పత్రం కాబట్టి తనకు కాపీ కావాలని అడిగే పరిస్థితి ఏర్పడుతుందని, దాంతో మొత్తం ఎన్నికల ప్రక్రియే గందరగోళంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 17న స్వచ్ఛంద సంస్థ పిటిషన్‌కు సుప్రీంకోర్టు స్పందిస్తూ వారం రోజుల్లోగా ఎన్నికల సంఘం స్పందన తెలపాలని ఆదేశించింది. ఆ మేరకు ఈసీ బుధవారం ప్రమాణపత్రాన్ని సమర్పించింది. 2019లో కూడా ఏడీఆర్ ఎన్నికల ప్రక్రియ ముగిశాక పోలింగ్ బూత్‌ల వారీగా ఫామ్ 17(సి) సమాచారాన్ని ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉంచాలని సుప్రీంకోర్టును కోరింది.


అప్పుడు వేగంగా పోలింగ్ శాతం!

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ జరిగిన తీరుకంటే కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తున్న తీరుపైనే అందరూ సందేహాలు లేవనెత్తున్నారు. తొలి దశ పోలింగ్ శాతం ప్రకటించడానికి ఎన్నికల సంఘానికి 11 రోజుల సమయం పట్టింది. పోలింగ్ ముగిసిన రోజున 60 శాతం పోలింగ్ జరిగిందని తెలపగా, 11 రోజుల తర్వాత ఏకంగా 66.14 శాతమని ప్రకటించింది. అంటే సుమారు ఆరు శాతానికి పైగా వ్యత్యాసం ఉంది. మిగిలిన మూడు దశల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రెండో ఫేజ్‌లో పోలింగ్ ముగిసిన రోజున 60.69 శాతం పోలింగ్ జరిగిందని వెల్లడించగా, తర్వాత 66.7 శాతం పోలింగ్ జరిగిందని ప్రకటించింది. ఫేజ్ 3, ఫేజ్ 4 పోలింగ్ పరిస్థితీ అదే. ఇక.. ఇటీవలే జరిగిన ఫేజ్ -5 పోలింగ్ శాతానికి సంబంధించిన వివరాలను గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ జరిగిన రోజున 60 శాతమని వెల్లడించగా, గురువారం మాత్రం 62.2 శాతమని ప్రకటించింది. ఇలా ప్రతి ఫేజ్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతాల్లో వ్యత్యాలపై పలువురు అనేక సందేహాలు లేవనెత్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో ఈసీ పోలింగ్ ముగిసిన కొద్దిసేపటికే వివరాలన్నీ ప్రకటించింది. స్త్రీ, పురుషుల ఓటింగ్ శాతంతో సహా స్పష్టంగా వివరాలు వెల్లడించింది. కానీ ఇప్పుడెందుకు పోలింగ్ శాతాల్లో భారీ వ్యత్యాసాలు వస్తున్నాయన్నది అంతుచిక్కని ప్రశ్న?

అనుమానాస్పదంగా ఉంది: సిబల్

పోలింగ్ రోజు సాయంత్రమే పోలింగ్ ఏజెంట్లకు ఫామ్ 17(సి) కాపీని ఇస్తున్నప్పుడు అదే వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచడానికి అభ్యంతరం ఏమిటని సీనియర్ న్యాయవాది కపిల్ సిబ్బల్ ప్రశ్నించారు. ఈసీ ప్రమాణపత్రం మీద గురువారం ఆయన స్పందించారు. ఈసీ వెనుకంజ వేయడాన్ని బట్టి చూస్తుంటే ఏదో అనుమానాస్పదంగా ఉందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయని చెప్పారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ప్రిసైడింగ్ ఆఫీసర్ సంతకంతో ఫామ్ 17(సి) ఇప్పటికే ఏజెంట్లకు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఏజెంట్లకు ఇవ్వడమే కాకుండా ఎన్నికల సంఘానికి కూడా నేరుగా పంపిస్తారని, వాటి ఆధారంగానే పోలింగ్ శాతాన్ని లెక్కిస్తారని ప్రస్తావించారు. అలాంటప్పుడు అందుబాటులో ఉన్న పత్రాలను వెబ్‌సైట్లో పెట్టడానికి వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు.

లోకం తీరు



2047 వరకు కష్టపడతా!

(మొదటి పేజీ తరువాయి)

పంపాడని తనకు అనిపిస్తోందన్నారు. దేవుడు తనకు దారిచూపించడమే కాకుండా శక్తినిచ్చాడని, 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యం నెరవేర్చే వరకు దేవుడు తనను పైకి పిలవడని విశ్వాసం ఉందని చెప్పారు. ఈ భూమ్మీద ఇంకా తాను ఎక్కాల్సిన మెట్లేవీ లేవన్నారు. పరోక్షంగా ఆయన ప్రధాని పదవిలో ఎక్కువ కాలం కొనసాగుతానని సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం 74 ఏళ్ల వయసున్న మోదీ మరో రెండు దశాబ్దాలు దేశ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉంటానని స్పష్టంగా చెప్పారు. 400 సీట్ల నినాదం బీజేపీది కాదని, జనం నుంచి వచ్చిందని మోదీ వ్యాఖ్యానించారు. ఢిల్లీ, ఝార్ఖండ్ ముఖ్యమంత్రులను తాను జైలుకు పంపలేదని, కోర్టులు పంపాయని చెప్పారు. యూపీఏ పదేళ్ల పాలనలో ఈడీ రూ.34లక్షలు పట్టుకుందని, అవి పిల్లాడి స్కూల్ బ్యాగులోకి కూడా రావన్నారు. అదే, తన పదేళ్ల పాలనలో ఈడీ రూ.2200కోట్లు పట్టుకుందని, వాటిని తరలించడానికి 70 టెంపోలు కావాలని వ్యాఖ్యానించారు. 2014లో అవినీతిని అంతం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చానని, ఆ విషయంలో ఎంత పెద్దవాళ్లైనా వదిలేదన్నారు. కేజ్రీవాల్ ప్రభుత్వం చిన్న పిల్లల చేతకూడా వన్ ప్లస్ వన్ ఆఫర్‌తో పెద్ద ఎత్తున మద్యం తాగించేందుకు పథకం వేసిందని ఆరోపించారు.

బలైన బలగం

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జూలకల్లు ఐదువేల మంది జనాభా ఉన్న చిన్న పల్లెటూరు. 35ఏళ్ల క్రితమే ఈ గ్రామం ఎంతో అభివృద్ధి సాధించింది. అందరూ చదువుకున్నవారే. కులాలు అనేకమున్నా అందరిదీ ఒకే మాట. భిన్నత్వంలో ఏకత్వం వారి సొంతం. ఆ ఊరికి రాజకీయ చైతన్యం ఎక్కువ. విప్లవ భావాలు, కమ్యూనిజం ఆనవాళ్లు ఉన్న గ్రామమది. నక్సల్బరీ యోధుడు చారు మజుందార్ ఆంధ్రాలో మొట్టమొదట అడుగుపెట్టిన గ్రామమది. పాడి పంటలు, ఐశ్వర్యంతో తులతూగే వైభోగం ఆ గ్రామం సొంతం. ప్రశాంతంగా ఉన్న ఈ గ్రామానికి ఓ చిన్నగొడవ అంతులేని విషాదం, నష్టం మిగిల్చింది. అప్పట్లో జరిగిన ఎన్నికలలో ఓ చిన్న గొడవ తలెత్తింది. అది కాస్తా కులాల మధ్య కార్చిచ్చులా మారింది. రానురాను ఫ్యాక్షన్‌గా రూపాంతరం చెందింది. తన మన తేడా లేకుండా హత్యలకు పాల్పడ్డారు. ఏ ఇంట చూసినా సౌభాగ్యం దూరమైన మహిళలే. ఊర్లోని మగవాళ్లందరిపై హత్య కేసులు నమోదయ్యాయి. పోలీసులు అరెస్టు చేసేందుకు గ్రామంలోకి రావడంతో తప్పించుకునేందుకు భార్యాబిడ్డలను వదిలి దూర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఎక్కడున్నారో చాలారోజుల వరకూ అంతు పట్టలేదు. హైదరాబాద్, ముంబై వెళ్లి తలదాచుకున్నారు. 30ఎకరాల భూములున్న ఆసాములు సైతం రోజు కూలీలుగా మారారు. సాగుచేసే నాథుడు లేక, పెట్టుబడి పెట్టే పరిస్థితులు లేక వేలాది ఎకరాల కొద్ది పొలాలు అడవిగా మారాయి. పచ్చని పంటలతో కళకళలాడిన పల్లెటూరు కరువు బారిన పడింది. మహిళలు కుటుంబాలను పోషించాల్సి వచ్చింది. అప్పటివరకు గడప దాటని మహిళలు పిల్లా పాపలతో వ్యవసాయ కూలీలుగా మారారు. కొంతమంది పాడినాధారం చేసుకుని బిడ్డలను బతికించుకున్నారు. మరి కొంతమంది పిల్లలతోనే వ్యవసాయం చేయించారు. కొద్దిరోజులకు తిరిగివచ్చిన భర్తలను పోలీసులు అరెస్టు చేశారు. హత్య కేసులలో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న వారందరినీ జైలుకు పంపారు. ఈ కేసుల నుంచి బయట పడేందుకు రైతులు పొలాలను అతితక్కువ ధరకు అమ్ముకున్నారు. చాలామంది జీవిత ఖైదు అనుభవించారు. కొందరు జైలులోనే మరణించారు. గొడవల్లో ఇరుకున్న ఎంతోమంది వృద్ధాప్యంలో బయటకు వచ్చారు. జైలు నుంచి విడుదలయ్యే సరికి పిల్లలు తలో దిక్కుకు వెళ్లిపోయారు. చదువుకోవాల్సిన వయసులో కుటుంబ పోషణ మీద పడటంతో కొందరు వ్యవసాయదారులుగా, మరికొందరు కూలీలుగా స్థిరపడిపోయారు. తండ్రుల ఆవేశానికి పిల్లల తరం భయంకరమైన శిక్ష అనుభవించింది. ఈనాటికీ నాటి చేదు గుర్తులు ఆ గ్రామంలో కనపడతాయి. - గుంటూరు సిటీ

మా ఊరు చాలా నష్టపోయింది


బండ్ల వెంకటేశ్వర్లు

పల్నాడులో రాజకీయ, ఫ్యాక్షన్ గొడవల కారణంగా మా ఊరు ఎంతో నష్టపోయింది. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పిల్లలు చేతికి రాకుండా పోయారు. చివరకు ఆడపిల్లలకు పెళ్లిళ్ల చేసే దిక్కు కూడా లేకుండా పోయింది. కేసుల్లో ఉన్న వారు ఆరోగ్యాలు పాడైపోయి, కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగలేక చాలామంది చనిపోయాం. మా ఊరు కథ విన్నాక అయినా రాజకీయ గొడవలకు స్వస్తి పలికితే మంచిది. - బండ్ల వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉపాధ్యాయుడు

తలచుకుంటే వెన్నులో వణుకు


బండ్ల వెంకటేశ్వర్లు

చాలా భయంకరమైన రోజులవి. తలచుకుంటే వెన్నులో వణుకు పుడుతుంది. ఆ పరిస్థితి మళ్లీ ఎప్పుడూ రాకూడదు. తన, మన అన్న భేదం లేకుండా గొడవలు జరిగాయి. చాలా మంది నష్టపోయారు. ఊర్లు వదిలి వెళ్లిపోయారు. తండ్రి లేకపోతే ఇంట్లో పరిస్థితి చాలా కష్టంగా ఉంటుంది. మహిళలు పిల్లల్ని పోషించుకోవటానికి ఎన్నో పాట్లు పడ్డారు. మళ్లీ అలాంటి దుర్దినాలు రాకూడదు. - మన్నెం అంజిరెడ్డి, జూలకల్లు

పోరు నష్టం కళ్లారా చూశా


నన్నెపోగు నాగేశ్వరరావు

ఒక్కసారిగా గొడవలు, దాడులు జరగడంతో పోలీసులు ఊరిలోకి వచ్చారు. మగవాళ్లు అందరూ ఊరు వదిలి వెళ్లిపోయారు. మహిళలు, పిల్లలు మాత్రమే బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. చాలామందికి జైలు శిక్ష పడింది. పిల్లలు ఎటోళ్ల అటు అయ్యారు. మళ్లీ గొడవలు జరగకూడదు. పోరు నష్టం అంటే ఏమిటో నేను కళ్లారా చూశా. - నన్నెపోగు నాగేశ్వరరావు, జూలకల్లు

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

చర్ల, మే 23: భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పుల మోతతో ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి దద్దరిల్లాయి.. 'ఆపరేషన్ కగార్' పేరుతో నిర్వహిస్తున్న కూంబింగ్‌లో భాగంగా బీజాపూర్, నారాయణపూర్ జిల్లాల సరిహద్దు అడవుల్లో గురువారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్, నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన ఇంద్రావతి ఏరియా కమిటీ, పీఎల్‌జీఏ ప్లాటూన్ 16 బెటాలియన్ సభ్యులున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ, జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ చెందిన 800 మంది బలగాలు బుధవారం సాయంత్రం నుంచి కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలోనే బలగాలు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. ఘటన అనంతరం పరిసరాలను పరిశీలించగా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయని, అక్కడి నుంచి ఏడు అధునాతన తుపాకులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయని చెప్పారు. మృతులెవరనేది పోలీసులు ఇంకా గుర్తించలేదు. మృతులంతా ఇంద్రావతి ఏరియా కమిటీ, పీఎల్‌జీ-16 బెటాలియన్ సభ్యులని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనలో చాలామంది మావోయిస్టులు గాయపడ్డారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని బలగాలు చెబుతున్నాయి. కాగా, సైలెన్స్ డ్రోన్లతో కూడిన కెమెరాలను వినియోగించి మావోయిస్టుల కదలికలను బలగాలు గుర్తిస్తున్నట్లు సమాచారం.

రాజీనామా చేయను

తప్పుడు సంప్రదాయానికి నాంది పలికినట్లవుతుంది: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవికి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయనని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తేల్చిచెప్పారు. అలా చేస్తే తప్పుడు సంప్రదాయానికి నాంది పలికినట్లవుతుందని, మమత, స్టాలిన్ సహా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులను లక్ష్యంగా చేసుకోవడానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినట్లే అవుతుందని పేర్కొన్నారు. ఢిల్లీ సీఎంగా తన బాధ్యతలను జైలు నుంచి నిర్వహించడానికి అనుమతించాలని కోర్టును ఆశ్రయిస్తానని తాజాగా పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించడం సాధ్యంకాదని భావించినందుకే తనను అరెస్టు చేసేందుకు ప్రధా ని మోదీ కుట్ర పన్నారని ఆరోపించారు. 'అరెస్టు చేస్తే నేను రాజీనామా చేస్తానని, అప్పుడు నా ప్రభుత్వాన్ని పడగొట్టాలని అనుకున్నారు. ఈ కుట్రను విజయవంతం కానివ్వను. వారి ఉచ్చులో పడను. ఇదో బూటకపు కేసు. ఏదైనా తప్పు చేసి, అక్రమంగా సంపాదించి ఉంటే.. బహుశా ఈపాటికి నేను కూడా బీజేపీలో చేరిపోయేవాడిని' అని వ్యాఖ్యానించారు. తనను బలవంతంగా జైల్లో బంధించారని ఆరోపించారు. 'ముందు రూ.100కోట్ల మద్యం కుంభకోణం అన్నారు. కొన్ని వారాల నుంచి రూ.1,100 కోట్లు అంటున్నారు. ఈ డబ్బంతా ఎటుపోయింది? ఒక పైసా నగదు గానీ నగలు గానీ రికవరీ చేశారా? ఎటువంటి ఆధారాలు లేకపోయినా మమ్మల్ని అరెస్టు చేయడానికి బూటకపు కేసు పెట్టారు' అని మండిపడ్డారు. జైల్లో నుంచే సీఎం బాధ్యతలు నిర్వర్తించడానికి అవకాశం కల్పించాలని కోర్టును కోరతామని చెప్పారు.


తల్లిదండ్రులతో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

తల్లిదండ్రులను ఎందుకు వేధిస్తున్నారు?

ఆప్ ఎంపీ స్వాతీ మాలివాల్‌పై దాడి వ్యవహారంలోకి అస్వస్థులైన తన తల్లిదండ్రులను లాగొద్దని ప్రధాని మోదీకి కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. 'ఈరోజు మీరు అన్ని హద్దులు దాటారు. నన్ను వేధించడానికి అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులైన నా తల్లిదండ్రులను టార్గెట్ చేశారు. నా తల్లి అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. నన్ను అరెస్టు చేసిన మార్చి 21నే ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయింది. నా తండ్రికి 85ఏళ్లు. ఆయనకు వినికిడి సమస్యలున్నాయి. వారినెందుకు వేధిస్తున్నారు? ఆ దేవుడు విమ్మల్ని క్షమించడు' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజధాని ఓటెటు?

ఢిల్లీలో రేపు ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్

- 80% పైగా ఉద్యోగులు, కార్మిక వర్గాలే..
- మూడోసారీ క్లీన్‌స్వీప్ చేసేలా బీజేపీ పట్టు
- ఇండియా కూటమిలో కాంగ్రెస్-ఆప్ పోరాటం

న్యూఢిల్లీ, మే 23: వరుసగా రెండుసార్లు క్లీన్ స్వీప్ చేసిన బీజేపీ.. మూడోసారీ అదే లక్ష్యంతో కదులుతోంది. ఆ పార్టీని ఎలాగైనా నిలువరించాలని ఆప్-కాంగ్రెస్ పట్టుదలగా పోరాడుతున్నాయి..! దేశ రాజధాని ఢిల్లీలో వీటి మధ్య సామాన్యుడి సమస్యలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. పక్కా ఇళ్ల నిర్మాణం, తాగునీరు సమృద్ధిగా అందకపోవడం, విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు, ధరల పెరుగుదల వంటివి ఎన్నికల్లో ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేయనున్నాయి. శనివారం ఢిల్లీలోని ఏడు సీట్లకూ పోలింగ్ జరగనుంది. 2014, 2019లో వీటన్నిటినీ గెల్చుకున్న బీజేపీ ఈసారి నాలుగుచోట్ల అభ్యర్థులను మార్చడం గమనార్హం. డాక్టర్ హర్షవర్ధన్ వంటి సీనియర్ నాయకుడినీ పక్కనపెట్టింది. గతంలో విడివిడిగా పోటీ చేసి భంగపడిన ఆప్, కాంగ్రెస్ ప్రస్తుతం ఇండియా కూటమిలో భాగంగా పొత్తుపెట్టుకుని బరిలో దిగాయి. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్4, కాంగ్రెస్ 3 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. గురువారం సాయంత్రంతో ఢిల్లీలో ప్రచారం ముగిసింది.

కీలక సమయంలో..

మద్యం కుంభకోణంలో బెయిల్ లభించిన సీఎం కేజ్రీవాల్ కీలకమైన ప్రచారానికి అందుబాటులోకి రావడం ఆప్ శ్రేణులను ఉత్తేజపరిచింది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీకి పట్టం కట్టిన హస్తిన ఓటర్లు, శాసనసభకు మాత్రం ఆప్‌నే ఆదరించారు. కాగా, ఢిల్లీ ఓటర్లలో 80 శాతం ఉద్యోగులు, కార్మికవర్గాల వారే. వీరంతా ఇప్పుడు తమ సమస్యలపై గట్టిగా ప్రశ్నిస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన కాందిశీకులకు తోడు దుకాణాల్లో పనిచేసేవారు, రిక్షా పుల్లర్లు అధికంగా ఉండే ఈశాన్య ఢిల్లీలో పక్కా ఇళ్లనిర్మాణం ప్రధాన అంశంగా మారింది. '20ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నాం. అభివృద్ధి ఏమీలేదు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి' అని బిహారీ కార్మికురాలు భోలాదేవి వాపోయింది. వాయవ్య ఢిల్లీ నియోజకవర్గం కిందకు వచ్చే జహంగీర్‌పురిలో డ్రైనేజీలు నిత్యం పొంగిపొర్లుతూ మురుగంతా వీధుల్లోకి వస్తోందని, పిల్లలు తరచూ అస్వస్థతకు గురవుతున్నారని మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. స్వచ్ఛమైన తాగునీరు చాలా తక్కువ సమయమే సరఫరా అవుతోంది. డ్రగ్స్, హింస, చోరీలు వంటివి చాలా సాధారణం మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, రాష్ట్రపతి భవనం, పార్లమెంటు, సుప్రీంకోర్టు, ప్రధానమంత్రి నివాసం సహా ప్రముఖులు ఉండే న్యూఢిల్లీ నియోజకవర్గంలోనూ కొన్ని ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కొరవడ్డాయి.



అభ్యర్థుల మార్పిడితో..

చాందినీ చౌక్‌లో డాక్టర్ హర్షవర్ధన్‌ను కాదని వ్యాపారవేత్త ప్రవీణ్ ఖండేల్వాల్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి జైప్రకాశ్ అగర్వాల్ పోటీ చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ టికెట్‌ను మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్వయంగా వద్దని చెప్పడంతో హర్ష్ మల్హోత్రాను బరిలో దింపింది. ఇక్కడ ఆప్ కుల్దీప్‌కుమార్ నిలిచారు. న్యూఢిల్లీ స్థానంలో కేంద్ర మంత్రి మీనాక్షి లేఖిని కాదని దివంగత అగ్రనేత సుష్మాస్వరాజ్ కుమార్తె బంసూరీ స్వరాజ్‌ను దింపింది. ఈమె ఆప్ అభ్యర్థి సోమ్‌నాథ్ భారతిని ఢీకొంటున్నారు. అత్యంత జనసాంద్రత ఉండే ఈశాన్య ఢిల్లీలో మనోజ్ తివారీ (బీజేపీ), విద్యార్థి నాయకుడు కన్హయ్యకుమార్ (కాంగ్రెస్) మధ్య పోటీ ఆసక్తి రేపుతోంది. బిహారీలు ఎక్కువగా ఉండే ఇక్కడ కన్హయ్యకు ఆదరణ కనిపిస్తున్నా ఆప్ నుంచి మద్దతు పెద్దగా లేదు. తివారీ భోజ్‌పురీ నటుడు. దక్షిణ ఢిల్లీలోనూ బీజేపీ అభ్యర్థిని మార్చింది. కన్నాట్‌ప్లేస్ (ఎస్సీ)లోబీజేపీ-ఆప్ హోరాహోరీ తలపడుతున్నాయి.

77 ముస్లిం వర్గాలకు రిజర్వేషన్లు రద్దు

- మరో 37 ఇతర ఓబీసీ కులాలకు కూడా..
- కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

కోల్‌కతా, మే 23: పశ్చిమ బెంగాల్‌లో 2010 నుంచి గత 14 ఏళ్లలో రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు 114 వర్గాలను ఓబీసీల్లో చేర్చడాన్ని కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. ఆయా వర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్లను కొట్టేసింది. 2010 ఏప్రిల్ నుంచి ఆర్నెల్ల వ్యవధిలో అప్పటి కమ్యూనిస్టు ప్రభుత్వం 77 ముస్లిం వర్గాలకు(క్లాసెస్) రిజర్వేషన్లు ఇచ్చింది. వీటిని కోల్‌కతా హైకోర్టు కొట్టేసింది. మొత్తం ముస్లిములను ఓబీసీలుగా పరిగణించే ప్రయత్నం జరిగిందని జస్టిస్ తపబ్రత చక్రవర్తి, జస్టిస్ రాజశేఖర మంథాలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. రాజకీయ కారణాలతోనే ఈవర్గాలను బీసీలుగా పరిగణించే ప్రయత్నం జరిగిందని పేర్కొంది. 77వర్గాలను ఓటుబ్యాంకుగా పరిగణించే ఓబీసీలుగా గుర్తించారనేది జరిగిన సంఘటనల క్రమం స్పష్టం చేస్తోందని చెప్పింది. ఆ తర్వాత 2012 ఓబీసీ రిజర్వేషన్ చట్టం కింద తృణమూల్ ప్రభుత్వం గత పుష్కరకాలంలో మరో 37 వర్గాలను ఓబీసీలుగా గుర్తించడాన్నీ హైకోర్టు కొట్టేసింది. 1993నాటి ఓబీసీ కమిషన్ చట్టాన్ని అనుసరించి వీరిని ఓబీసీలుగా గుర్తించలేదని చెప్పింది. గత పద్నాలుగేళ్లుగా 114వర్గాలకు ఇచ్చిన దాదాపు 5లక్షల ఓబీసీ కుల్రధువీకరణ పత్రాలను ధర్మాసనం రద్దు చేసింది. ఇప్పటికే ఆయా వర్గాలు రిజర్వేషన్ల కింద అందుకున్న ఫలాలను వెనక్కి తీసుకోరాదని చెప్పింది.

ఐఐటీయన్లకు ఉద్యోగాలు కరువు

మొదటిపేజీ తరువాయి

ధీరజ్‌సింగ్ సమాచారహక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తుకు లభించిన సమాచారం ద్వారా ఈ వివరాలు తెలిశాయి. కోర్సు పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగాలు దొరకని పరిస్థితుల నేపథ్యంలో పలు ఐఐటీలు.. వివిధ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాలుగా ఉన్న తమ పూర్వ విద్యార్థులకు లేఖలు రాసి, వారి సహకారాన్ని అర్థించినట్లు వెల్లడైంది. ప్రస్తుత బ్యాచ్‌లో దాదాపు 400 మంది ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఇంకా ఉద్యోగాలు లభించలేదని, వారికి తమ తమ కంపెనీల్లో అవకాశాలు లభించేలాగానీ, ఇతర కంపెనీలకు సిఫార్సు చేయటంగానీ, అప్రెంటిషిప్ దొరికేలాగానీ సహకరించాలని పేర్కొంటూ ఢిల్లీ ఐఐటీలోని కెరీర్ సర్వీస్ కార్యాలయం తమ పూర్వ విద్యార్థులకు మెయిల్ చేసింది. 2023-24 బ్యాచ్‌కు చెందిన పట్టభద్రుల్లో దాదాపు 10 శాతం (250) మందికి ఇంకా ప్లేస్‌మెంట్లు లభించలేదని పేర్కొంటూ ఐఐటీ బాంబే కూడా పూర్వ విద్యార్థుల సాయం కోరింది. కాగా, ఐఐటీ బాంబేలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన గత ఏడాది బ్యాచ్‌కు చెందిన 329 మందికి, 2022 బ్యాచ్‌కు చెందిన 171 మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు లభించలేదని ఆర్‌టీఐ సమాచారం వెల్లడించింది. మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బిట్స్ రెండు నెలల కిందటే పూర్వ విద్యార్థుల సాయం కోరుతూ మెయిల్ చేసిందని, ఇదే బాటలో ఐఐటీలు లేఖలు పంపుతున్నాయని తెలిసింది. దీనిపై ధీరజ్‌సింగ్ మాట్లాడుతూ, రెండేళ్ల కిందట ప్లేస్‌మెంట్ దొరకని ఐఐటీ విద్యార్థుల సంఖ్య 3,400 కాగా, ఈ ఏడాది అది 7 వేలకుపైగా పెరిగిందన్నారు. ఈ పరిణామంపై బిట్స్ గ్రూపుసంస్థల వీసీ వీ రాంగోపాల్‌రావు స్పందిస్తూ.. 'ఈ ఏడాది చాట్ జీపీటీ తదితర లార్జ్ లాంగ్వేజ్ మోడళ్ల ప్రభావం గణనీయంగా ఉంది. ముగ్గురు పని చేసే చోట ఇద్దరితో నడుస్తోంది. అదీగాక ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో అనేక సంస్థలు నియామకాల విషయంలో వేచి చూసే ధోరణితో ఉన్నాయి. అందువల్లే ప్లేస్‌మెంట్లు 20 నుంచి 30 శాతం తగ్గాయి' అని విశ్లేషించారు.

కర్నూలు జిల్లాలో బోల్తాపడిన బస్సు

▸▸ ఇద్దరు బాలికలు దుర్మరణం.. 15 మందికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన బస్సు, (ఇన్‌సెట్) మృతులు

కోడుమూరు (రూరల్), మే 23: ప్రైవేటు బస్సు బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరు బాలికలు మృతి చెందగా మరో 15 మంది తీవ్రంగా, 12మంది స్వల్పంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. బిస్మిల్లా ట్రావెల్స్‌కు చెందిన బస్సు బుధవారం రాత్రి హైదరాబాదు నుంచి ఆదోనికి బయలుదేరింది. కోడుమూరు మండలం ప్యాలకుర్తి స్టేజీ దాటాక ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి కొద్దిగా ముందుకెళ్లాక బస్సు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. హైదరాబాదులోని బాలానగర్‌లో ఉంటున్న కృష్ణవేణి ఇంటర్ ఒకేషనల్ పరీక్ష రాయడానికి ఆదోనికి వెళ్తోంది. ఆమె వెంట వస్తున్న బాబాయి కుమార్తె లక్ష్మి (13), అన్న కుమార్తె గోవర్ధని (7) ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ బాలనరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను అతికష్టం మీద బయటకు తీయించారు. గాయపడ్డ వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుమల, మే23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, లేపాక్షి సర్కిల్ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సర్వదర్శన భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 24 గంటల దర్శన సమయం పడుతోంది. కాగా, తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ కన్నులపండువగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి గరుడుడిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ల కోటా

ఆగస్టు నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను టీటీడీ శుక్రవారం విడుదల చేయనుంది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.



పున్నమి గరుడ సేవకు హాజరైన భక్తులతో ఆలయం ముందు రద్దీ

ఆంధ్ర వెళ్లి అన్నతో తేల్చుకోవాలని గతంలోనే షర్మిలకు చెప్పా : వీహెచ్



రాజమహేంద్రవరం సిటీ, మే 23 : మూడేళ్ల క్రితమే షర్మిల ఆంధ్ర రాజకీయాల్లోకి వచ్చి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి తన అన్నతో తేల్చుకోవాలని గతంలోనే తాను షర్మిలారెడ్డికి చెప్పానని గుర్తుచేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ కళాశాలలో అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో మరొక ఐదేళ్లలో పరిస్థితులన్నీ సర్దుకుని కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఎన్‌డీఏ అవుట్ కావడం ఖాయమని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా కూటమిపై ప్రధాని మోదీ ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని నెలకొల్పాలని నిర్ణయించామని,రాజమహేంద్రవరంలో విగ్రహాన్ని తయారు చేస్తున్న వడయార్‌ను కలిసి విగ్రహాన్ని పరిశీలించామన్నారు.

సీపెట్‌లో దరఖాస్తులకు 31 వరకు గడువు

విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)లో డిప్లమో కోర్సుల్లో చేరడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ), బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ - పీపీటీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు https://cipet.24onlineregistration.org ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన ఏపీఈఏపీ సెట్

జేఎన్టీయూకే, మే 23: ఏపీఈఏపీసెట్-2024 ఆన్‌లైన్ ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్షలు ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో గురువారం ఉదయం సెషన్‌తో ప్రశాంతంగా ముగిసినట్టు సెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఏపీఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగానికి అన్ని సెషన్‌లకు కలిపి 2,74,213 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,58,373 మంది హాజరయ్యారని, 94.22 శాతం హాజరు నమోదైనట్టు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన పరీక్షలకు అన్ని సెషన్‌లకు కలిపి 88,638 మంది హాజరుకావాల్సి ఉండగా 80,766 మంది హాజరయ్యారని, 91.12 శాతం హాజరు నమోదైందన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన పరీక్ష ప్రాథమిక కీని విడుదలచేయడంతో పాటూ రెస్పాన్స్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చన్నారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షల ప్రాథమిక కీ ని శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదలచేస్తామని, ఈనెల 26వతేదీ ఉదయం 10 గంటల వర కూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చని కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి 25శాతం వెయిటేజీ మార్కులను ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా తీసుకోనున్న నేపథ్యంలో ఏపీ రెగ్యులర్ ఇంటర్ విద్యార్థులు కాకుండా ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు తమ మార్కులను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, వాటి ద్వారా వారికి ర్యాంకులు కేటాయిస్తారని కన్వీనర్ తెలిపారు.

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంట్

▸▸ టెన్త్ రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలు విడుదల

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. టెన్త్ సప్లిమెంటరీకి 1,61,877 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 96,938 మంది బాలురు, 64,939 మంది బాలికలున్నారు. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ పరీక్షల విభాగం 685 కేంద్రాలు ఏర్పాటు చేసింది. 31 వరకు రెగ్యులర్ విద్యార్థులకు, జూన్ 3 వరకు ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 1 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 5,03,459 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,65,872 మంది బాలురు, 1,37,587 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 861 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. అలాగే పదో తరగతి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఫలితాలను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 55,966 మంది దరఖాస్తు చేసుకోగా, 43,714 మంది పేపర్ల ఫలితాలు విడుదల చేశామని, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా వీటిని విద్యార్థులు తెలుసుకోవచ్చని వివరించారు. మిగిలిన వారి ఫలితాలు త్వరలోనే విడుదల చేస్తామన్నారు.



Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) - 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Sri Santosh Honda - 7207333222, 8662544979; Anvita Honda - 9225922599, 0866-6628333; Vihari Honda - 9703247365, 9703218817; BHAVANIPURAM: Vihari Honda - 9703218820; NUZIVIDU: Srishivani Honda - 7893194444, KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-295446, 8977836666; ONE TOWN (VIJAYAWADA): Anvita Honda - 8142941414; GUDIVADA: Pruthvi Honda - 8297642888, 9491803888; KAANURU: Sri Santosh Honda - 7207235566, 9908824249; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; KAIKALURU: Pruthvi Honda - 9642854888, 8297681888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; NANDIGAMA: Apple Honda - 7660867722; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; VUYYURU: Pruthvi Honda - 8142026888, 8297895888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966; KANKIPADU: Sri Santosh Honda - 9949422233; HANUMAN JUNCTION: Anvita Honda - 9515028062, 9985775959.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సునాక్ సాహసం

వర్షం జోరుగా కురుస్తున్న వేళ, లండన్‌లోని తన అధికారని వాసం 10 డౌనింగ్ స్ట్రీట్ మెట్లమీద నిలబడి, చినుకులు మీదపడుతూండగానే బుధవారం బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ సార్వత్రిక ఎన్నికల ప్రకటన చేశారు. జూలై 4న చాలాముందుగా ఎన్నికలు జరపాలన్న ఆ నిర్ణయం అత్యధికులకు ఆశ్చర్యం కలిగించింది. ముందస్తు ఎన్నికలకు పోవాలన్న నిర్ణయాన్ని రాజుగారికి చెప్పానని, పార్లమెంట్ రద్దుకు ఆయన అనుమతించారని సునాక్ తన ప్రసంగంలో తెలియచేశారు. నిబంధనల ప్రకారం, వచ్చే ఏడాది జనవరిలోగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తే చాలు. అందువల్ల, ఈ ఏడాది చివర్లో ఉండవచ్చునని అంతా అనుకున్నారు. భారతీయ మూలాలున్న తమ ప్రధాని బుర్రలో ముందస్తు ఆలోచన మెదులుతోందని అనుమానం వచ్చి, బుధవారమే పార్లమెంటులో కొందరు ఎన్నికలు ఎప్పుడు అని ఓ ప్రశ్న వేశారు కూడా. ఈ ఏడాది ద్వితీయార్థంలో అని సునాక్ సమాధానం చెప్పారు. ఏడాదిలో రెండో సగం అంటే కనీసం జూలై కావాలి కానీ, ఇలా ఆరువారాల్లోగానే ఆయన ఎన్నికలకు పోతారని ఎవరూ ఊహించలేదు. హడావుడిగా మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, అందుకోసం దేశవిదేశాల్లో ఉన్న మంత్రులందరినీ రప్పించి, చర్చించి ఈ ముందస్తు ముచ్చటను సునాక్ దేశ ప్రజలకు తెలియచేశారు.

సునాక్ ఈ ప్రకటన చేయగానే, ఆయన భార్య, ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కుమార్తె అక్షతామూర్తి సామాజిక మాధ్యమాల్లో దంపతులిద్దరి ఫోటోతో పాటు 'నీవు వేసే ప్రతీ అడుగులోనూ నీ వెంటే ఉంటా' అంటూ ఓ వ్యాఖ్యను పోస్టుచేశారు. దేశ ప్రజలు కూడా తన వెంటే ఉండాలన్న లక్ష్యంతో సునాక్ ఈ ముందస్తు నిర్ణయం తీసుకున్నమాట నిజం. పద్నాలుగేళ్ళుగా బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ అధికారంలో ఉంది. వరుస ప్రధానులు చేసిన తప్పిదాలతో ఆ పార్టీ ఇప్పటికే అప్రదిష్టపాలైంది. ఉద్ధరిస్తాడనుకున్న సునాక్ కూడా పార్టీకి నష్టం చేశాడని, ఆయన పాపులారిటీ తగ్గుతోందని కొందరు నమ్ముతున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఒపీనియన్ పోల్స్ అన్నీ ఢంకా బజాయిస్తున్న తరుణంలో, సునాక్ ఈ అడుగు వేశారు. దేశాన్ని ఆర్థికంగా ఒడ్డునపడేస్తానన్న హామీ నెరవేరి, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్న ఈ సమయంలో ఎన్నికలకు పోయినప్పుడే విజయావకాశాలు మెరుగుపడతాయని ఆయన నమ్మినట్టు ఉంది. బ్రిటన్ తన భవిష్యత్తును ఎంచుకోవాల్సిన తరుణమిది అంటూ తనను ఎన్నుకోవాల్సిన గురుతరబాధ్యత బ్రిటిషర్లపై ఉందని ఈ ప్రసంగంలో సునాక్ గుర్తుచేశారు. ఇదీ నా గ్యారంటీ అంటూ ఉజ్వలమైన భవిష్యత్తుకు, చక్కని భద్రతకు హామీ పడ్డారు. ఆర్థికమంత్రిగా, ప్రధానమంత్రిగా తాను దేశానికి చేసిందేమిటో చెప్పుకొచ్చారు. ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా కంటే బ్రిటన్ ఆర్థికం ఎంతో బాగుందని, కష్టపడి సాధించినదంతా సుస్థిరపడి, మరింత మెరుగ్గా కొనసాగడానికే తాను ముందస్తుకు పోతున్నానని ఆయన చెప్పుకొచ్చారు.

2022 అక్టోబర్‌లో నలభైరెండేళ్ల వయసులో సునాక్ బ్రిటన్ ప్రధాని అయ్యారు. 2010లో టోరీలు అధికారంలోకి వచ్చాక ఈయన ఐదో ప్రధాని. ఈ పద్నాలుగేళ్ళకాలంలో టోరీల ఏలుబడిలో, డేవిడ్ కెమెరూన్ తీసుకున్న కీలకమైన బ్రెగ్జిట్ నిర్ణయం సహా చాలా సమస్యలను, వివాదాలను దేశం ఎదుర్కొంది. యూరోపియన్ యూనియన్‌నుంచి వేరుపడే ఆ సుదీర్ఘ ప్రక్రియ తెరీసా మే వంటి నాయకులను రాజకీయంగా బలితీసుకుంది. బోరిస్ జాన్సన్ సంగతి చెప్పనే అక్కరలేదు. బ్రెగ్జిట్‌ను ఒక కొలిక్కి తీసుకువచ్చినప్పటికీ, కొవిడ్ నిబంధనలను ఉల్లంఘించి లిక్కర్ పార్టీలు చేసుకొని ఆయన అప్రదిష్టపాలైనారు, తప్పు కోవడానికి ఒప్పుకోకుండా పార్టీ పరువు తీశారు. తనపై తిరుగుబాటు చేసిన సునాక్‌ను ప్రధానిగా ఎన్నుకోవద్దని టోరీలను జాన్సన్ ఒత్తిడి చేయడంతో లిజ్‌ట్రస్ రంగప్రవేశం చేసినప్పటికీ, ఇల్లు చక్కదిద్దడం చేతకాక ఆమె కొద్దిరోజుల్లోనే తప్పుకున్నారు. చివరకు అన్యథా శరణం నాస్తి అన్నట్టుగా బరిలో ఎవ్వరూ నిలవకుండా అధికారపక్ష ఎంపీలంతా సునాక్‌కే పగ్గాలు అప్పగించారు.

వర్షం వల్ల సునాక్ చెబుతున్నది చాలామందికి సరిగా వినబడలేదు. దీనికి తోడు ఆయన మాట్లాడుతున్నంత సేపూ, అధికారిక నివాసానికి కొంతదూరంలో నిరసనకారులు లౌడ్ స్పీకర్లలో 1977నాటి విపక్ష లేబర్ పార్టీ విజయగీతికను వినిపిస్తూనే ఉన్నారు. తాను చెబుతున్నది మీడియా ప్రతినిధులకు వినబడటానికి వీలుగా సునాక్ గట్టిగా మాట్లాడాల్సి వచ్చిందట. ఆయన చెబుతున్నదీ, ఏడాదిన్నరగా దేశానికి చేసిందీ ప్రజలకు అర్థమైందో లేదో ఎన్నికల్లో తేలుతుంది.

'జీవించివున్న కీర్తిశేషుడు'

తెలుగు నాటకరంగంలో ప్రదర్శనాపరంగా విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన వ్యక్తి, నాటకరంగ ప్రయోక్త 'నటరాజు' కుప్పిలి వెంకటేశ్వరరావు. ఆధునిక నాటకరంగానికి సేవ చేసిన వారిలో ఆయన మొదటివరుసలో ఉంటారు. నాటకరంగాన్ని రెండు దశాబ్దాల పాటు ప్రభావితం చేసిన మహానటుడు. అందుకే సినీనటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఆయన్ని 'జీవించి వున్న కీర్తిశేషుడు' అని కీర్తించారు. మాధవపెద్ది వెంకట్రామయ్య, స్థానం నరసింహారావు, బళ్ళారి రాఘవాచారి వంటి నాటకరంగ ఉద్దండుల తర్వాత శిష్యుల్ని తయారుచేయడంలో వెంకటేశ్వరరావు చేసిన కృషి మరువలేనిది. నాటకరంగంలో వెంకటేశ్వరరావు వేసిన కొత్తబాటలు, చేసిన కొత్త ప్రయోగాలు ముందు తరాలకు ఆదర్శంగా నిలిచాయి. ఎలాంటి సంభాషణలు లేకుండా ఆయన దర్శకత్వం వహించి, ప్రదర్శించిన 'బెత్తం మనిషి' నాటకమే అందుకు ఉదాహరణ.

కుప్పిలి వెంకటేశ్వరరావు 1923 నవంబరు 20న జన్మించారు. ఆయన స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు. తల్లి సీతయ్యమ్మ గృహిణి. తండ్రి కుప్పిలి ప్రకాశరావు. రైల్వేలో చిరుద్యోగి. వెంకటేశ్వరరావు రాజమండ్రి గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల పూర్తి చేయలేకపోయారు. 1945లో దక్షిణ మధ్య రైల్వేలోని శ్రీకాళహస్తి స్టేషన్‌లో చిన్న ఉద్యోగంలో చేరారు. 1946 విజయవాడ రైల్వే డివిజన్ ఆఫీస్‌లోకి బదిలీ అయి, 1960 వరకు అక్కడే ఉండిపోయారు. మద్రాసులో ఉన్నప్పుడు ప్రఖ్యాత దర్శక, నిర్మాతలు బి.యన్. రెడ్డి, చక్రపాణిల అభిమానం పొందారు. 1961లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో రంగస్థల విభాగంలో దర్శకునిగా చేరారు.



మొట్టమొదటి నాటకంలోనే ఉత్తమ నటనకు ప్రథమ బహుమతి అందుకున్నారు కుప్పిలి వెంకటేశ్వరరావు. విజయవాడలో రైల్వే ఉద్యోగంలో స్థిరపడ్డాక మనసా, వాచా, కర్మణా నాటకరంగానికి అంకితమైపోయారు. ఎన్నో నాటికలు, నాటకాలు, ప్రదర్శించారు. మరెన్నో బహుమతులు, బిరుదులను అందుకున్నారు. వాటితో తృప్తిపడక దర్శకత్వం వహించి, నాటకాలను మథించి... నటనలో, ప్రదర్శనలో అపూర్వమైన నూతన పోకడలు సృష్టించారు.

విషపాత్ర, కరణీకం, కన్యాశుల్కం, కీర్తిశేషులు, దొంగవీరుడు, కప్పలు, విషాదం, రాగరాగిణి వంటి అనేక నాటకాలలో వెంకటేశ్వరరావు నటించారు, దర్శకత్వం వహించారు. 1945లో కాలేజీ వార్షికోత్సవాల్లో వెంకటేశ్వరరావు నటనను గుర్తించిన రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ పింగళి వెంకటరామయ్య తాను రచించిన 'కరణీకం' నాటకంలో వీరికి 'పాపయ్యశాస్త్రి' పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు. మొట్టమొదటి నాటకంలోనే ఉత్తమ నటనకు ప్రథమ బహుమతి అందుకున్నారు.

1948లో విజయవాడలో రైల్వే ఉద్యోగంలో స్థిరపడ్డాక మనసా, వాచా, కర్మణా నాటకరంగానికి అంకితమైపోయారు. ఎన్నో నాటికలు, నాటకాలు, ప్రదర్శించారు. మరెన్నో బహుమతులు, బిరుదులను అందుకున్నారు. వాటితో తృప్తిపడక దర్శకత్వం వహించి, నాటకాలను మథించి... నటనలో, ప్రదర్శనలో అపూర్వమైన నూతన పోకడలు సృష్టించారు. 'రక్తకన్నీరు' సిహెచ్. నాగభూషణం, వెంకటేశ్వరరావు సహోద్యోగులు కావడంతో కలసి నాటకాలు ఆడేవారు. 1948లో 'నవ్య కళామండలి' నాటక సంస్థను స్థాపించి, ముద్దుకృష్ణ రచించిన 'టీ కప్పులో తుఫాను', 'కళోపాసన' నాటికలను చాలాసార్లు ప్రదర్శించారు. కర్నాటి లక్ష్మీనరసయ్య శిక్షణలో 'తుఫాను' నాటకంలో 'రాఘవరెడ్డి' పాత్ర ధరించి, మంచి పేరు తెచ్చుకున్నారు. 'రాగరాగిణి' నాటకాన్ని తిలకించిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ అద్భుతమని కొనియాడారు. సాధారణంగా అన్ని నాటకాలలో డైలాగ్‌లను అయుధంగా చేసుకునే వెంకటేశ్వరరావు... గొల్లపూడి మారుతీరావు చేత రాయించుకొన్న 'రాగరాగిణి' నాటకంలో 'రఘు' పాత్ర ద్వారా మౌనంతో, చూపులతో, భావవ్యక్తీకరణంతో ఎన్నో డైలాగుల పెట్టుగా... ఎలా చేయవచ్చో చేసి చూపించారు.

నాటక రంగం పట్ల వెంకటేశ్వరరావుకున్న అంకితభావం అచంచలమైనది. అతని పది నెలల కొడుకు (మొదటి సంతానం) చనిపోతే ఇంటిల్లిపాదీ రోదిస్తున్న సమయంలో కూడా అరగంటలో వస్తానని ఆకాశవాణి (విజయవాడ) కేంద్రం చేరుకొని కొఱ్ఱపాటి గంగాధరరావు రచన 'నా బాబు' నాటిక లైవ్ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆ నాటికలో ఆయన కొడుకు చనిపోతాడు. ఇంకోసారి రాఘవ రాసిన 'కనక పుష్యరాగం' నాటక ప్రదర్శనకు న్యూఢిల్లీ బయలుదేరుతున్న సమయంలో, తాను ఎంతో అభిమానించే తన సోదరి మరణవార్త తెలిసింది. అయినా దుఃఖాన్ని కొన్ని క్షణాలు దిగమింగుకొని ట్రెయిన్‌లో న్యూఢిల్లీ చేరి నాటకాన్ని అద్భుతమైన రీతిలో రక్తికట్టించారు. 1971లో వెంకటేశ్వరరావును పరీక్షించిన డాక్టర్లు, నాటకాలు మానేస్తే పదేళ్ళు, లేకపోతే రెండేళ్ళు బతుకుతావని చెప్పారు. "నాటకాలు వేయకపోతే నేను ఉండి ఏం ప్రయోజనం" అంటూ నాటకాల్ని కొనసాగించారు.

శ్రీమతి జయశ్రీ, వాణీబాల, కె. విజయలక్ష్మి, 'పావలా' శ్యామల, పొట్టి ప్రసాద్, సి.హెచ్. కృష్ణమూర్తి, జి.వి. సుబ్బారావు. సాక్షి(రంగావజ్ఝల) రంగారావు, ధం, తంబు, వంకాయల సత్యనారాయణ, మిశ్ర, కృష్ణచైతన్య, కొత్తుర్తి భాస్కరరావు వీరి శిష్యగణంలో కొందరు. అనేక సార్లు నాటక పోటీలకు గుణనిర్ణేతగా వ్యవహరించారు. నటీనటుల ప్రావీణ్యానికే మొదటి మార్కు ఇవ్వడంలో వెంకటేశ్వరరావు ఎప్పుడూ రాజీపడలేదు. ఆశ్రితజన పక్షపాతాన్ని దరిచేరనిచ్చేవారు కాదు.

చిత్రసీమ కూడా వెంకటేశ్వరరావుని సాదరంగా ఆహ్వానించింది. ఆయన నటించిన తొలి చిత్రం 'ఇద్దరు మిత్రులు'. 1960–61లో ఆత్రేయ దర్శక, నిర్మాతగా వ్యవహరించిన 'వాగ్దానం' సినిమాలో హీరో తండ్రిగా నటించడమే కాక, సహాయ దర్శకులుగా కూడా పనిచేశారు. చివరి చిత్రం 'కన్నెవయసు'. ఆయన ప్రతిభకు గీటురాయిగా... నటరాజు, రంగస్థల నటసామ్రాట్, నటచతురానన, రంగభాస్కర వంటి బిరుదులు లభించాయి. సికింద్రాబాదులోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ వారు 1973, మార్చి 12న హైదరాబాదులోని రవీంద్రభారతిలో సన్మానిస్తున్నప్పుడు "ఇది నా 116వ సన్మానం. ఇక నేను సన్మానాలకు ఒప్పుకోవడం లేదు. నేను పుట్టి పెరిగిన రైల్వేశాఖలోని నా పూర్వ సహచరులు కోరినందువల్ల కాదనలేక ఒప్పుకున్నాను. ఇదే నా జీవితంలో చివరి సన్మానం" అన్నారు. ఆ మహానటుడి అంతర్వాణి ఎందుకు పలికించిందో కానీ, తర్వాత కొద్ది రోజులకు 1973, మే 25న కీర్తిశేషులయ్యారు. భౌతికంగా ఆయన లేకపోయినా తెలుగు నాటకరంగం జీవించినంత కాలం ప్రేక్షకుల గుండెల్లో 'నటరాజు' కుప్పిలి వెంకటేశ్వరరావు బతికే వుంటారు.

○ కలిమిశ్రీ
ప్రధాన కార్యదర్శి, నవ్యాంధ్ర రచయితల సంఘం


(మే 25: కుప్పిలి వెంకటేశ్వరరావు వర్ధంతి)

ఫ్రెంచ్ దర్పణంలో మోదీ భారత్!

పారిస్ కేంద్రంగా పనిచేసే 'ప్రపంచ అసమానతల పరిశోధనశాల' (World Inequality Lab) ఈ ఏడాది మార్చిలో '1922–2023 మధ్య భారతదేశంలో ఆదాయం, సంపదల అసమానతలు : ఆవిర్భవించిన ధన స్వామ్యం' అనే డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. ప్రసిద్ధ ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెటీ సారథ్యంలో నలుగురు పరిశోధకులు జరిపిన ఈ అధ్యయనం భారతదేశంలో ధనికులకూ పేదలకూ మధ్య ఆర్థిక అంతరం విపరీతంగా పెరిగిందని అది ఇప్పుడు అగ్రభాగాన ఉన్న ఒక శాతం ధనికుల వద్ద దేశ సంపదలో 40 శాతం పోగుపడిందని, జనాభాలో పైన ఉన్న 10 శాతాన్ని తీసుకుంటే అది 60 శాతానికి చేరిపోయిందనీ ఆ అధ్యయనం తేల్చింది. మిగిలిన తొంభైశాతంలో ఉన్న నలభై శాతం మధ్యతరగతి వద్ద 29 శాతం జమ కాగా అడుగున ఉన్న యాభై శాతం ప్రజలకు 6 నుంచి 7 శాతం మాత్రమే మిగిలిందని వివరించింది.

ఈ పరిశీలన స్థూలంగా ఫ్రెంచ్ విప్లవానికి ముందు ఫ్రాన్సు దేశ ఆర్థిక పరిస్థితిని పోలి ఉంది. ఇదేకాదు అనేక ఇతర అంశాల్లో కూడా ఇప్పుడు మనదేశం అప్పటి ఫ్రాన్సులానే ఉందనిపిస్తుంది. 1789లో జరిగిన ఫ్రెంచ్ విప్లవం ఫ్రాన్స్‌లో రాచరిక వ్యవస్థతో పాటు భూస్వామ్య వ్యవస్థను కూల్చివేసి మొదటిసారి మధ్యతరగతి సామాజిక వర్గాల ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. ఇది రెండు వందల ఏళ్ల ఫ్రాన్సును పాలించిన బూర్బన్ రాజవంశ నిరంకుశత్వాన్ని పెకలించింది. మనుషులకు మొదటిసారి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను పంచి ఇచ్చింది.

ఫ్రెంచ్ సమాజంలో రెండు అంతరాలు ఉండేవి. ఒకటి అవకాశాలు ఉన్న వర్గం (Privileged Class), రెండు అవకాశాలు లేని వర్గం (unprivileged class). మొదటి వర్గంలో భూస్వాములూ, మతాచార్యులూ ఉండగా మధ్యతరగతి, సామాన్యులు రెండవ వర్గంలో ఉన్నారు. మొత్తం జనాభాలో ఒక శాతం ఉన్న అవకాశాలున్న వర్గం దేశ సంపదలో నలభై శాతం కైవసం చేసుకుని ఉంది. తొంభై తొమ్మిది శాతం ఉన్న అవకాశాలులేని వర్గం మిగిలిన అరవై శాతం పంచుకోవలసి వచ్చింది. అసలు తేడా అది కాదు. నలభై శాతం సంపద కలిగిన వర్గానికి పన్నుల చెల్లింపునుంచి మినహాయింపు ఉండగా దేశ పన్నుల భారాన్నంతా సామాన్యులూ, మధ్యతరగతే మోయవలసి వచ్చింది. అందుకే ఫ్రాన్సులో 'భూస్వాములు యుద్ధాలు చేస్తారు. మతాచార్యులు ప్రార్థనలు చేస్తారు. ప్రజలు పన్నులు చెల్లిస్తారు' అనే నానుడి వచ్చింది. ఇది అటుంచితే ఫ్రాన్సులో అప్పుడున్నది రాజ్యాంగబద్ధ రాచరికం. కానీ, అది నామమాత్రమే. నిజానికి నెలకొన్నది నిరంకుశ రాచరికం. రాజ్యాన్ని ప్రశ్నించినవాళ్లు వెలుతురే కనిపించని బాస్టైల్ అనే జైలులో మరణించేదాకా నిర్బంధించబడేవారు. రాజ్యాంగాన్ని అనుసరించి ఎస్టేట్స్ జనరల్ అనే పార్లమెంట్ ఉండేది. చట్టాలు చేయడంలో రాజు దాని అనుమతి పొందవలసి ఉంది. కానీ బూర్బన్‌లు 175 సంవత్సరాలుగా దానికి ఎన్నికలు జరపలేదు. విప్లవానికి రెండేళ్ల ముందునాటికి ఆడంబరాలతో, యుద్ధాలతో ఖజానా ఖాళీ అయిపోవడంతో ధనిక వర్గంపై పన్నులు విధించక తప్పదనే ప్రతిపాదన వచ్చినపుడు ఆ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. రాజు సైతం ఆ వర్గాన్నే సమర్థించడంతో సామాన్యులు వెంట నడవగా మధ్యతరగతి నాయకత్వంలో విప్లవం చెలరేగి రాజకీయ, సామాజికవ్యవస్థల్ని పడగొట్టింది.



విప్లవానికి ముందు ఫ్రాన్సులో ఒక ఉక్కపోత వాతావరణం ఉండేది. స్వేచ్ఛగా మాట్లాడలేని, నచ్చింది తినలేని, నిజం మాట్లాడలేని, నేనీ దేశ పౌరుణ్ణి అని ప్రకటించుకోలేని ఊపిరాడనితనం ఇప్పుడు ఇక్కడ కూడా ఆవహించింది. మాంటెస్క్యూ, వోల్టేర్, రూసో, డిడిరో లాంటి మేధావులు ఫ్రెంచ్ సమాజంలో కదలిక తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటకలో పౌరసమాజం సృష్టించిన చైతన్యం లాంటిది ఇప్పుడు దేశమంతా వ్యాపించడమే మిగిలి ఉంది.

ఎవరు ప్రజలు? ప్రభుత్వం ఎవరి సంక్షేమం కోసం ఉంది? అనే ప్రశ్నలు ఫ్రెంచ్ రాజవంశానికి అర్థం కాలేదు. విప్లవం నాటి ఫ్రెంచ్ చక్రవర్తి 16వ లూయీ భార్య మేరీకి ఎప్పుడూ తమను పరివేష్టించి ఉండే ధనిక వర్గాలు కాక అసలు ప్రజలు వేరే ఉంటారని తెలియదట. అందుకే ఆమెకు ప్రజలు బ్రెడ్డు లేక అలమటిస్తున్నారని చెబితే 'బ్రెడ్డు దొరకకపోతే కేకులు తినవచ్చు కదా' అని అన్నదని అంటారు. తన రాజ్యాన్ని ఆర్థిక దుస్థితినుంచి బయటపడెయ్యడానికి, జనాన్ని ఆకలి నుంచి రక్షించడానికి తన ప్రభుత్వమే భూస్వాముల మీద మతాచార్యులమీద పన్ను విధించటానికి సిద్ధపడితే వారితో కలిసి తనకు తానే అడ్డుపడి చివరికి బలి కావడం ఫ్రాన్సు చక్రవర్తికి ఆత్మహత్యా సదృశమైంది. ఆ ఫ్రెంచ్ సందర్భం పికెటీ బృందం పరిశీలనలో తేలిన ఒక్క శాతం మంది నలభై శాతం సంపద కలిగి ఉన్న అంశంతో మొదలై ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులతో ప్రజలు కుదేలౌతుంటే, కార్పొరేట్లకిచ్చిన లక్షల కోట్ల రుణాలను మాఫీచేసి దేశ ఆర్థిక వ్యవస్థను ఆ వర్గాలకు కట్టబెట్టడుతున్న ఇప్పటి భారతీయ సందర్భంతో సరితూగుతున్నది. తమ మీద విధించిన పన్నులు చెల్లించడానికి నిరాకరించి, ప్రజల దాడులు తప్పించుకోవడానికి దేశంనుంచి పారిపోయిన ఫ్రెంచ్ భూస్వాములతో – కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పలాయనం చేసిన పెద్దమనుషులను పోల్చవచ్చు. 2014 తర్వాత పైస్థాయి వ్యాపారస్థులతో ప్రభుత్వం జట్టుకట్టడం బాగా పెరిగిపోయిందని ఈ అధ్యయనం ధ్రువీకరించడం రెండు సందర్భాల మధ్య సారూప్యతను పెంచుతున్నది.

బూర్బన్ చక్రవర్తి 14వ లూయీ సర్వ మంత్రాంగాన్ని నిర్వీర్యం చేసి అధికారాన్నంతా తన చేతుల్లోనే కేంద్రీకృతం చేసుకున్నాడు. కాలు దువ్వి మరీ యుద్ధాలు చేశాడు. తన అంత్యక్రియలకు కూడా మిగలకుండా డబ్బును దుబారా చేశాడు. 'నేనే రాజ్యాన్ని' (I am the state) అని హూంకరించాడు. ఇప్పుడు కూడా మన దేశంలో అన్నిటా అంతటా తానై వ్యవహరించే నాయకత్వాన్ని చూస్తున్నాం. అన్ని చోట్లా ఒక్క రూపాన్నే దర్శిస్తున్నాం. అనుచరుల్ని తప్ప సహచరుల్ని అనుమతించని ప్రజాస్వామ్యంలో ఉన్నాం. దేశంలో ఒక వర్గాన్ని తమ వాళ్లుగా, మరికొన్ని వర్గాల్ని ఇతరులుగా చూసే వివక్షాపూరిత పరిపాలనను గమనిస్తున్నాం. ఈ నియంతృత్వ ధోరణి గత పదేళ్లలో బాగా బలపడిన వైనాన్ని అసమానతల డాక్యుమెంట్ నిర్ద్వంద్వంగా ప్రస్తావించింది.

విద్య, వైద్యం, న్యూట్రిషన్ వంటి రంగాలలో ప్రజల పెట్టుబడిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే దేశంలో సామాన్యులే కాదు, శిష్ట వర్గంకూడా ప్రయోజనం పొందుతుందని భావించిన పికెటీ బృందం దేశంలోని 167 అత్యంత ధనిక కుటుంబాల మీద రెండు శాతం సూపర్ టాక్స్‌ను విధించాలని ప్రతిపాదించింది. ఇది ఫ్రాన్సులో విప్లవానికి తక్షణ కారణమైన ధనిక వర్గాలమీద విధించబూనుకున్న పన్నును తప్పక గుర్తుకు తెస్తుంది.

పారిస్‌ను భీకర క్షామం కమ్ముకోగా, చిన్న బ్రెడ్డు ముక్క కోసం 'అలగా జనం' కాట్ల కుక్కల్లా కొట్లాడుకుంటున్నపుడు వేల మంది పారిస్ స్త్రీలు దాదాపు పాతిక మైళ్ల దూరం ఆకలియాత్ర చేసి 'వర్సే' రాజభవనాన్ని ముట్టడించారు. తేరిపార చూస్తే ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ స్థలాల్లోనే రైతులు తమ పంటలను విక్రయించాలని నిర్దేశించిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా రాజధాని ఢిల్లీ మీద సంవత్సరం పైగా రైతులు చేసిన ముట్టడి అటువంటిదే. చట్టాలు రద్దయినా కనీస మద్దతుధర కోసం ఇప్పుడు జరుగుతున్నదీ దానికి కొనసాగింపే. ఈ సందర్భంలోనే సిఎఎ, యన్ఆర్‌సిలకు వ్యతిరేకంగా ఢిల్లీ షహీన్ బాగ్‌లో మహిళలు చేసిన ఆందోళన గుర్తుకు రాకుండా ఎలా ఉంటుంది? 'ఒక వ్యక్తి పుట్టుక, పుట్టిన చోటు, పౌరసత్వం గురించి మాట్లాడడానికి మహిళలకన్నా అర్హులెవరుంటారు?' అని రొమిలాథాపర్ వేసిన అర్థవంతమైన ప్రశ్నకు, తమ బిడ్డల, భర్తల, తల్లిదండ్రుల ఆకలి తీర్చేందుకు రాజు మీద దాడి చెయ్యడానికి పారిస్ స్త్రీల కంటే మించిన అవసరమెవరికి ఉంటుంది అనే ప్రశ్నతో అనుసంధానం సరిగ్గా కుదురుతుంది.

'కళ్లు మిరుమిట్లు గొలిపే సంపదల్ని చూపించి నాగరికత అంటున్నారు. తప్పులు జ్ఞానంగా చలామణీ అవుతున్నాయి. అణచివేతకు అదుపు అనే పేరు పెట్టారు. ఊడ్చిపారెయ్యండి ఈ వ్యవస్థ అక్రమ నిర్మాణాన్ని. అసమానతల్ని సమం చెయ్యండి. ఈ సంకెళ్లని తెంచండి' అంటూ విప్లవానికి ముందు ఫ్రెంచ్ తత్వవేత్త రూసో ప్రజలకు పిలుపు ఇచ్చాడు. కొద్దిమంది దగ్గరున్న సంపద చూపించి దేశం అభివృద్ధి చెందిందని చెప్పటం, ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం, అభూత కల్పనల్ని చరిత్రగా నమ్మబలకటం, ప్రభుత్వ వ్యవస్థల్ని ఉపయోగించి అనుకూలంగా లేనివారిని అణగద్రొక్కడం రూసో మాటల్ని ఇక్కడ ప్రాసంగికం చేస్తున్నాయి. Error miscalled knowledge అన్న ఆయన మాట ఇప్పుడు ఎంత సత్యమో కదా.

విప్లవానికి ముందు ఫ్రాన్సులో నెలకొన్న పరిస్థితులు ఇంచుమించుగా యూరప్ అంతా ఉన్నవే. కానీ విప్లవాన్ని ఫ్రాన్సులో సాధ్యంచేసింది మటుకు ఆ దేశానికి మాత్రమే పరిమితమైన మధ్యతరగతి మేధావి వర్గం. భారతదేశంలో ఒకప్పుడు బెంగాల్‌కు ఉన్న స్థానం యూరప్‌లో ఫ్రాన్సుకు ఉండేది. ఇవి రెండూ సమకాలికులకంటే ఒకరోజు ముందుంటాయి. విప్లవానికి ముందు ఫ్రాన్సులో ఒక ఉక్కపోత వాతావరణం ఉండేది. స్వేచ్ఛగా మాట్లాడలేని, నచ్చింది తినలేని, నిజం మాట్లాడలేని, నేనీ దేశ పౌరుణ్ణి అని ప్రకటించుకోలేని ఊపిరాడనితనం ఇప్పుడు ఇక్కడ కూడా ఆవహించింది. మాంటెస్క్యూ, వోల్టేర్, రూసో, డిడిరో లాంటి మేధావులు ఫ్రెంచ్ సమాజంలో కదలిక తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటకలో పౌరసమాజం సృష్టించిన చైతన్యం లాంటిది ఇప్పుడు దేశమంతా వ్యాపించడమే మిగిలి ఉంది.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలే విప్లవాలు. ఫ్రెంచ్ విప్లవం మనకు సాధించి పెట్టింది అదే. సందర్భం మారినపుడు రూపం మారుతుంది. ఐదు దశల ఎన్నికలు పూర్తయ్యేటప్పటికి రంగులు వెలిసిపోయి అసలు రూపాలు బయట పడుతున్న నేపథ్యాన, ప్రజలు సత్యాసత్యాలను గుర్తించగలుగుతున్న దశలో, దేశం మరో విప్లవం అంచుకు నడుస్తోందనే వార్తల మధ్య చరిత్ర పునరావృతిగా మిగలకూడదు, కొత్త అర్థంలో పునరావృతమే కావాలి.

■ కొప్పర్తి వెంకటరమణమూర్తి

అంటకాగేవారికి ఈసీ చర్యలు ఓ హెచ్చరిక!

రాష్ట్రంలో ఎన్నికల రోజూ, ఆ పిమ్మట కూడ పెద్దయెత్తున హింసాకాండ చెలరేగి భయానక వాతావరణం ఏర్పడటంతో ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించి కొందరు పోలీసు అధికారులు, ఉద్యోగులపై కఠినచర్యలు తీసుకోవటం అనివార్యం అయింది. నిప్పు తెలిసి ముట్టుకున్నా, తెలియక ముట్టుకున్నా కాలక మానదు అన్నట్లు కొందరు అధికారులు దౌర్జన్యకాండకు సహకరించారనీ, మరికొందరు సహకరించకపోయినా అల్లర్ల నియంత్రణలో విఫలమైనారని ఎన్నికల సంఘం ఈ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నది. ఇటువంటి చర్యల వల్ల మున్ముందు మన పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం కూడ రాజకీయ మొహమాటానికి తావు లేకుండా సంఘ విద్రోహశక్తుల పట్ల కఠినంగా వ్యవహరించేందుకు ఉపకరిస్తాయి. అలా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే, న్యాయస్థానాల, ప్రజల మద్దతు కూడా లభిస్తుంది, పాలన గాడిలో పడుతుంది. మున్ముందు ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇదే ఒరవడి కొనసాగిస్తే సమాజానికి మాత్రమే గాక వారికి, వారి కుటుంబాలకు భద్రత లభిస్తుంది.

ఒకప్పుడు నేరస్థులు, రౌడీలకి పోలీసులంటే హడల్, వారి కంటబడకుండా తప్పించుకుని తిరిగేవారు. మరి నేడో... పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగంపైనే దాడులు పెరిగిపోతుంటే వారిని వారే కాపాడుకోలేని దుస్థితి ఏర్పడింది. శాంతిభద్రతలు కాపాడటం ప్రభుత్వ ముఖ్య బాధ్యత. మరోవైపు సరిహద్దుల వద్ద సైనికుల వలె పోలీసులు కూడ నిత్యం ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వారి లాగే ఎందరో ప్రాణాలకు తెగించి నిజాయితీగా విధులు నిర్వహించేవారూ ఉన్నారు. అయినా సమాజంలో వారికి తగిన గుర్తింపు లేదు. అందుకు కొంత స్వయంకృతాపరాధం కూడా ఉన్నది. పని వత్తిళ్ళతో సతమతమయ్యే పోలీసు యంత్రాంగంలోని కొందరు 'అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్లు' అమాయక, పేద ప్రజలపై చూపుతారనీ, బడా నేరస్థుల విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తారని అపప్రథ ఉన్నది. ఇకనైనా పోలీసు యంత్రాంగం సంఘవిద్రోహుల పట్ల నిక్కచ్చిగా, కఠినంగా వ్యవహరిస్తే, ఎంతటి ఘరానా నేరస్థులైనా తోకముడిచి పారిపోతారు. పోలీసులు, అధికార యంత్రాంగం కలిసికట్టుగా అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలి. అప్పుడే సమాజంలో శాంతిభద్రతలు మెరుగుపడతాయి.

– తిరుమలశెట్టి సాంబశివరావు
నరసరావుపేట


పోలింగ్‌ను పోటెత్తించిన యువత, మహిళ!

లోక్‌సభకు నాలుగోదశ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో కీలకఘట్టమైన పోలింగ్ ముగిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి రాష్ట్రంలోని అనేక పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పెద్దసంఖ్యలో బారులుతీరడం కనిపించింది. వాళ్లు ఎవరికి పట్టం కట్టారు, ఎవరిని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు అనే విషయం జూన్ నాలుగో తేదీన తెలియనుంది. అయితే పోలింగ్‌శాతం ఇంతగా పెరగడానికి, ఓటర్లు గంటల తరబడి ఓపిగ్గా క్యూలైన్‌లలో నిలబడడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి.

2024 ఎన్నికలకు ఏడాది ముందు నుంచే ఏపీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రజలను రాజకీయపక్షాలు ఎన్నికల మూడ్‌లోకి తీసుకెళ్లిపోయాయి. సభలు, సమావేశాలతో నిత్యం హోరెత్తించేశాయి. ఎన్నడూలేని విధంగా ఈసారి రాజకీయ చర్చల్లో మహిళలు, వృద్ధులు, యువత విరివిగా పాల్గొన్నారు. మారుమూల పల్లెల్లో నిర్వహించిన సభలకు సైతం వారు తరలి వచ్చారు. అలా వచ్చినవారిలో చాలామందికి ఆయా పార్టీల నేతలు ప్రోత్సాహకాలను అందించారు. సభలకు వెళ్లడంతో వారిలో రాజకీయచైతన్యం పెరిగింది. నాయకులు చెబుతున్న విషయాలను శ్రద్ధగా విని చర్చించేవారు. గ్రామీణప్రాంతాల్లో ఇది మరింత ఎక్కువగా కనిపించింది. దీనితోపాటు పత్రికలు, టీవీ చానల్స్‌తోపాటు సోషల్‌మీడియా వేదికగా వచ్చే అన్ని అంశాలను కూడ వారంతా పరిశీలించేవారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని కొనసాగించాలా? లేకపోతే చంద్రబాబు ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకోవాలా? కేంద్రంలో ప్రధాని మోదీ సర్కార్‌ను కొనసాగించాలా? ఇండియా కూటమిని గద్దెనెక్కించాలా? తమ జీవితాలకు ఎవరు భరోసానిస్తారు? సంక్షేమ పథకాలా, రాష్ట్రాభివృద్ధా, మతమా? జీవనప్రమాణాల పెరుగుదలా? ఇలా అనేక అంశాలపై వారిలో వారు చర్చించుకోవడం ఎక్కువైపోయింది. అందుకే ఈసారి ఎన్నడూ లేని విధంగా రాజకీయసభలు విజయవంతమయ్యాయి. ఏ నాయకుడు సభ నిర్వహించినా వందలు, వేల సంఖ్యలో జనం హాజరయ్యారు. ఇదే వాళ్లను పోలింగ్‌బూత్‌ల వైపునకు నడిపించడానికి దోహదపడింది.

మరోవైపు దేశవిదేశాల్లో ఉన్న వివిధవర్గాల ప్రజలు, యువత రాష్ట్ర రాజకీయాలపై మునుపెన్నడూ ఎరగని రీతిలో ఎంతో ఆసక్తిని కనబరిచింది. జగన్ సర్కార్ విచ్చలవిడిగా అప్పులు తెచ్చి సంక్షేమపథకాలను అమలు చేస్తూ, రాష్ట్రాభివృద్ధిని పట్టాలు తప్పించిందని వారంతా భావించారు. తమ రాజధాని ఏదో చెప్పుకోలేని విధంగా రాష్ట్రాన్ని మార్చేసిందని ఆవేదన చెందారు. కొద్దిపాటి వర్షానికే పాడైన రహదారులు.. చిన్నపాటి చెరువుల్లా మారడం కూడా సోషల్‌మీడియా వేదికగా రాష్ట్రాన్ని నగుబాటుకు గురిచేయడాన్ని చాలామంది తట్టుకోలేకపోయారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబును కక్షపూరితంగా అరెస్ట్ చేశారని ఎక్కడెక్కడో ఉన్న తెలుగువారంతా బలంగా నమ్మారు. ఈ అరెస్ట్‌కు నిరసనగా హైదరాబాద్‌లో తలపెట్టిన ఆందోళనలను అప్పటి కేసీఆర్ సర్కార్ అడ్డుకోవడాన్ని అవమానంగా భావించారు. ఇలాంటి వారంతా ఎన్నికలకు మూడునెలల ముందునుంచే రాష్ట్రానికి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, యూరప్, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచీ కదిలివచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చేందుకు వందలాది బస్సులు, వాహనాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రత్యేక రైళ్లు నడిచాయి. జగన్ సర్కార్ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని సమర్థించే వర్గం కూడా వారికి పోటీగా మారింది. దాంతో వీరంతా రెండువర్గాలుగా చీలిపోయి పోలింగ్‌రోజు పోటెత్తారు. అధికార, ప్రతిపక్షాలు రెండూ వారిని రప్పించేందుకు ప్రత్యేక రవాణా సదుపాయాన్ని కల్పించాయి. వరుసగా మూడు రోజులు సెలవు రావడంతో చాలామంది స్వస్థలాలకు వచ్చి ఓట్లు వేసి వెళ్లారు. ఇది పోలింగ్‌శాతం పెరుగుదలకు దోహదం చేసింది.

ఓటింగ్ పెంచడంపై దృష్టి సారించిన ఎన్నికలసంఘం పోలింగ్ నిర్వహణలో విఫలమైందనే విమర్శలు పెద్దఎత్తున వచ్చాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగడం, వీవీ ప్యాట్‌లో స్లిప్‌లు రావడానికి ఎక్కువ సమయం పట్టడంతో గంటల తరబడి ఓటర్లు క్యూ లైన్‌లలో నిలబడాల్సి వచ్చింది. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్‌బూత్‌లను పెంచకపోవడం దీనికి ఒక కారణం. లేకుంటే ఓటింగ్‌శాతం మరింత పెరిగి ఉండేది.



ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు ఒక ఎత్తు, 2024 ఎన్నికలు మరొక ఎత్తు అన్నట్టు డబ్బు వరదగోదావరిలా ప్రవహించింది. రాష్ట్రంలో పోలింగ్ నాలుగోదశలో జరగడంతో అభ్యర్థులకు, పార్టీలకు ఖర్చు రెండింతలు పెరిగింది. ఈసారి ప్రత్యేకత ఏమిటంటే.. చాలాచోట్ల అభ్యర్థులు సామాజికవర్గాల విభజన పాటించడం. ఫలానా సామాజిక వర్గం ఓట్లు తమకు పడవు అని బలంగా నమ్మినవారు డబ్బుల పంపిణీలో వారిని మినహాయించారు. దాంతో వాళ్లంతా దీన్ని తీవ్రంగా పరిగణించి తమ ప్రతాపాన్ని ఈవీఎంలపై చూపించి ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి ఓట్లు వేశారు. ఓట్లశాతం పెరగడానికి ఇది మరో కారణం.

గోదావరి జిల్లాల్లో ఇటీవలి వరకు భిన్నధ్రువాలుగా ముద్ర పడిన రెండు బలమైన సామాజికవర్గాల మధ్య ఉన్న సన్ననిగీత ఈ ఎన్నికల్లో చెరిగిపోయింది. జనసేన–తెలుగుదేశం పొత్తును మొదట్లో వ్యతిరేకించిన ఆయావర్గాలు క్రమేపీ సర్దుకున్నాయి. వీరి ముందున్న సవాల్ ఒక్కటే.. ఈసారి ఎన్నికల్లో గెలవకపోతే జనసేనతోపాటు ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కూడా రాజకీయంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అందుకే ప్రధానంగా కాపు సామాజికవర్గం ఆ పార్టీకి, పవన్‌కు అండగా నిలచి కసిగా పనిచేసింది. మరోవైపు టీడీపీని, చంద్రబాబును ఈసారి అధికారంలోకి తీసుకురాకపోతే.. రాబోయే రోజుల్లో జగన్ నుంచి మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని కమ్మ సామాజికవర్గం బలంగా విశ్వసించింది. ఈ కారణంగా దేశ విదేశాల్లో ఉన్న ఆ వర్గం గడిచిన మూడునెలలుగా ప్రత్యేక క్యాంపెయినింగ్ చేసింది. వారంతా పెద్దసంఖ్యలో వచ్చి ఓటేయడం పోలింగ్‌శాతం పెరగడానికి ఇంకో కారణం.

పోలింగ్‌శాతం పెరుగుదలలో వలంటీర్లు కూడా చెప్పుకోదగిన పాత్రే నిర్వహించారు. అధికారంలోకి రాగానే ప్రతి 50 కుటుంబాలకు ఒకరు చొప్పున నియమించిన వలంటీర్లను ఎన్నికల నిర్వహణలో నేరుగా వినియోగించుకుందామని జగన్ భావించినప్పటికీ ఎన్నికలసంఘం అడ్డుపడడంతో అది సాధ్యపడలేదు. అయినప్పటికీ వేలాది వలంటీర్లతో రాజీనామాలు చేయించి, పార్టీ తరఫున ప్రచారం చేయించారు. తమకు ఎవరు అనుకూలంగా ఉన్నారో వారిద్వారా గుర్తించి పోలింగ్‌బూత్‌ల వైపు నడిపించారు. ప్రతిగా తెలుగుదేశం కూటమి కూడా ఇదేస్థాయిలో ఇంటింటి ప్రచారం చేసి తమకు అనుకూలంగా ఉన్నవారిని తరలించింది.

ఓటింగ్‌శాతం పెరుగుదలకు ఎన్నికలసంఘం చేసిన కృషిని కూడా మనం చర్చించాలి. కొత్తఓటర్ల నమోదు, తొలగింపులపై అది ఈసారి పెద్దఎత్తున ప్రచారం నిర్వహించింది.. పెద్దసంఖ్యలో ఉన్న దొంగఓట్లను, డబుల్ ఎంట్రీలను, స్థానికంగా నివాసం లేనివారు, చనిపోయినవారి ఓట్లను తొలగించింది. 2014–2019–2024 మధ్య పెరిగిన ఓటర్లశాతంలో అనేక వ్యత్యాసాలు కనిపిస్తాయి. 2014 నుంచి 2019నాటికి పెరిగిన ఓటర్లు 26,85,171 మంది కాగా, 2019 నుంచి 2024నాటికి పెరిగినవారు 19,99,887 మాత్రమే. తొలగించిన ఓట్ల కంటే పెరిగిన ఓటర్ల శాతం తక్కువగా ఉంది. అనేక నియోజకవర్గాల్లో గడిచిన ఐదేళ్లలో పెరిగిన ఓటర్ల సంఖ్య రెండంకెలు కూడా దాటకపోవడం గమనార్హం. ఓటర్లజాబితాలో భారీగా అనర్హుల ఓట్ల తొలగింపుతో ఓటు వేసే వారి సంఖ్య పెరిగిందని భావించవచ్చు. అందుకే 2024 ఎన్నికల్లో 81.86 శాతం ఓటింగ్ నమోదైనట్టు అర్థమవుతోంది.

2024 జనవరి 22న కేంద్ర ఎన్నికలసంఘం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 4,08,07,256. ముసాయిదా జాబితాలో ఉన్న 16,52,422 మంది ఓటర్లను ఈ జాబితాలో తొలగించారు. వీరిలో మరణించినవారు 5,86,810, ఇతరప్రాంతాల్లో ఉన్నవారు 8,47,421, పునరావృతమైన ఓటర్ల సంఖ్య 2,30,191. ఏప్రిల్ నెలాఖరు నాటికి మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,01,887 మందికి చేరింది. ఇందులో సుమారు పదిలక్షల మంది కొత్తఓటర్లు. మే 13న జరిగిన పోలింగ్, అంతకుముందు జరిగిన పోస్టల్‌బ్యాలెట్‌తో కలుపుకుని రికార్డుస్థాయిలో 81.86 శాతం ఓట్లు పోలైనట్టు ఎన్నికలసంఘం ప్రకటించింది. ఈవీఎంల ద్వారా 3,33,40,560, పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులు మొత్తంగా కలిపి 4.97 లక్షల మంది ఓటు వేశారు. 2019 ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఓటర్లు 2.62 లక్షల మంది మాత్రమే. గతంలో వృద్ధులు, వికలాంగులు పోలింగ్‌బూత్‌ల వద్దకు వచ్చేందుకు ఇబ్బందులు పడేవారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇళ్ల వద్దే ఓటు వేసే అవకాశం కల్పించడం కూడ ఓటింగ్‌శాతం పెరిగేందుకు దోహదపడింది. అయితే ఓటింగ్ పెరగడంపై దృష్టి సారించిన ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహణలో విఫలమైందనే విమర్శలు పెద్ద ఎత్తున వచ్చాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగడం, వీవీ ప్యాట్‌లో స్లిప్‌లు రావడానికి ఎక్కువ సమయం పట్టడంతో గంటల తరబడి ఓటర్లు క్యూ లైన్‌లలో నిలబడాల్సి వచ్చింది. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్‌బూత్‌లను పెంచకపోవడం దీనికి ఒక కారణం. లేకుంటే ఓటింగ్‌శాతం మరింత పెరిగి ఉండేది.

• దేవగళ్ల రామకృష్ణ
సీనియర్ జర్నలిస్టు

ఆర్టీసీ బస్సుల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. బస్సుల్లో తరచూ సమస్యలు ఏర్పడుతుండటంతో డ్రైవర్లు గ్యారేజీల్లో ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా ఆర్టీసీ ఉన్నతాధికారుల్లో చలనం లేకపోవడం, మరమ్మతులు కూడా అరకొరగా జరగడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు.



గేర్ బాక్స్ స్లిప్, స్టీరింగ్ స్టక్ సమస్యలతో అవస్థలు

- గ్యారేజీల్లో ఫిర్యాదు చేస్తున్న డ్రైవర్లు
- ఫిర్యాదులను ఖాతరు చేయని అధికారులు

తుక్కు తుక్కు..!

ఆర్టీసీ బస్సుల్లో డేంజర్ బెల్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీ బస్సులకు పదేపదే సమస్యలొస్తున్నాయని రెండు జిల్లాల్లోని డ్రైవర్లు.. డిపో గ్యారేజీల్లో పెద్ద ఎత్తున ఫిర్యాదు చేస్తున్నారు. అయితే, వీటిని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవట్లేదు. దీనిపై డ్రైవర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో బస్సుల కండీషన్‌పై ఉన్నతాధికారులతో చర్చించాలని గుర్తింపు సంఘాలైన ఈయూ, ఎన్ఎంయూఏకు డ్రైవర్లు ఫిర్యాదు చేస్తున్నారు.

గేర్ బాక్స్ స్లిప్, స్టీరింగ్ స్టక్‌తో సమస్య

ఇటీవల కాలంలో డ్రైవర్లను రెండు ప్రధాన సమస్యలు భయపెడుతున్నాయి. వాటిలో ఒకటి గేర్ బాక్స్ స్లిప్ కావటం, రెండోది స్టీరింగ్ స్టక్ కావటం. గేర్ బాక్స్ స్లిప్ కావడమనేది తరచూ జరుగుతోంది. గేర్ బాక్స్‌లో వీల్స్ అరిగిపోవటం వల్ల ఇలా జరుగుతోంది. ఈ గేర్ బాక్స్‌లను కంప్లీట్ ఓవర్ హాలింగ్ (సీవో) చేయించాల్సి ఉండగా, అలా చేయట్లేదు. గేర్ బాక్స్‌లో స్పేర్స్ ఖర్చుతో కూడుకున్నవి కావడం వల్లే ఈ పనులు చేయట్లేదు. ఫలితంగా గేర్ బాక్స్‌లు సరిగ్గా పనిచేయక గేర్లు స్లిప్ అవుతున్నాయి. ఈ సమస్య వల్లే పీఎన్‌బీఎస్‌లో ప్రమాదం జరిగింది. ఇక స్టీరింగ్ స్టక్ సమస్య వల్ల బస్సు అప్పటికప్పుడు ప్రమాదానికి గురవుతుంది. హై ఎండ్ బస్సులు తప్ప మిగిలిన వాటికి పవర్ స్టీరింగ్స్ ఉండవు. హైడ్రాలిక్ స్టీరింగ్స్ ఉంటాయి. వీటికి వేన్ పంపు అనుసంధానమై ఉంటుంది. ఈ పంపు.. స్టీరింగ్‌కు ప్రెజర్‌ను ఇస్తుంది. ఈ వేన్ పంపులే ఇప్పుడు సమస్యగా మారాయి. స్టీరింగ్ చక్కగా తిరిగేలా ఇవి ఆయిల్‌ను పంపు చేస్తుంటాయి. ఇవి తరచూ ఫెయిల్ అవటం వల్ల స్టీరింగ్ పై కంట్రోల్ ఉండని పరిస్థితి ఏర్పడింది. స్టీరింగ్ స్టక్ కావటానికి రబ్బర్ బుష్‌లు లేకపోవటం కూడా ఓ కారణమే. ఏలూరులో బస్సు ప్రమాదానికి కారణమిదే.

బెస్ట్ క్వాలిటీ నినాదంతో తంటా

ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇటీవల 'లీస్ట్ ప్రైసెస్-బెస్ట్ క్వాలిటీ' నినాదాన్ని తీసుకొచ్చారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన స్పేర్స్‌ను కొనాలన్నది దీని సారాంశం. కంపెనీలు నష్టపోతూ స్పేర్స్‌ను తక్కువ ధరకు ఎక్కడైనా ఇస్తాయా? ఒకవేళ తక్కువ ధరకే కావాలనుకుంటే ఆ క్వాలిటీ వస్తుందా? అనే ప్రశ్నలకు ఆర్టీసీ అధికారులే సమాధానం చెప్పాలి. వాస్తవంగా బస్సులను కండీషన్‌లో ఉంచాలంటే ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్ (ఓఈఎం) స్పేర్స్‌నే ఉపయోగించాలి. అంటే ఏ కంపెనీ బస్సులైతే, ఆ కంపెనీకి సంబంధించిన స్పేర్స్‌నే ఉపయోగించాలి. కానీ, నాణ్యత లేని డూప్లికేట్ స్పేర్స్‌ను కొంటున్నారు. ఆఖరుకు టైర్లను కూడా కొనట్లేదు. పదేపదే రీ బటన్ వేసి వాడుతున్నారు. కూలెంట్ ఆయిల్స్ సరఫరా ఉండట్లేదు. అందుబాటులో ఉన్న అరకొర కూలెంట్ ఆయిల్ కూడా సరిపోని పరిస్థితి. దీంతో రేడియేటర్లు హీటెక్కి బస్సులు ఓవర్ హీట్‌కు గురవుతున్నాయి. దీనివల్ల అగ్నిప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. రేడియేటర్లు పేలిపోతున్నాయి. ఏలేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గన్నవరం వచ్చిన సందర్భంలో రేడియేటర్ బ్లాస్ట్ అయ్యింది. దీనివల్ల డ్రైవర్ చర్మం కాలిపోయింది. ఇక కాలుష్యాన్ని అరికట్టడానికి బస్సుల్లో క్యాటలిక్ కన్వర్టర్స్ అవసరం ఉంది. ఇవి బయటకు ఉత్పత్తి చేసే పొగను శుద్ధి చేసి కాలుష్య కారకాలను నియంత్రిస్తాయి. క్యాటలిక్ కన్వర్టర్లను ఏర్పాటు చేయకపోవటం వల్ల నగరంలో సీఎన్‌జీ బస్సుల ద్వారా విడుదలవుతున్న పొగతో తీవ్ర వాయుకాలుష్యం ఏర్పడుతోంది. ఇవేకాకుండా రబ్బరు బెల్టులు, ఎలక్ట్రికల్ బోర్డులు, అనేక స్పేర్స్ కొరత వల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి.


లోటస్ లోపల..!



బెంగళూరు రేవ్ పార్టీ మూలాలు బెజవాడను కుదిపేస్తున్నాయి. ఒకప్పుడు చోటామోటా రౌడీలుగా ఉన్నవారు వైసీపీ నాయకుల అండతో దేశాన్ని దడపుట్టించే బుకీల అవతారమెత్తుతున్నారు. బెంగళూరు రేవ్ పార్టీ సూత్రధారి లంకపల్లి వాసు ఉదంతం బుధవారమే బయటపడగా, అతని గాడ్‌ఫాదర్ పూర్ణ, వీరిద్దరికీ సాయపడుతున్న ఓ మాజీమంత్రి అనుచరుడి బాగోతాలు గురువారం వెలుగులోకి వచ్చాయి. అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్‌మార్క్‌లో ఉంటున్న మాజీమంత్రి అనుచరుడికి వాసు, పూర్ణ సన్నిహితులని, ఇక్కడే భారీస్థాయిలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయని ఆ పార్టీవారే చెబుతున్నారు.

బెట్టింగ్‌లకు అడ్డాగా లోటస్ ల్యాండ్‌మార్క్

- మాజీమంత్రి అనుచరుడి కనుసన్నల్లో బుకీలు
- వాసుతో పాటు పూర్ణ వంటి బడా బుకీలకు బాస్
- సీజన్‌లో రూ.వందల కోట్లలో నడుస్తున్న బెట్టింగ్
- ఒకప్పుడు చోటా రౌడీలు.. నేడు బడా బుకీలు
- అతితక్కువ కాలంలోనే రూ.కోట్ల సంపాదన



మాజీమంత్రి సహా తూర్పుగోదావరి జిల్లా వైసీపీ ఎమ్మెల్యేతో సత్సంబంధాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్‌మార్క్‌లో నివాసం ఉంటున్న మాజీమంత్రి అనుచరుడు బెట్టింగ్ బుకీలకు అండదండలు అందిస్తున్నాడని సమాచారం. అటు రాజకీయ నాయకులు, ఇటు పోలీసు అధికారులతో మాట్లాడి వారి బెట్టింగ్ వ్యాపారం నిర్విఘ్నంగా సాగేలా చూస్తున్నాడని తెలుస్తోంది. బెంగళూరు రేవ్ పార్టీలో పట్టుబడిన వాసుకు తెరవెనుక అండదండలు అందించిన వ్యక్తి ఈయనే అని సమాచారం. వాసును మించిన మరో వ్యక్తి కూడా ఈ మాజీమంత్రి అనుచరుడి కనుసన్నల్లో లోటస్‌లో రూ.కోట్లలో బెట్టింగ్ వ్యాపారం చేస్తుంటాడు.


లంకపల్లి వాసు

అధికార పార్టీ ఎమ్మెల్యేలతో వ్యాపారాలు

పూర్ణకు విజయవాడకు చెందిన మాజీమంత్రి, ఆయన అనుచరులతో పాటు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేతోనూ మంచి సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఇద్దరూ ఒకే సామాజికవర్గం వారు కావడంతో బెట్టింగ్‌ల్లో సంపాదించిన సొమ్మును వ్యాపారాల్లో పెడుతుంటారు. తూర్పుగోదావరి జిల్లాలో విలువైన భూములను, ఫాంహౌస్‌లను కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అందులోని ప్రముఖులతో పరిచయాలు ఏర్పాటు చేసుకుని, పార్టీకి నిధులు ఇస్తూ, తన అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు రాకుండా చూసుకోవడం పూర్ణ నైజం. ఇతను బుకీగానే కాకుండా కేసినోల నిర్వహణలోనూ ఆరితేరాడని చెబుతారు.

పూర్ణ ఎవరు..?

పూర్ణ అన్న అని అందరూ ముద్దుగా పిలుచుకునే ఇతనే వాసుకి గాడ్‌ఫాదర్. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న బుకీల్లో ఇతను ప్రముఖుడు. పూర్ణ, వాసు కనుసన్నల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 300 మంది బుకీలు ఉన్నారని సమాచారం. ఐపీఎల్, వరల్డ్‌కప్, పాకిస్తాన్-ఇండియా మ్యాచ్‌లు వచ్చినప్పుడు ఈ బుకీలు.. క్రికెట్ పిచ్చోళ్ల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టేస్తుంటారు. క్రికెట్ సీజన్ లేనప్పుడు పేకాట, సింగిల్ నెంబర్లు వంటి బెట్టింగులు నడిపిస్తుంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నడిచే ఈ బెట్టింగ్ వ్యాపారాలకు లోటస్ కేంద్రమని సమాచారం. నిత్యం రద్దీగా ఉండే అయోధ్యనగర్ లోటస్‌లో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నుంచి వివిధ శాఖల అధికారులు, బడా వ్యాపారులు, ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. ఇంతటి కీలకమైన ప్రదేశంలో బుకీల కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పోలీసుల నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసే బాధ్యత మాజీమంత్రి అనుచరుడు తీసుకున్నారు. పోలీసులకు పెద్ద ఎత్తున నెలవారీ మామూళ్లు పంపడం, వారి ఇళ్లలో జరిగే కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ధనసాయం అందించడం వంటివన్నీ మాజీమంత్రి అనుచరుడే చూసుకుంటాడు.

ఎందరో ఆత్మహత్యలకు కారకులు

కొద్దిరోజుల క్రితం గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు క్రికెట్ బెట్టింగ్‌లో ఓడిపోయి డబ్బు కట్టలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో పూర్ణపై కేసు నమోదైంది. అతన్ని అప్పట్లో అరెస్టు చేసి జైలుకు కూడా పంపారు. ఆ తర్వాత రాజకీయ అండతో బయటకు వచ్చాడు. సుమారు ఏడాదిలో నగరంలోనే ఈ బుకీల బారిన పడి సుమారు అరడజను మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా వీరి బాధితుల సంఖ్య వందల్లోనే ఉంది. పూర్ణ, వాసు అన్ని తరహా బెట్టింగ్‌ల్లో సిద్ధహస్తులు. దీంతో అనతికాలంలోనే కోట్లాది రూపాయలు ఆర్జించారు. పూర్ణ లోటస్‌లో రూ.3 కోట్ల విలువచేసే విల్లా, బెంగళూరులో మూడు విల్లాలను కూడా కొన్నాడు. గాంధీనగర్, సత్యనారాయణపురంలో సుమారు రూ.10 కోట్ల విలువైన ఆస్తులు కొన్నట్లు అతని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవల గాంధీనగర్‌లోని శాంతి థియేటర్ సమీపంలో సుమారు రూ.7 కోట్ల విలువైన భవనాన్ని కొనుగోలు చేసి భారీ కాంప్లెక్సు నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. లోటస్‌తో పాటు పాత బస్టాండ్ సమీపంలో బందరురోడ్డులోని ఓ హోటల్‌ను బెట్టింగ్‌లకు కేంద్రంగా మార్చుకున్నారు.



వీసా.. లేదు భరోసా..

విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందాలనేది చాలామంది విద్యార్థుల కల. కానీ, అది సాకారం చేసుకోవడం మాత్రం కష్టతరంగా మారింది. ఇందుకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన విద్యార్థులే నిదర్శనం. దేశ విదేశాల్లో చదువుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండు జిల్లాల విద్యార్థులు అధికంగా వీసా కోసం దరఖాస్తు చేసుకుంటుండగా, స్లాట్స్ మాత్రం దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ఓపెన్ అయిన ఐదు నిమిషాల్లోనే ఎఫ్1 వీసాలకు స్లాట్స్ అయిపోతుండటంతో విద్యార్థులకు విదేశీ విద్య అందని ద్రాక్షగా మారుతోంది. కన్సల్టెన్సీ సంస్థల కనుసన్నల్లో ఈ స్లాట్స్ వ్యాపారం గుట్టుగా సాగుతోంది.

విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుతున్న వీసా

- ఉన్నత విద్య కోసం రెండు జిల్లాల్లో భారీగా దరఖాస్తులు
- ఓపెన్ అయిన ఐదు నిమిషాల్లోనే బుక్కైపోతున్న స్లాట్స్
- కన్సల్టెన్సీల కనుసన్నల్లో తెరవెనుక వ్యాపారం
- బయోమెట్రిక్, ఇంటర్వ్యూల కోసం ఇతర రాష్ట్రాలకు..
- బెజవాడలో ఎంబసీ ఏర్పాటు చేయాలనే డిమాండ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ప్రారంభమయ్యే ఎడ్యుకేషన్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి విదేశాల్లో విద్యనభ్యసించేందుకు విద్యార్థులు సమాయత్తమవుతుంటారు. ఇలాంటి వారంతా గత నాలుగైదు నెలలుగా 7 వేలకు పైగా పాస్‌పోర్టులు తీసుకున్నట్టు సమాచారం. అమెరికా, ఫ్రాన్స్, కెనడా, ఇటలీ, ఇంగ్లండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియాతో పాటు యూరప్, చైనా, మలేషియాలో చదువుకునేందుకు ఆయా యూనివర్సిటీల అనుమతి లేఖలు పొందుతున్నారు. వీరందరి కళ్లూ వీసాలపైనే ఉంది. ఎంబసీ ఎప్పుడు స్లాట్స్ కోసం ఆన్‌లైన్ ఓపెన్ చేస్తుందోనని నెల రోజులుగా ఎదురుచూస్తున్నారు. తీరా.. ఓపెన్ చేసిన ఐదు, పది నిమిషాల్లోనే స్లాట్స్ బుక్ అయిపోవటంతో వందలాది మంది ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వర్సిటీల్లో అడ్మిషన్ ఫీజులు చెల్లించి, బ్యాంకు రుణాలు తీసుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కన్సల్టెన్సీ సంస్థల ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికే తప్ప.. వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకున్నవారికి మాత్రం పెద్దగా స్లాట్స్ బుక్ కావట్లేదు.

దూరాభారమే..

కన్సల్టెన్సీల ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారిలో చాలామందికి హైదరాబాద్ ఎంబసీ పరిధిలో బయోమెట్రిక్, ఇంటర్వ్యూలకు హాజరు కావటానికి అవకాశం వస్తోంది. మిగిలిన వారందరికీ చెన్నై, ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా ఎంబసీలకు పిలుస్తున్నారు. ఇది ఇబ్బందికరమైన అంశం. బయోమెట్రిక్ తీసుకోవటానికి ఒకరోజు, నాలుగైదు రోజుల తర్వాత ఇంటర్వ్యూకు హాజరు కావడమనేది పెద్ద సమస్యగా మారింది. నాలుగైదు రోజుల తేడాలో అంత దూరం వెళ్లి రావడం కష్టమవుతోంది.

కన్సల్టెన్సీ సంస్థల కనుసన్నల్లో..

విజయవాడ కేంద్రంగా అనేక కన్సల్టెన్సీలు నడుస్తున్నాయి. కొన్ని సంస్థలు మాత్రం దీనిని వ్యాపార దృక్పథంతో చూస్తున్నాయి. ముందస్తుగా స్లాట్స్ హోల్డ్‌లో పెడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆ తర్వాత స్లాట్స్ దొరకని వారికి వీటిని అమ్ముకుంటున్నారు. చాలా కన్సల్టెన్సీలు తమ కాంటాక్ట్ వాట్సాప్ డీపీల్లో తమ దగ్గర స్లాట్స్ ఉన్నాయన్న సందేశాలను పెడుతుండటం గమనార్హం. ఇలా వాట్సాప్ డీపీలు పెట్టిన వారికి ఫోన్ చేస్తే.. ఎఫ్1 వీసా స్లాట్స్ కోసం రూ.15 వేలు అడుగుతున్నారు. కన్సల్టెన్సీల ద్వారా వెళ్లేవారికి ఎఫ్1 వీసాల కోసం 300 డాలర్లు కట్టించుకుంటున్నారు. జీఎస్టీ అన్నీ కలుపుకొంటే రూ.30 వేలు అవుతోంది. స్లాట్ దొరకని వారికి మాత్రం ఇదే కన్సల్టెంట్స్ ద్వారా ప్రయత్నిస్తే రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతోంది.

బెజవాడకు ఎంబసీ రావాలి..

విద్యాహబ్‌గా ఉన్న బెజవాడకు ఎంబసీ రావాల్సిన అవసరం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాంతం నుంచే అధిక సంఖ్యలో వీసాల కోసం దరఖాస్తులు చేసుకునేవారున్నారు. దీంతో పాటు నవ్యాంధ్రప్రదేశ్ నడిబొడ్డున ఈ ప్రాంతం ఉంది. ఇప్పటి వరకు ఏపీకి ఎంబసీ సాకారం కాలేదు. ఈ ఎంబసీని విజయవాడలో ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. వీసా స్లాట్ బుకింగ్ బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించే వీలుంటుంది. అలాగే, కన్సల్టెన్సీ సంస్థలు చాలావరకు విజయవాడలోనే ఉన్నాయి. కాబట్టి ఈ ప్రాంతానికి చెందినవారు ఎన్ని ముందస్తుగా బ్లాక్ చేశారో సమాచారం తెలుసుకునే వీలుంటుంది. ఎంబసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశాలూ ఉన్నాయి. హైదరాబాద్, ఇతర పొరుగు రాష్ట్రాల్లో ఎంబసీలకు వెళ్లి విచారణ చేసి, ఫిర్యాదు చేసే పరిస్థితులు ఉండవు.



ఓటర్ల చైతన్యం

జిల్లావ్యాప్తంగా పెరిగిన పోలింగ్ శాతం

- గత ఎన్నికలతో పోలిస్తే పెరుగుదల
- 84,116 మంది ఓటర్లతో టర్నవుట్ విడుదల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఓటర్లు కదలివచ్చారని, ఫలితంగా పోలింగ్ శాతం పెరిగిందని ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పేర్కొంది. ఓటరు టర్నవుట్‌ను గురువారం జిల్లా ఎన్నికల యంత్రాంగం విడుదల చేసింది. దీని ప్రకారం పోలింగ్ శాతం పెరగటానికి 84,116 మంది ఓటర్లు దోహదపడ్డారు. జిల్లావ్యాప్తంగా 2019 ఎన్నికల్లో 12,68,379 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోగా, 2024 ఎన్నికల్లో 13,52,495 మంది వినియోగించుకున్నారు. కిందటి ఎన్నికల కంటే ఈ ఏడాది 84,116 మంది ఓటర్లు అదనంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లావ్యాప్తంగా చూస్తే తిరువూరు నియోజకవర్గంలో 6,576 మంది ఓటర్లు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 16,979 మంది, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 25,280 మంది, విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 7,360 మంది, మైలవరం నియోజకవర్గంలో 8,326 మంది, నందిగామ నియోజకవర్గంలో 10,377 మంది, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 9,218 మంది తమ ఓటుహక్కు అదనంగా వినియోగించుకున్నారు. అత్యధికంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో, అత్యల్పంగా తిరువూరు నియోజకవర్గంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్క్రాప్ వ్యాపారిపై కేసు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- 6లో..



ఘనంగా గిరిప్రదక్షిణ

వైశాఖ పౌర్ణమి సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈవో కేఎస్ రామారావు ప్రారంభించారు. తొలుత అన్నపురాశిని పోసి, బలిహరణ ఇచ్చి ఉత్సవమూర్తులకు హారతులు సమర్పించారు. మేళతాళాలు, జయజయధ్వానాల నడుమ ఆదిదంపతులు గిరిప్రదక్షిణ చేశారు. - వన్‌టౌన్

ఐఎఫ్ఎస్ ర్యాంకు సాధించాడు

బాపులపాడు మండలం రంగన్నగూడేనికి చెందిన తుమ్మల కృష్ణచైతన్య ఘనత



- 6లో..

ఐఎఫ్ఎస్ ర్యాంకు కొట్టేశాడు



» తుమ్మల కృష్ణచైతన్య ఘనత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 23 : రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగం చేస్తూ సివిల్స్‌లో ఆల్ ఇండియాస్థాయిలో తుమ్మల కృష్ణచైతన్య 74వ ర్యాంకు సాధించి తన కలను సాకారం చేసుకున్నాడు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామానికి చెందిన తుమ్మల కృష్ణచైతన్య యూపీపీఎస్సీ-2023 సివిల్ పరీక్షల్లో ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) 74వ ర్యాంకు సాధించారు. ప్రాథమిక విద్య నుంచే చదువులో ప్రతిభ కనబరచిన కృష్ణచైతన్య ఎంసెట్‌లో ర్యాంకు సాధించి జేఎన్టీయూలో కెమికల్ ఇంజనీరింగ్ చేశారు. ఐఏఎస్ కావలనే బలమైన కోరికతో 2014లో ఢిల్లీలో శిక్షణ తీసుకుని 4వ ప్రయత్నంలో ఐఎఫ్ఎస్ క్యాటగిరీలో 74వ ర్యాంకు సాధించారు. రాష్ట్ర సచివాలయంలో విధులు నిర్వహిస్తూనే ఐఎఫ్ఎస్ సాధించడం పట్టుదలకు నిదర్శనమని ఆళ్ల గోపాలకృష్ణ, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కృష్ణ చైతన్యను తాత, అమ్మమ్మ ఇతర కుటుంబ సభ్యులు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు తుమ్మల దశరథరామయ్య, పాల సొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

కుటుంబసభ్యులు, గ్రామస్థుల ప్రోత్సాహంతోనే ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యానని కృష్ణచైతన్య ఫోన్‌లో తెలిపారు. తండ్రి తుమ్మల రాజారావు నవతలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి సుజాత అండగా నిలబడ్డారన్నారు. సోదరి రోజా ప్రియాంక విజయవాడ జలవనరుల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

» 24 పరీక్షా కేంద్రాలు, 6046 మంది విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, మే 23 : కృష్ణాజిల్లాలో శుక్రవారం నుంచి టెన్త్ క్లాస్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు డీఈవో తాహెరా సుల్తానా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 పరీక్షా కేంద్రాల్లో 6046 మంది పరీక్షలకు హాజరుకానున్నారని, 24 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 24 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 302 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు చెప్పారు. 11 స్టోరేజ్ పాయింట్ల ద్వారా ప్రశ్నాపత్రాలు పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని, 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని డీఈవో తెలిపారు. 395 పాఠశాలలకు చెందిన 6046 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ ఉంటుందన్నారు. జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈవో తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేయండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు చిన్ననాటి నుంచే పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాశాఖ, వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతివ్యవసాయ విభాగాల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో ఆయాశాఖల అధికారులతో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, సేంద్రీయ వ్యవసాయపద్ధతులను విద్యార్థులకు తెలియజేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలోని 119 ఆర్బీకేల పరిధిలోని పాఠశాలల్లో న్యూట్రీగార్డెన్‌పై తగిన విధంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు.కూరగాయల మొక్కల పెంపకానికి అనువుగా ప్రహరీలున్న పాఠశాలలను గుర్తించి ఈనెల 12వతేదీలోగా కార్యక్రమానికి రూపకల్పన చేయాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ, డీఈవో తాహెరాసుల్తానా, ఉద్యానశాఖ జేడీ జ్యోతి, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి పార్థసారధి, డ్రిప్ ఇరిగేషన్ విభాగం అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి సహకార సంఘాల కంప్యూటరీకరణ

» జిల్లా సహకార శాఖాధికారి ఫణి

మచిలీపట్నం టౌన్ : రైతుల ఆర్థిక లావాదేవీల్లో ఏవిధమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జిల్లాలోని 213 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఆరు నెలల్లో కంప్యూటరీకరణ పూర్తి చేస్తామని జిల్లా సహకార శాఖాధికారి ఫణి అన్నారు. మచిలీపట్నం చిలకలపూడిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందజేసిన సాఫ్ట్‌వేర్‌ను అన్ని సహకార సంఘాల్లో అమలు చేస్తున్నామన్నారు. రైతుల పాస్‌పుస్తకాలు, ఆధార్ నెంబర్లు, భూమి వివరాలు, ఫోన్ నెంబర్లు ఈ-కేవైసీ ద్వారా అప్‌డేట్ చేసిన వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఇందుకు రైతులు సహకరించాలన్నారు. దీనివల్ల ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీ పథకాలు తక్షణం అమలు జరుగుతాయన్నారు. ఎరువులు, విత్తనాల పంపిణీ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతులకు ఇచ్చే రాయితీలన్నీ అందేందుకు కంప్యూటరీకరణ తక్షణ అవసరమన్నారు. ఇందుకుగాను ప్రతి సహకార సంఘానికి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రతినెలా కంప్యూటరీకరణ ఎంతవరకు వచ్చింది తనిఖీ చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.



'సంపద' కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

చల్లపల్లి, మే 23 : చల్లపల్లి గ్రామ పంచాయతీ నిర్వహణలోని సంపద తయారీ కేంద్రాన్ని గురువారం కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్‌లోని ఐదుగురు అసిస్టెంట్ సెక్షన్ అధికారులతో కూడిన బృందం పర్యటనలో పాల్గొంది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ పరిపాలన, విధులు, పారిశుధ్య నిర్వహణ, చెత్తసేకరణ, సంపద తయారీ తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించే క్రమంలో నిర్దేశిత బృంద సభ్యులు చల్లపల్లిలో పర్యటించారు. స్వచ్ఛ చల్లపల్లి సహకారంతో నిర్మించిన సంపద తయారీ కేంద్రాన్ని, సంపద తయారీ విధానాలను పరిశీలించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పీవీ మాధవేంద్రరావులు బృందసభ్యులకు గ్రామంలో చెత్తసేకరణ విధానం, విభజన, నాడెపు పిట్ల నిర్వహణ, వర్మి తయారీ విధానాలను తెలియచేశారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు విపుల్ పన్వార్, శశికాంత్ శర్మ, మయాంక్ కుమార్ సింగ్, పవన్ కుమార్ శర్మ, సుధాన్షు ఆనంద్, నోడల్ ఆఫీసర్ అమీర్‌భాషా, డీపీఆర్సీ కన్సల్టెంట్ బి.చిన్నారావు, చల్లపల్లి ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.సుధాకర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను
పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తేవాలి

● మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

గవర్నర్‌పేట, మే 23: మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు జీతభత్యాలు 010 హెడ్ కింద చెల్లించాలని, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు సక్రమంగా అమలు జరగాలంటే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తేవాలని మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ కన్వీనర్ పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన వర్క్‌షాపులో విద్యాశాఖ జారీ చేసిన సర్వీసు ప్రతిపాదనలపై చర్చ జరిగింది. ప్రతిపాదనలలో చేపట్టాల్సిన మార్పుల గురించి, రెగ్యులర్ సిబ్బందికి రావాల్సిన అన్ని సర్వీస్ ప్రయోజనాలపై ఫెడరేషన్ నేతలు చర్చించారు. ప్రతిపాదనలపై జిల్లాల్లోని టీచర్స్ అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని అధికారులకు సమర్పించాలని వర్క్‌షాపులో నిర్ణయం తీసుకున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. వర్క్‌షాపులో ఫెడరేషన్ కో-కన్వీనర్ ఎస్. బాలాజీ, అన్ని జిల్లాల ప్రధాన బాధ్యులు పాల్గొన్నారు.

పోలీసులు హద్దు మీరితే.. ఫిర్యాదు చేయండి

» పైసా ఖర్చులేదు.. 6 నెలల్లో పరిష్కారం

» పోలీసు కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ విశ్వనాథం



మీడియాతో మాట్లాడుతున్న అథారిటీ చైర్మన్ విశ్వనాథం

రాజమహేంద్రవరం,మే23(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధులు దుర్వినియోగం చేసిన సందర్భాల్లో వారిపై పోలీసు కంప్లైంట్స్ అథారిటీకి బాధితులు లేదా వారి సంబంధీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని అథారిటీ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఆర్‌జే విశ్వనాథం పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని అథారిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాకినాడ, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని కానిస్టేబుళ్ల దగ్గర నుంచి డీఎస్పీ స్థాయి వరకూ వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టే అధికారం రాజమహేంద్రవరం కేంద్రంగా పనిచేస్తున్న అథారిటీకి ఉందన్నారు. గుంటూరులో ఉన్న రాష్ట్రస్థాయి అథారిటీకి ఎస్పీ నుంచి డీజీ వరకూ అధికార పరిధి ఉందన్నారు. తమ పరిధిలోని ఏదైనా జిల్లాకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తే అక్కడికే వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు. ఫిర్యాదుదారులు dpcaraja-mahendravaram@gmail.com మెయిల్ ద్వారా లేదా 99484 64363 నెంబరుకు వాట్సాప్ ద్వారా లేదా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, వైటీసీ, బొమ్మూరు, రాజమహేంద్రవరం రూరల్‌కి రిజిస్టరు పోస్టు ద్వారా తమ అర్జీలను పంపించవచ్చని తెలిపారు. తమ కార్యాలయానికి వచ్చి నేరుగా సమస్యను తెలిపి ఫిర్యాదు అందజేయవచ్చన్నారు. కస్టడీలో మరణించడం, అత్యాచారం, కస్టడీలో తీవ్రగాయాలు కావడం, భూకబ్జాలు, సివిల్ తగాదాల్లో కల్పించుకోవడం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి వ్యక్తులను ఇబ్బంది పెట్టడం వంటి వాటిపై ఘటన జరిగిన రోజు నుంచి ఏడాది లోగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గరిష్ఠంగా ఆరునెలల్లోగా విచారణ పూర్తి చేసి సదరు ఉద్యోగి విధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రుజువైతే చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. పోలీసులపై ఫిర్యాదు చేస్తే వారితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయం అవసరం లేదన్నారు. అథారిటీ ఏర్పాటైన తర్వాత 14 ఫిర్యాదులపై విచారణ జరిపి 10 కేసులకు పరిష్కారం చూపించామన్నారు. 4 కేసుల విచారణ వివిధ దశల్లో ఉందన్నారు. అథారిటీపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అథారిటీ సభ్యులు విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.జితేంద్ర, విశ్రాంత అడిషనల్ ఎస్పీ బి.లక్ష్మీనారాయణ,సీనియర్ న్యాయవాది సీహెచ్ మన్మథరావు పాల్గొన్నారు.

ఆర్వోలను బెదిరిస్తుంటే సీఎస్ ఏం చేస్తున్నట్టు!

» దేవినేని ఉమా ధ్వజం

గొల్లపూడి, మే 23: పోలింగ్ రోజు సహకరించనందున కౌంటింగ్ రోజు మీ అంతు చూస్తామంటూ వైసీపీ మూకలు ఆర్వోలను బెదిరిస్తుంటే సీఎస్ ఏంచేస్తున్నట్టని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమా



మహేశ్వరరావు అన్నారు. చలో మాచర్లకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో గురువారం ఉదయం పోలీసులు ఉమాను హౌస్ అరెస్టు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎస్ ఆధ్వర్యంలో పనిచేసే సిబ్బందికే రక్షణ లేకుండా పోయిందంటే ఆయనకు పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. నైతిక బాధ్యత వహించి తక్షణం తప్పుకోవాలని డిమాండ్ చేశారు. పిన్నెల్లిపై 10 సెక్షన్లతో కేసులు నమోదు చేశామని సీఈవో చెప్పినా.. సిగ్గు లేకుండా మంత్రి అంబటి, కాసు కృష్ణా మహేశ్వర రెడ్డి తప్పు బడుతున్నారంటే వారికి సిగ్గుందా అని ప్రశ్నించారు. సీఈవో ప్రకటనను తప్పుదోవ పట్టించే విధంగా వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడుతున్నారంటే కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా జరిపిస్తారా అన్న అనుమానం కలుగుతోందన్నారు.

ఓటమి భయంతోనే.. : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : ఓటమి భయంతోనే వైసీపీ ఎమ్మెల్యేలు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని, ఈవీఎంలను ధ్వంసం చేసిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లిపై తక్షణం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. గురువారం రవీంద్ర మీడియాతో మాట్లాడారు. జూన్ మొదటి వారంలో భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని కొల్లు రవీంద్ర అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల ఆగడాలకు చెక్‌పెడతామన్నారు.



ఎఫికాన్ పురుగుమందును ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

బీఏఎస్ఎఫ్ సరికొత్త ఉత్పాదన ఎఫికాన్

» విజయవాడలో ఉత్పత్తుల ఆవిష్కరణ

భవానీపురం, మే 23 : వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జర్మనీకి చెందిన పురుగుమందుల కంపెనీ బస్ఫ్(బీఏఎస్ఎఫ్) అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన సరికొత్త ఉత్పాదన 'ఎఫికాన్'ను విజయవాడ నగరంలోని హోటల్ ఫ్రైడ్ మాదవ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జింగ్ క్వింగ్ బి-వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ ఆసియా పసిఫిక్, గిరిధర్ రానువా, బిజినెస్ డైరెక్టర్ బీఏఎస్ఎఫ్ ఇండియా లిమిటెట్ శశికిరణ్ లింగం, రీజనల్ పోర్టుఫోలియో మేనేజర్ ఇన్‌సెక్టిసైడ్స్ ఆసియా పసిఫిక్, ప్రశాంత్ జోషి, హెడ్ మార్కెటిగ్ మేనేజ్‌మెంట్ బీఏఎస్ఎఫ్ ఇండియా లిమిటెడ్ నీలేష్ రావూల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ రానువా మాట్లాడుతూ, అందరి ఆదరాభిమానాలతో బీఏఎస్ఎఫ్ వ్యాపారం ఎంతో వృద్ధి సాధించిందని అన్నారు. గడిచిన కాలంలో బీఏఎస్ఎఫ్ ఉత్పాదనలు మార్కెట్లో రారాజుల్లాగా నిలిచాయన్నారు. మార్కెటింగ్ మేనేజర్ భార్గవరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత నూతన శ్రేణుల్లో 'ఎఫికాన్' అద్భుతమైన కీటకనాశని అని, ప్రపంచ సస్యరక్షణ పరిశోధనల్లో 'ఎఫికాన్' కొత్త శకాన్ని ప్రారంభిస్తుందన్నారు. బిజినెస్ యూనిట్ లీడ్ రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రతీ సంవత్సరం రీసెర్చ్, డెవలప్‌మెంట్ కోసం రూ. 8వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. హెడ్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ ప్రశాంత్ జోషి మాట్లాడుతూ, 'ఎఫికాన్' కీటకనాశిని పత్తి, మిరప, వంగ, టమాటా, కీరదోస పంటలను ఆశించే తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక సమస్యల నుంచి పంటలను దీర్ఘకాలం రక్షిస్తూ అధిక దిగుబడి సాధించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీలర్లు, కంపెనీ ప్రతినిధులు, బీఏఎస్ఎఫ్ ఇండియా ప్రతినిధులు శ్రీనివాస్ నూత, రాకేశ్‌కుమార్, రమేశ్, మనోజ్‌కుమార్, వినయ్ ప్రభాత్, మాలంపాటి రమేశ్‌లు పాల్గొన్నారు.

డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం, మే 23 : డిఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి ఉపాధ్యాయ ట్రైనింగ్‌కు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెల్పింగ్ హ్యాండ్స్ డిఈడీ స్పెషల్ టీచర్ ట్రైనింగ్ కళాశాల కార్యదర్శి సంకాబత్తుల రజిత తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రత్యేక విద్యలో డీఈడీ చదివితే చిన్న వయస్సులోనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. ఓసీ విద్యార్థులకు 50శాతం ఎస్సీ, బీసీ, ఈడబ్ల్యుసీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు 45శాతం ఇంటర్‌లో మార్కులు వచ్చిన వారు స్పెషల్ డిఈడీ చేయవచ్చన్నారు. బీఈడీ చేసిన వారు స్పెషల్ ఎడ్యుకేషన్ డిఈడీ చేస్తే స్పెషల్ బీఈడీతో సమానమన్నారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించటం జరుగుతుందన్నారు. జూన్ 14 చివరి తేదీ అని, ఆసక్తి ఉన్న విద్యార్థులు 91549-47771, 91008-74698 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



దుర్గమ్మను దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి రవికుమార్ దంపతులకు దుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, మే 23: బెజవాడ కనకదుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీటీ రవికుమార్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలతో న్యాయమూర్తికి స్వాగతం పలికి అమ్మమ్మ దర్శనం కల్పించారు. అనంతరం పంచహారతుల సేవలో పాల్గొన్నారు.

మంగళగిరి నృసింహుని సేవలో...

మంగళగిరి సిటీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీటీ రవికుమార్ గురువారం సతీసమేతంగా మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఎగువ సన్నిధిలో ఈవో, దేవదాయ శాఖ సహాయ కమిషనరు అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, స్థానిక అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. జస్టిస్ రవికుమార్ దంపతులు స్వామిని దర్శించుకుని, పానకాన్ని నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు న్యాయమూర్తికి తీర్థప్రసాదాలను అందజేసి క్షేత్ర మహత్యాన్ని వివరించారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

వన్‌టౌన్: దుర్గగుడిలో కనకదుర్గమ్మ దర్శనార్థం గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ దంపతులు విచ్చేశారు. వీరికి ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



హైకోర్టు జస్టిస్ దుర్గాప్రసాద్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

మాతా, శిశు మరణాల రహిత జిల్లాగా తీర్చిదిద్దండి: కలెక్టర్

వన్‌టౌన్, మే 23: జిల్లాను మాతా శిశు మరణాల రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు జిల్లా స్థాయి ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి ఆరోగ్య శాఖాధికారులతో మాతాశిశు సంక్షేమ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కిందటేడాది డిసెంబరు 23 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు జరిగిన మాతా శిశు మరణాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన మాతా శిశుమరణాలను పరిగణనలోకి తీసుకుని ఇకపై అటువంటి మరణాలు జరగకుండా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రతి మరణాన్ని



శాస్త్రీయకోణంలోనే పరిశీలించాలన్నారు. మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వారికన్ని జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది తరచు గర్భిణుల నివాసాలకు వెళ్లిరక్తహీనత ఏర్పడకుండా చర్యలు తీసుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ నుంచి కాన్పు వరకు అన్ని పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వ విధానాల అమలులో నిర్లక్ష్యం పనికిరాదన్నారు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి ఎం సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, ఐసీడీఎస్ పీడీ జి ఉమాదేవి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇందుమతి, టీబీ వైద్యాధికారి పద్మావతి, డీపీహెచ్ నర్సింగ్ ఆఫీసరు లిడియా ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.

25న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్ష

కృష్ణలంక, మే 23: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈనెల 25న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1460 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షకు 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నగరంలోని కండ్రికలోని ఇయాన్ డిజిటల్ జోన్, ఎస్ఎస్ ఫ్యూచర్ టెక్, వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్ఆర్‌కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, క్యూ టెక్నాలజీ, ఎస్‌వీటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ పరీక్ష కేంద్రాల్లో డిజిటల్ ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 7.30 నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తుమన్నారు. ఆపై ఆలస్యంగా వచ్చిన వారిని గ్రేస్ పీరియడ్‌లో 8.30 గంటల వరకు అనుమతించడం జరుగుతుందని డీఆర్‌వో శ్రీనివాసరావు ఆ ప్రకటనలో తెలిపారు.

కౌంటింగ్ సిబ్బంది తొలి ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న కలెక్టర్, జేసీ

కృష్ణలంక, మే 23: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపుకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఢిల్లీరావు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు 403 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 504 మంది కౌంటింగ్ అసిస్టెం ట్లు, 364 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తంగా 1271 మంది కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్‌లో పూర్తిచేశామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి డాక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, ఎన్ఐసీ డీఐవో రేవతి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సిహెచ్.గోపి సుధాకర్ పాల్గొన్నారు.

ఎంఈవో, హెచ్‌ఎంలపై వేటు

» సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు

జగ్గయ్యపేట, మే 23 : లైంగిక వేధింపుల అభియోగంపై జగ్గయ్యపేట ఎంఈవో ఎల్ చిట్టిబాబును కాకినాడ ఆర్జేడీ జి.నాగమణి సస్పెండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు, టీచర్లు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకుల ఫిర్యాదులపై జగ్గయ్యపేట బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.వాణిని సస్పెండ్ చేశారు. జగ్గయ్యపేట ఎంఈవో చిట్టిబాబు తనను లైంగికంగా వేధిస్తున్నాడని బాలికల హైస్కూల్ హెచ్‌ఎం వాణి చేసిన ఫిర్యాదుపై గత నెల 30న జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు విచారించారు. గతంలో హెచ్‌ఎం వాణిపై మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలపై నందిగామ డీవైఈవో, డీఈవో సుబ్బారావు విచారణ జరిపారు. డీఈవో నివేదిక ఆధారంగా కాకినాడ ఆర్జేడీ నాగమణి బుధవారం ఇరువురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎంఈవో చిట్టిబాబును తన అనుమతి లేకుండా జగ్గయ్యపేట హెడ్ క్వార్టర్ విడిచి బయటకు వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇరువురి సస్పెన్షన్ వ్యవహారం నియోజకవర్గంలో కలకలం రేపింది.

స్క్రాప్ వ్యాపారిపై కేసు నమోదు

చిట్టినగర్, మే 23 : స్క్రాప్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టించుకుని ముఖం చాటేసిన వ్యాపారిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా నులుకపేటకు చెందిన మహమ్మద్ అబ్దుల్ వహీం తన స్నేహితుడు ఎండీ ఇక్బాల్‌తో కలిసి స్క్రాప్ వ్యాపారం చేస్తున్నట్టు చెప్పి పలువురి వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.9లక్షల నుంచి రూ.10లక్షలు వసూలు చేశాడు. పెట్టుబడిదారులకు లాభం ఇవ్వకపోగా ఎప్పుడు అడిగినా సరుకు అమ్మేశానని చెప్పి నకిలీ డీడీలను ఇచ్చాడు. దీనిపై బాధితుడు ఎండీ అక్బర్ ఇమాన్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉసురు తీసిన ఈత సరదా



మద్దూరు (కంకిపాడు), మే 23 : ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన మద్దూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు మండలం తాడిగడప గ్రామంలో నివాసముంటున్న నాగరాజుకు ఇద్దరు సంతానం. చిన్న కుమారుడు కార్తీక్ (12) వేసవి సెలవులు కావడంతో వారం రోజుల క్రితం కంకిపాడు మండలం మద్దూరులోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో మిత్రులతో కలిసి కృష్ణా నదీతీరంలో ఈతకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా కార్తీక్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్థానికులు కార్తీక్ కోసం నదిలో గాలించారు. కొద్ది సేపటికి కార్తీక్ మృతదేహాన్ని బయటకు తీశారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్సై డి.సందీప్ తెలిపారు.

దిగుడుబావిలో ఈతకు దిగి..



జగ్గయ్యపేట, మే 23 : స్నేహితులతో సరదాగా గడిపేందుకు వచ్చి దిగుడు బావిలో పడి అనంతలోకాలకు వెళ్లిన యువకుడి ఘటన బలుసుపాడు గ్రామంలో జరిగింది. పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల గ్రామానికి చెందిన జూపుడి కార్తీక్ (18) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం బలుసుపాడు గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నారు. ఎండగా ఉండటంతో పొలాల్లో ఉన్న దిగుడు బావిలో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్నేహితులకు ఈత రాకపోవటంతో సమీపంలో ఉన్న రైతులను పిలిచేసరికి మృతి చెందాడు. చిల్లకల్లు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని విచారించి కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో యువకుడు..

జగ్గయ్యపేట : షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన వై.గోపిరెడ్డి (30) బుధవారం రావికంపాడులో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్టు చిల్లకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. లారీ క్లీనర్‌గా పనిచేసే గోపిరెడ్డి వ్యసనాలకు బానిసై అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక, కుటుంబాన్ని పోషించలేక ఉరి వేసుకున్నట్టు పోలీసులు చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో గురువారం పోస్టుమార్టమ్ నిర్వహించారు.

కొడాలి నానికి స్వల్ప అస్వస్థత!

గుడివాడ : స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో నందివాడ మండల నేతలతో మాట్లాడుతుండగానే సోఫాలో కుప్పకూలిపోయారు. అప్రమత్తమైన నాని గన్‌మెన్‌లు వైద్యులకు సమాచారమందించగా.. ప్రథమ చికిత్స అనంతరం నాని కోలుకున్నట్టు వైసీపీ నేతలు పేర్కొన్నారు. షుగర్ లెవల్స్ పెరగడంతో ఆయన అస్వస్థతకు గురయ్యారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. నాని సోఫాలో కూర్చుని ఫోన్‌చూస్తున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో సెమీస్‌కు కృష్ణా జట్టు

విజయవాడ స్పోర్ట్స్, మే 23 : మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ యూత్ అంతర్ జిల్లాల(రాష్ట్రస్థాయి)బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు తుది దశకు చేరాయి. లీగ్ పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. ఆతిథ్య ఉమ్మడి కృష్ణా జట్టు సెమీస్‌కు చేరింది. టోర్నీ శుక్రవారం ముగియనుంది.

లీగ్ మ్యాచ్‌ల ఫలితాలు : బాలుర విభాగంలో గుంటూరు-శ్రీకాకుళంపై 44-30, అనంతపురం- కృష్ణాపై 65-44, తూర్పుగోదావరి-వైజాగ్‌పై 48-26, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి- వైజాగ్‌పై 54-28, చిత్తూరు-శ్రీకాకుళంపై45-22, గుంటూరు-కడపపై 53-12, కృష్ణా-వైజాగ్‌పై 50-08 తేడాతో విజయం సాధించాయి.

3.24 లక్షల మందికి బీసీజీ టీబీ టీకా

అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 3,24,964 మంది బీసీజీ టీబీ టీకా వేసుకున్నారని ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ తాళ్లూరి రమేష్ తెలిపారు. టీబీ నిర్మూలన కోసం ఆరోగ్యశాఖ ఈ నెల 16 నుంచి బీసీజీ టీబీ టీకా పంపిణీని చేపట్టింది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి టీకాను వేయించుకుంటున్నారని, ప్రతి గురువారం టీకా పంపిణీ చేస్తున్నామని తాళ్లూరి రమేష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3నెలల వ్యవధిలో అందరికీ టీకా పూర్తి చేయాలని లక్ష్యంతో ఉన్నామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

పేపర్ క్విల్లింగ్‌పై వర్క్‌షాపు



పటమట, మే 23 : చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నగరానికి చెందిన స్వహాప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పటమట దేవి లిటిల్ స్టార్స్ పబ్లిక్ స్కూల్‌లో వేసవిశిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. గురువారం పేపర్ క్విల్లింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ మేడా సింధూ శ్రీ పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌కి సంబంధించిన సమాచారాన్ని, మెళకువలను చిన్నారులకు వివరించారు. చిన్నారులు తమ కళా నైపుణ్యంతో అతిథులను, నిర్వాహకులను అబ్బురపరిచారు. స్వహాప్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరంకి భారతిదేవి, పద్మ, మాధురి, కవిత, పద్మలత పాల్గొన్నారు.

పిల్లలకు గురువుల పట్ల గౌరవం నేర్పాలి

చేయూత ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమారి



కేఎల్ రావు భవన్‌లో జరిగిన వేడుకల్లో స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ సభ్యులు

గవర్నర్‌పేట, మే 23: బాల్యం నుంచి పిల్లలు గురువుల పట్ల గౌరవంతో ఉండే నైతిక ప్రవర్తన తల్లిదండ్రులు నేర్పాలని సైకాలజిస్ట్, చేయూత ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమారి అన్నారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కేఎల్ రావు భవన్‌లో వైశాఖ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుదేవుల పాదపూజ, పీఠపూజ, మూలమంత్రం పఠనం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మానవత్వం కలిగి ఉండాలన్నారు రంగరాయ మెడికల్ కళాశాల (కాకినాడ) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాజియా ఫరా మాట్లాడుతూ స్త్రీ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. ట్రస్ట్ ఆథర్ మేకా రజనీకాంత్, కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పైడిపాటి ఉమానాథ శర్మ, అట్లూరి వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులు గురుదేవుల దివ్య ఆశీస్సులు పొంది స్ఫూర్తి కుటుంబం నిర్వహించిన వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

సాయిబాబా మందిరంలో...



నాగమానసాదేవి అమ్మవారికి మహిళల పుష్పాభిషేకం

గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీషిర్డి నాగసాయిబాబా- నాగమానసాదేవి మందిరంలో భక్తులు నాగమానసాదేవి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఉదయం నుంచి ఉపవాసం ఆచరించి అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. మహావిష్ణువు, లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకునేందుకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులు పేదలకు చీపుళ్ల దానాలు చేశారు. భక్తులు కనకమేడల భరత్‌భూషన్-శివపార్వతి, వెన్నా రామాంజనేయులు-వెంకట రమాదేవి, కోడేబోయిన శివరామకృష్ణప్రసాద్-కవిత దంపతులు భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

భవానీపురం : హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ధి షర్డి సాయిబాబా ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేకంగా గణపతి, నవగ్రహ, చండీహోమాలను నిర్వహించారు. భక్తులు బాబాను సందర్శించుకున్నారు. అనంతరం వందలాదిమందికి అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, యెనిగళ్ల సుబ్బారావు, వీపీఎల్ ప్రసాద్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సంకల్ప సిద్ధి షిర్డి ఆలయంలో హోమంలో భక్తులు

ఇద్దరు బ్లేడ్‌బ్యాచ్ సభ్యుల అరెస్ట్

● యాజమానిని కొట్టి కారు అపహరించిన ఘటనలో..

విద్యాధరపురం, మే 23: బబ్బూరి గ్రౌండ్ సమీపంలో యాజమానిని గాయపరిచి కారును అపహరించిన కేసులో భవానీపురం పోలీసులు ఇద్దరు బ్లేడ్‌బ్యాచ్ సభ్యులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మహానాడుకు చెందిన జోగి వెంకటేశ్వరరావు ఈ నెల 21వ తేదీ రాత్రి 8 గంటలకు తన కారులో కిరాయికి పలువురిని ఎక్కించుకుని భవానీపురం వచ్చాడు. వారిని దింపి బబ్బూరి గ్రౌండ్ వైపు వెళుతుండగా ఇద్దరు కారును అడ్డగించి కారులో ఉన్న వెంకటేశ్వరరావును బయటకు లాగి కొట్టి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసులో భవానీపురం పోలీస్ కాలనీ రైతు బజార్ సమీపంలో ఉంటున్న బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు పెయ్యల తరుణ్‌కుమార్ (25), వాంబేకాలనీ ఫ్లాట్ నెంబర్ 130లో ఉంటున్న బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు ఓలేటి విఘ్నేశ్వరరావు అలియాస్ విగ్గు (20)ను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద ఉన్న కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. తరుణ్‌కుమార్‌పై సుమారు 10 కేసులకు పైగా ఉండగా, విఘ్నేశ్వరరావుపై ఐదారు కేసులు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిందితులు ఒంటరిగా ఉన్నవారిని గుర్తించి వారిపై దాడి చేసి వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు, డబ్బులు అపహరిస్తుంటారని పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీనివాస దివాకర్

భవిష్యత్‌లో మరిన్ని సేవలు

● అమరావతి కార్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస దివాకర్

ఆటోనగర్(పెనమలూరు), మే 23: అమరావతి కార్ మెకానిక్స్ అసోసియేషన్ ద్వారా భవిష్యత్తులో సమాజానికి మరిన్ని సేవలు అందిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు తాడేపల్లి శ్రీనివాస దివాకర్ పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని ఒక హోటల్‌లో గురువారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో ఏర్పడిన ఈ అసోసియేషన్ ద్వారా మెకానిక్‌ల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నామన్నారు. ఈఏడాది పదవ తరగతిలో సభ్యుల పిల్లలెవరైనా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తే వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నామని తెలిపారు. జూలై 19న జరిగే మరో సర్వసభ్య సమావేశంలో సదరు బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యదర్శి ఎస్కేబాబు, సహాయ కార్యదర్శి సురేంద్ర, కోశాధికారి సత్యనారాయణ, సహాయ కోశాధికారి ఆదినారాయణ, గౌరవాధ్యక్షుడు ఎస్కే వలి, అసోసియేషన్ గౌరవ సలహాదారు ఎండీ ఖాలిక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో కొత్తగా ధ్యానసాధన వేదిక



ధ్యానయజ్ఞాన్ని ప్రారంభిస్తున్న ఈవో కేఎస్ రామారావు

వన్‌టౌన్, మే 23: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా కొత్తగా ధ్యాన సాధన వేదికను ఏర్పాటు చేశారు. మల్లికార్జున మహామండపంలోని ఆరవ అంతస్థులో గురువారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ధ్యానం చేసుకునే భక్తులకు అవకాశం కల్పించారు. తొలుత ఈవో రామారావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్చక బృందం వేద మంత్రాల మధ్య ధ్యాన విశేషతను గుర్చి వివరించారు. ఈ కార్యక్రమాన్ని దుర్గగుడిలో కొత్తగా ప్రారంభించడం ద్వారా భక్తులకు ధ్యాన, ఆధ్యాత్మిక సంపత్తిని కలుగుజేస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు.

దక్షిణామూర్తికి పూజ

మల్లేశ్వరాలయంలో గురువారం సందర్భంగా దక్షిణామూర్తికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా కుటుంబసభ్యులు

భక్తుల రద్దీ

పౌర్ణమి గురువారం సందర్భంగా దుర్గామల్లేశ్వరుల దర్శనం కోసం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు తమ కోరికల మేరకు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీ చక్రనవవారణార్చన, చండీహోమం, శాంతి కల్యాణం తదితరాలలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

స్వర్ణతాపడానికి విరాళం

దుర్గమ్మ ఆలయ శిఖరం స్వర్ణతాపడం కోసం హైదరాబాద్ సమీపంలోని మేడ్చల్ మల్కాజ్‌గిరికి చెందిన అనంతాల శంకర్ గురువారం ఆలయానికి విచ్చేసి రూ.2లక్షల విరాళాన్ని డోనర్ సెల్‌కు చెక్కు రూపంలో అందించారు. అమ్మవారి దర్శనానంతరం ఈవో రామారావు దాతకు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వర్ణతాపడానికి గురువారం పలువురు దాతలు డోనర్‌సెల్ ద్వారా రూ.5లక్షలు విరాళంగా సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న డీజీపీ కుటుంబసభ్యులు

దుర్గమ్మ దర్శనార్థం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) హరీష్‌కుమార్ గుప్తా గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేశారు. ఈవో రామారావు, ఏఈవో రమేష్‌బాబు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఈవో డీజీపీకి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.



ఆలయంలో భక్తుల రద్దీ

వాటర్ కూలర్ వితరణ

టీడీపీ సీనియర్ నాయకుడు వెలగపూడి శంకరబాబు దంపతులు గురువారం భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించే నిమిత్తం రూ.80వేల విలువ గల 160 లీటర్ల వాటర్‌కూలర్‌ను విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి

వన్‌టౌన్: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీమాతా వైభవం పేరిట శుక్ర, శనివారాలలో జరగనున్న ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఆలయంలో గురువారం ఏర్పాట్లపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్ర, శనివారాలలో సాయంత్రం 6 నుంచి 8 వరకు చాగంటి కోటేశ్వరరావుచే జరగనున్న ఈ ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశమున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

దుర్గగుడిలో తిష్ట వేసిన న్యాయ సలహాదారు

● అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

వన్‌టౌన్, మే 23: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఎదుర్కొంటున్న కోర్టు కేసుల్లో తగు సూచనలు ఇచ్చేందుకు నియామకమైన న్యాయసలహాదారు ఇక్కడే ఎన్నో ఏళ్లుగా తిష్ట వేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అతని నియామకం ఏ విధంగా చెల్లుబాటు అవుతుందంటూ కొందరు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి, ఇతరత్రా భూములకు, లీజులకు సంబంధించి పలు కేసులు కోర్టుల్లో నడుస్తున్నాయి. ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి 30 కేసులు, ఇతరత్రా కేసులు మరో 50 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. కోర్టుల్లో వీటికి పరిష్కారం చేసుకునే వీలున్నా కూడా న్యాయసలహాదారు కాలయాపన చేస్తున్నాడని చెబుతున్నారు. పైగా కొన్నికీలకమైన కేసులు కోర్టుల నుంచి వచ్చే ఉత్తర్వుల అమలు విషయంలో కూడా న్యాయసలహాదారు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కీలకమైన ఒక ఆదేశం కోర్టునుంచి వస్తే ఈవో దృష్టికి తీసుకు వెళ్లలేదు. ఫలితంగా ఈవో కోర్టు గుమ్మం ఎక్కాల్సి వచ్చింది.

వాస్తవంగా న్యాయసలహాదారు పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులను ఆహ్వానించాలి. అందులో మెరిట్, అనుభవం మేరకు నియవింంచాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత న్యాయ సలహాదారు విషయంలో అటువంటి వేవీ లేవని చెబుతున్నారు. ప్రతి రెండేళ్లకొకసారి ఇలా నోటిఫికేషన్ ఇచ్చి నియామకం చేసుకో వాల్సి ఉంటుంది. ప్రస్తుత న్యాయసలహాదారుకు సంబంధించి దేవదాయ కమిషనర్ ఆమోదం కూడా లేదని తెలుస్తోంది. వాస్తవానికి దేవస్థాన కోర్టు కేసులను పరిష్కరించేందుకు దేవదాయశాఖ తరపున పద్మావతి అనే మహిళ స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు కేసుల వారీగా పారితోషికం ఇస్తున్నారు. ఆమె కొనసాగుతుండగానే ఎటువంటి నోటిఫికేషన్ తదితరాలు ఏమీ లేకుండానే న్యాయసలహాదారుని నియమించుకున్నారు. ఇతనికి దేవస్థానం కూర్చోపెట్టి వేతనం ఇస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి .

దీనిపై ఈవో రామరావును వివరణ కోరగా తాను పూర్తి వివరాలు తెలుసుకుంటానని, న్యాయసలహాదారు గురించి పూర్తి సమాచారం తనకు తెలియదని చెప్పారు పూర్తి వివరాలు తెలుసుకుని అందులో ఏదైనా తప్పిదాలు ఉంటే సరిచేస్తామని తెలిపారు.

పకీరుగూడెంలో ఇరువర్గాల దాడులు

● సంఘటనను గోప్యంగా ఉంచిన కృష్ణలంక పోలీసులు

వన్‌టౌన్, మే 23: కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధి పకీరుగూడెంలో ఇరువర్గాలు దాడులు చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనను కృష్ణలంక పోలీసులు గోప్యంగా ఉంచారు. ఈ సంఘటన వివరాల మేరకు నాలుగు రోజుల క్రితం పకీరుగూడెంలో పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు స్క్రూడ్రైవర్లు, కత్తులతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయలైనట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లిన సమయంలో అక్కడ దాడులకు పాల్పడినవారు పరారైనట్లు తెలిసింది. అయితే పోలీసులు అక్కడుంటున్న పలువురు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి వారిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

ఈ సంఘటనపై సంబంధిత పోలీసులను వివరణ అడుగగా తమకు తెలియదని ఈ విషయం పైస్థాయి అధికారుల దృష్టిలో ఉన్నట్లు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో తెలిపారు. ఈ గొడవలలో పకీరుగూడెంలో ఉన్న పలువురు స్థానికులతో పాటు బాడవపేటకు చెందిన పలువురు యువకులు పాల్గొన్నట్లు సమాచారం.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, మే 23: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక విద్యుత్ ఉపకేంద్రం, 11కేవి బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. బాపనయ్యనగర్, చలసానినగర్, రాణిగారితోట, పాత కొత్త శాంపిల్ బిల్డింగ్ ఏరియా, సంగీత అపార్ట్‌మెంట్, పేర్ని బదీన్రాథ్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.













ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

PLOT FOR SALE

» విజయవాడ, బందరు రోడ్డు దగ్గరలో గోసాలలో CRDA Approved Open Plots అందుబాటు ధరలలో కలవు. సంప్రదించండి. సెల్ : 92477 70999
AJB - 086048

TO - LET

» క్రిష్ణలంక, SBI రోడ్, గుండుకోటయ్య వీధిలో పూర్తి ఫర్నీచర్‌తో A/C రూములు, GF లో పూర్తి బిల్డింగ్ ఆఫీసులకు, ఉద్యోగులకు, వ్యాపారులకు, ఫ్యామిలీస్‌కు అద్దె కొరకు సంప్ర. : 83099 04493
AJB - 138

WANTED

» గూడవల్లి, VJA సిటీలో అన్ని ఏరియాలలో సెక్యూరిటీ గార్డులు కావలెను. వయస్సు, చదువుతో పనిలేదు. మంచిజీతం. ఒంటరి వారికి వసతి. సెల్ : 9247271222, 9642313999
AJB - 127

» క్రిష్ణలంక SBI రోడ్, గుండుకోటయ్య వీధిలో ఫ్యామిలీతో ఉండి వాచ్‌మెన్‌గా పనిచేసే వారికి ఉండటానికి రూము ఇచ్చి, జీతం ఇవ్వబడును. ఇస్త్రీ చేసే వారికి అవకాశము. సంప్ర. : 83099 04493
AJB - 137

EDUCATION


» మంచి ఉద్యోగం కావాలా? చదవండి B.Sc. ఫోరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / డైరీ సైన్స్ / AI & ML; BBA; B.Voc. మెడికల్ ఇమేజింగ్ . అడ్మిషన్లకై సంప్ర : 84658 74867, మేరీ స్టెల్లా కాలేజ్, విజయవాడ.
AJB - 182328


పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240









ఘనవిజయం సాధించాలి

అల్లు అరవింద్



ఆశిష్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ మూవీ కోసం చిత్రబృందం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి. 'లవ్ మీ' టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని అన్నారు. "లవ్ మీ' డిఫరెంట్ సినిమా. ఈ చాలెంజింగ్ స్క్రిప్ట్‌ను అరుణ్ తెరకెక్కించిన విధానం సూపర్బ్. కొత్తదనాన్ని కోరుకునే ప్రేక్షకులకి ఈ సినిమా తప్పక నచ్చుతుంది" అని నిర్మాత దిల్‌రాజు చెప్పారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ "ఈ సినిమాతో దర్శకుడు అరుణ్ నాన్ లీనియర్ నేరేషన్‌కు కొత్త నిర్వచనం ఇచ్చారు" అని అన్నారు. చిత్ర దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు సీక్వెల్‌గా 'కిల్ మీ ఇఫ్ యు డేర్' వస్తుంది" అని చెప్పారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమా సక్సెస్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సంగీత దర్శకుడు కీరవాణి, సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ వంటి దిగ్గజాలు ఈ సినిమాకు వర్క్ చేయటంతో లక్కీగా ఫీలవుతున్నాం" అని చెప్పారు.

రాజు యాదవ్ ఓ ఎమోషనల్ రైడ్



టెలివిజన్ కామెడీ షో 'జబర్దస్త్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు గెటప్ శ్రీను. తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఆయన.. మంచి కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుని పాపులర్ కమెడియన్‌గా మారారు. ఆయన తొలిసారి హీరోగా నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఫన్, ఎమోషనల్ రైడ్‌గా తెరకెక్కిన 'రాజు యాదవ్' ఈ రోజే విడుదలవుతున్న సందర్భంగా హీరో గెటప్ శ్రీను మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు నన్ను కలిసినప్పుడు మొదట నా పాత్ర గురించి చెప్పారు. భలే అనిపించింది. ఆ తర్వాత కథ వినగానే వెంటనే ఒప్పేసుకున్నా. ఈ కథను డైరెక్టర్ వాస్తవ సంఘటనల ఆధారంగా రాసుకున్నా. క్యారెక్టర్ మాత్రం కల్పితమే. నేను ఇప్పటి వరకు చేసిన పాత్రల్లో అత్యంత సవాల్‌తో కూడుకున్నది ఇదే. ఎప్పుడూ నవ్వుతూ ఉండటం మామూలు విషయం కాదు. కొన్ని సందర్భాల్లో ఈ పాత్రలో వంద శాతం ఇవ్వలేనేమోనని.. ఒక ఆర్టిస్ట్‌గా ఫెయిల్ అయిపోతానేమో అని అనుకున్న సందర్భాలూ ఉన్నాయి. అటువంటి సమయాల్లో దర్శకుడే నన్ను సపోర్ట్ చేశారు. ఈ సినిమాను దర్శకుడు కృష్ణమాచారి చాలా సహజంగా తెరకెక్కించారు. ప్రస్తుత తరం ప్రేక్షకులు రియలిస్టిక్ సినిమాలనే ఇష్టపడుతున్నారు. ఈ సినిమా కూడా సహజత్వం కోరుకునే ప్రేక్షకులందరికీ తప్పక నచ్చుతుంది" అని చెప్పారు.

'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ఇళయరాజా లీగల్ నోటీసులు



మలయాళ బ్లాక్‌బస్టర్ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా లీగల్ నోటీసులు పంపారు. కారణం 'గుణ' చిత్రం కోసం ఇళయరాజా స్వరపరిచిన 'కమ్మని ఈ ప్రేమ లేఖలే' పాటను ఈ సినిమాలో వాడడమే. అనుమతి తీసుకోకుండా, రాయల్టీ ఫీజు చెల్లించకుండా ఇలా పాటను ఉపయోగించడం కాపీరైట్ చట్టాన్ని అతిక్రమించినట్లేనని ఇళయరాజా లాయర్ శరవణన్ అన్నాదురై నిర్మాతలకు పంపించిన నోటీసులో హెచ్చరించారు. ఈ విషయంపై 15 రోజుల్లో నిర్మాతలు తగిన విధంగా స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని ఆయన తెలిపారు. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న 'కూలీ' సినిమాలోనూ తను సంగీతం అందించిన 'తంగా మగన్'(1983) చిత్రంలోని 'వా వా పక్కమ్ వా' పాటను కూడా అనుమతి లేకుండా వాడారని ఇళయరాజా, నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్‌కు ఈ నెల 2న నోటీసులు పంపిన సంగతి తెలిసిందే.

దర్శకుడిగా మరో కొరియోగ్రాఫర్



పలు చిత్రాలకు కొరియోగ్రఫీ నిర్వహించిన సతీశ్‌రాజ్ దర్శకుడవుతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఎస్.ఆర్. మూవీ జంక్షన్ బేనరుపై ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సంస్థ లోగోను సీనియర్ నటుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. తన ఇష్టదైవం సాయిబాబా కావడంతో 'శ్రద్ధ.. సబూరి' పేరుతో రూపొందించిన పాటను కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ, నిర్మాత దామోదర ప్రసాద్ రిలీజ్ చేశారు. మూడు నిముషాల పాటలో మొత్తం కథ అర్థమయ్యేలా చూపించే దర్శకుడే కొరియోగ్రాఫర్ అనీ, ప్రతిభావంతుడైన సతీశ్‌రాజ్ దర్శకుడిగా మారడం ఆనందదాయకం అనీ మురళీమోహన్ చెప్పారు. సభలో పాల్గొన్న అతిథులందరూ దర్శకుడిగా కూడా సతీశ్‌రాజ్ విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శిరీష, నిర్మాత అర్చన కూడా పాల్గొన్నారు.

కొత్త తేదీన సత్యభామ



కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'సత్యభామ'. ఇందులో ఆమె శక్తిమంతమైన పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. జూన్ 7న 'సత్యభామ'ను విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: బి విష్ణు







గీతాసారం

యోగే అత్యున్నతుడు

"తపస్వికన్నా, శాస్త్ర జ్ఞాని కన్నా, కర్మలను ఆచరించేవాడికన్నా ఉన్నతుడు. కాబట్టి ఓ అర్జునా! యోగివి కావడానికి ప్రయత్నించు. యోగుల్లో, ఎల్లప్పుడూ నా మీదే మనసులను ఎవరు లగ్నం చేస్తారో, గొప్ప శ్రద్ధతో, సమర్పణ భావంతో నా భక్తిలో నిమగ్నమవుతారో, వారిని అత్యంత స్థితప్రజ్ఞులుగా నేను పరిగణిస్తాను" అని 'తపస్విభ్యోధికో యోగి', 'యోగినా మపి సర్వేషాం' అనే గీతా శ్లోకాలలో శ్రీకృష్ణుడు చెప్పాడు.

యోగుల వివిధ లక్షణాలను వివిధ సందర్భాల్లో శ్రీకృష్ణుడు వివరించాడు. వీటిలో ద్రువణాలను అధిగవించడం (ద్వంద్వాలకు అతీతంగా ఉండడం- ద్వంద్వాతీతం), గుణాలను అధిగమించడం (గుణాతీతం), గుణాలే అసలైన కర్తలనీ, తను కేవలం సాక్షిని మాత్రమేననీ గ్రహించడం, శత్రువునైనా, మిత్రుడినైనా ఒకేలా చూడడం, పొగడ్తనైనా, విమర్శనైనా ఒకేలా తీసుకోవడం (సమత్వం), ఫలాన్ని ఆశించని యజ్ఞంలాంటి పనులను (నిష్కామ కర్మలను) చేయడం, కర్మ ఫలాపేక్షను వదులుకోవడం లాంటివి ఉన్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా ఒక యోగి తన ఆత్మలోనే ఆనందాన్ని వెతుక్కుంటాడు, ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తాడు. ఏదైనా ఉన్నతమైనదాన్ని సాధించాలనే లక్ష్యంతో కఠినమైన క్రమశిక్షణతో ప్రయత్నించేవాడు, త్యాగాలు చేసేవాడు తపస్వి. సాధారణమైన వ్యక్తులెవరూ సాధారణ జీవనయానంలో చేయలేని దాన్ని తపస్వులు చేస్తారు కాబట్టి ప్రశంసాపాత్రులవుతారు. కానీ, దేన్నో సాధించాలనే కోరిక మాత్రం ఇంకా అలాగే ఉంటుంది. అయితే... పరమాత్మను చూడాలనే కోరికతో సహా అన్ని వాంఛలనూ వదులుకోనేవాడు యోగి. ఆ లక్షణమే యోగి కన్నా తపస్విని తక్కువ స్థాయిలో ఉంచుతుంది.

శాస్త్రజ్ఞాని అంటే విజ్ఞానాన్ని సంపాదించాలనే సంకల్పం కలిగినవాడు. చివరకు ఈ లక్షణం కూడా లోకుల మెప్పును పొందుతుంది, ఎందుకంటే అతనికి సాధారణ వ్యక్తికన్నా ఎక్కువ విషయాలు తెలుసు. కానీ అన్నీ తనలోనే ఉన్నాయనీ, తనే అన్నిటిలోనూ ఉన్నాడనీ తెలియాలి. ఇది తెలుసుకున్నాక భ్రమలన్నీ తొలగిపోతాయి. ఈ సత్యాన్ని తెలుసుకుంటే... అంతకు మించి తెలుసుకోవాల్సినది ఇంకేమీ ఉండదనీ యోగి గ్రహిస్తాడు. కర్మ బంధాలు అతణ్ణి కట్టి ఉంచలేవు. కాబట్టి అందరికన్నా యోగి అత్యున్నతుడు.

కె. శివప్రసాద్
ఐఎఎస్

క్షమాగుణం

మానవుల్లో క్షమాగుణం అత్యున్నతమైనదనీ, అది భగవంతుణ్ణి చేరువ చేసే మార్గం అనీ మహా ప్రవక్త మహమ్మద్ బోధించేవారు. బద్ధ శత్రువునైనా, తీవ్రంగా హాని కలిగించడానికి ప్రయత్నించిన వారినైనా మన్నించడంలోనే మానవత్వం, దైవత్వం ఉన్నాయని చెప్పడమే కాదు... ఆచరించి కూడా చూపేవారు. అలాంటి సంఘటనలు ఆయన జీవితంలో ఎన్నో కనిపిస్తాయి.

ఒకసారి ఆయన తోటలో చెట్టుకు ఆనుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇది గమనించిన ఒక శత్రువు... ఆయనను హతమార్చడానికి ఇదే సరైన సమయం అనుకున్నాడు. కత్తితో ఆయన ముందుకు వచ్చి "ఇప్పుడు నిన్ను ఎవరు రక్షిస్తారు?" అంటూ కత్తి దూశాడు. "నన్ను అల్లాహ్ రక్షిస్తాడు" అని దైవప్రవక్త చెప్పారు. ఆయన ఆ మాట అంటూ ఉండగానే ఆ శత్రువు చేతిలోని కత్తి జారిపోయింది. ఆ కత్తిని దైవప్రవక్త తీసుకొని... "ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తారు?" అని అడిగారు. ఆ వ్యక్తి వణుకుతూ "ఎవరూ లేరు" అన్నాడు. "నిన్ను కూడా ఆ అల్లాహ్‌యే రక్షిస్తాడు" అంటూ ఆ వ్యక్తిని క్షమించి వదిలేసారు. తనకు విషం పెట్టాలనుకున్న మహిళను, తన పినతండ్రి హజ్రత్ హంజాను హతమార్చినవారిని, తన కుమార్తె జైనబ్ గర్భంతో ఉన్నప్పుడు ఆమెపై దాడి చేసి, గర్భస్రావం చేసినవారినీ, మక్కా నగరంలో తనపై దౌర్జన్యాలకు పాల్పడినవారిని సైతం ఆయన మన్నించారు.

దైవ ప్రవక్త రోజూ తన ఇంటి నుంచి మసీదుకు వెళ్ళే దారిలో ఒక మహిళ ఇల్లు ఉండేది. ఆమెకు ప్రవక్త అంటే కోపం. ఆయన వీధిలో నడుస్తున్న

సందేశం



ప్పుడు... తన ఇంటి మేడమీద నుంచి ప్రతిరోజూ చెత్తను ఆయనపై కుమ్మరించేది. ఆయన మౌనంగా వెళ్ళిపోయేవారు. ఒక రోజు ఆయన మసీదుకు వెళ్తుండగా... ఆ మహిళ కనిపించలేదు. వెంటనే ఆగి, పొరుగువారిని ఆమె గురించి ఆరా తీశారు. ఆమె అనారోగ్యంతో మంచానపడి ఉందని ఆయనకు తెలిసింది. ఆ ఇంట్లోకి వెళ్ళి... ఆమెను పరామర్శించారు. త్వరగా కోలుకుంటావని ధైర్యం చెప్పారు. దైవప్రవక్త వైఖరి ఆమెపై గొప్ప ప్రభావం చూపించింది. ఆ తరువాత... ద్వేషపూరితమైన పనులేవీ ఆమె చెయ్యలేదు. ఈ విధంగా... మనను ద్వేషించేవారి ప్రవర్తనలో క్షమాగుణంతో మార్పు తీసుకురావచ్చని దైవప్రవక్త నిరూపించారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

స్వానుభవం



తిరిగి ఇవ్వడమే అసలైన ఆధ్యాత్మికత



"నాకు ఈ జీవితమే దైవదత్తం. ఎందుకంటే... నేను మా అమ్మకు నెలలు నిండకుండానే... ఏడో నెలలో పుట్టాను. అది 1945. అప్పట్లో యాంటీ బయాటిక్స్ లేవు, ఇంక్యుబెటర్లూ లేవు. అలాంటి పరిస్థితుల్లో జననం, పుట్టిన తరువాత బతికి బైటపడడం కష్టమే. అయినా దేవుడు వైద్యుడి (మా మేనమామే) రూపంలో వచ్చి... అతి క్లిష్ట పరిస్థితుల్లో నన్ను బతికించాడు, నా ప్రాణం నిలబెట్టాడు. ఈ విషయం మా అమ్మ ద్వారా, బంధువుల ద్వారా నేను విన్నప్పుడు... అదంతా దేవుడి సంకల్పమే అనిపించింది. అటువంటి నేను... యవ్వనంలో చాలా మంది లాగానే 'ఏగ్నస్టిక్' (అజ్ఞేయతావాది)గా ఉండేవాణ్ణి. అంటే దేవుడు ఉన్నాడో లేదా తెలియని వాణ్ణి. నాస్తికుణ్ణి అన్నా పరవాలేదు.

కానీ దైవ శక్తి మీద విశ్వాసం బలపడే అనుభవం ఒకటి నేను బియస్సీ చదివేటప్పుడు ఎదురయింది. కెమిస్ట్రీలో చిన్న పొరపాటు జరగడంతో నాకు ఫస్ట్ క్లాస్ రాకుండా పోయింది. దెబ్బకు కళ్ళు తెరుచుకున్నాయి. తిరుపతి కొండకు నడిచి వస్తానని మొక్కుకున్నాను. మొక్కు తీర్చుకున్నాను కూడా. అప్పటి నుంచి నా జీవితం మారిపోయింది. ఎమ్మెస్సీలో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చా. సివిల్స్‌లో మొదటి ప్రయత్నంలోనే ర్యాంక్ సాధించా. దేవుడి కరుణ నిరంతరంగా ప్రసరించడంతో... ఉద్యోగం, వివాహం, సంతానం, తల్లితండ్రులను, అత్తమామలను సేవించుకొనే భాగ్యం - అన్నీ కలిగాయి. దేవుడిపై బ్రహ్మాండమైన గురి కుదిరింది. ప్రతి ఏటా తిరుపతికి కాలినడకన వెళ్ళాను, అంగప్రదక్షిణలు చేశాను.

తిరుపతి వెంకన్ననే కాదు... యాదగిరి నరసింహుణ్ణి, విజయవాడ కనకదుర్గను, అన్నవరం సత్యనారాయణ స్వామినీ... అందరినీ శక్తి ఉన్నంతకాలం కాలినడకనే దర్శించుకున్నాను. ఈ తీర్థయాత్రలు చేసినంత మాత్రాన నాకు కష్టాలేవీ రాలేదని చెప్పను. అయితే, అవి తీరాలని నేను దేవుళ్ళతో ఎప్పుడూ బేరాలు ఆడలేదు. దేవుళ్ళు నా కష్టాలను తొలగించకపోయినా... వాటిని తట్టుకొనే శక్తిని ప్రసాదించారు. నిరుత్సాహం, నిస్పృహ కలిగినప్పుడు నా వెన్ను తట్టారు. 'ప్రతిఫలం ఆశించకుండా నీ విధి నీవు చెయ్యి' అని ప్రేరేపించారు. నా కర్తవ్య నిర్వహణ సజావుగా సాగడానికి ఒక్కోసారి మృత్యుముఖం నుంచి తప్పించారు కూడా. వృత్తిపరంగా ధైర్యంగా, నిజాయితీగా నిలబడడానికి, దుష్ట శక్తుల ప్రయత్నాలను తట్టుకోవడానికి, ధర్మాన్ని తప్పకుండా ఉండడానికి తగిన స్థయిర్యాన్ని ప్రసాదించారు.

ఆధ్యాత్మికత అనగానే సర్వసంగ పరిత్యాగం, జన్మరాహిత్యం కోసం పరితపించడం అనుకుంటారు చాలామంది. నా దృష్టిలో... ఆధ్యాత్మికత అంటే ప్రకృతి పట్ల, సమస్త జీవరాశుల పట్ల ప్రేమ కలిగి ఉండడం. "మోక్షం కన్నా నేను పునర్జన్మనే కోరుకుంటాను" అన్నాడు రవీంద్ర కవీంద్రుడు. అద్భుతమైన భగవంతుడి సృష్టిని ఆస్వాదించాలంటే జన్మంటూ ఉండాలి కదా! దేవుడు ఇచ్చిన వరం... జీవితం. ప్రకృతి ద్వారా దేవుడు అందిస్తున్న కానుకలకు కృతజ్ఞులమై ఉంటూ, మనకు ఎంతో ఇచ్చిన సమాజానికి కొంతైనా తిరిగి ఇవ్వడం అసలైన ఆధ్యాత్మికత! కార్ల్‌మార్క్స్ చెప్పినట్టు భక్తి 'నల్ల మందు' కాదు... కష్టాలను భరించి, రేపటి రోజుపై నమ్మకాన్ని కలిగించే టానిక్. దేవుడు నేను పుట్టినప్పుడే పెద్ద గండం నుంచి తప్పించాడు. ఆ తరువాత నా జీవితంలో దక్కిన తక్కినవన్నీ బోనస్సే! ఇంగ్లీషులో 'కౌంట్ యువర్ బ్లెస్సింగ్స్' అంటారు. మనకు దక్కినవాటిని లెక్క వేసుకొని చూసుకుంటే... దేవుడిపై ఫిర్యాదు చేయడానికి మనకు అవకాశమే చిక్కదు. ఆ కృతజ్ఞతా భావమే అతి పెద్ద ఆధ్యాత్మిక భావన అని నా ఉద్దేశం.

> నా దృష్టిలో మతం అనేది కేవలం వ్యక్తిగతమైన విషయం. సామూహికంగా పూజాది కార్యక్రమాల్లో, భజనల్లో పాల్గొనవచ్చు. కానీ సృష్టికర్తతో మనసువిప్పి సంభాషించడం అనేది ఆంతరంగిక వ్యవహారం. ఇక, పూజ ఫలానా విధంగానే చేసి తీరాలని నిబంధనలు విధించడం, దేవుడి పేరు చెప్పి భయపెట్టాలని చూడడం సరికాదు. "చిత్తశుద్ధి లేని శివపూజలేల?" అన్నాడు వేమన. కర్మల ఫలం అనుభవించక తప్పదని మత గ్రంథాలు బోధిస్తున్నా... అడ్డదారులు చూపిస్తామనే స్వామీజీలను ఆశ్రయించడంలోని విజ్ఞత నాకు అర్థం కాదు. దేవుడి ధ్యానం ద్వారా దైవ సంపర్కం పెంచుకోవడం కన్నా... ఆడంబరం ప్రదర్శిస్తూ, భౌతిక అవసరాల మీద ఆశలు కల్పిస్తున్న గురువుల వెంట పరుగులు పెట్టేవారిని చూస్తే... 'అయ్యో పాపం! చిల్లర రాళ్ళకు మొక్కుతున్నారే?' అనిపిస్తుంది. భారీస్థాయిలో పూజాది క్రతువులు చూసినప్పుడు... 'పాపకర్మలు చేశామేమోనన్న అపరాధ భావనను తుడిచివేసుకోవడానికే అట్టహాసం చేస్తున్నారా?' అనిపిస్తుంది.

ఇక... నేను చేసే పూజలన్నీ తగు మోతాదులోనే ఉంటాయి. అన్నహోమం చేయడం కన్నా అన్నదానం చేయడం మేలని నా ఉద్దేశం. "ఆకలితో ఉన్నవాడి ముందర భగవంతుడు కూడా ఒక ముద్ద అన్నం రూపంలో తప్ప... వేరే రూపంలో ప్రత్యక్షమవడానికి సందేహిస్తాడు" అన్నారు గాంధీ మహాత్ముడు. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్నారు మన పూర్వులు. సమాజంలో ఆధ్యాత్మికత, భక్తిభావం పెంపొందించాలంటే... సామాన్యుడి కనీస అవసరాలు తీర్చడానికి కృషి చేయాలి. ఆత్మారాముడు సంతృప్తి పడందే... అసలు రాముడి గురించి జీవికి ఆలోచన రాదు."

- డాక్టర్ మోహన్ కందా, ఐఎఎస్
విశ్రాంత ముఖ్యకార్యదర్శి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్


సంభాషణ: కృష్ణశర్మ

నిజమైన తపస్సు

చింతన

తపస్సు అంటే ఋషులు, మునుల్లా అడవిలో ఏకాంతంగా, ముక్కు మూసుకొని చేసే ధ్యానమని మనం భావిస్తాం. 'తపస్' అనే శబ్దానికి నిజమైన అర్థం... దహించడం. 'కాయేంద్రియ సిద్ధిః అశుద్ధా క్షయాత్ తపసః' అని నిర్వచించాడు పతంజలి మహర్షి... తన 'యోగదర్శనం'లో. 'శారీరకమైన, మానసికమైన కల్మషాలను తొలగించేదే తపస్సు' అని ఈ సూత్ర భావం. ఉదాహరణకు, ఉపవాసం అనే భౌతిక తపస్సుతో మన శరీరంలో ఉండే అధికమైన కొవ్వును, విషపదార్థాలను... అలా పేరుకుపోయిన వాటిని దహించివేస్తాం. అలాగే మానసిక తపస్సుతో... మన మనస్సులో నాటుకొని ఉన్న పాత, పనికిమాలిన భావాలను దహిస్తాం. వాచికమైన తపస్సులో మౌనం పాటిస్తాం. దానివల్ల మన వాగ్ధారను నియంత్రించుకుంటాం. అయితే... వాటిని మనం దహిస్తున్న సమయంలో కొంత వేడి, బాధ కలగడం గమనించవచ్చు. నొప్పికి సైతం లోనవుతాం. కాబట్టి తపస్సు అంటే... 'బాధను అంగీకరించడం' అని కూడా అర్థం. ఒకవేళ ఒక వ్యక్తి వేదనకు గురి అవుతున్నాడంటే... దాంతో అతనిలోని మాలిన్యాలు, కల్మషాలు నశించి... నిష్కల్మషుడు, శుద్ధుడు అయ్యాడని అర్థం.

మన నిత్య జీవితంలో సైతం తపస్సుకు ఎన్నో అవకాశాలు తటస్థపడతాయి. ఒక వస్త్రం కూడా పరిశుభ్రం కావడానికి తపస్సుకు లోనవుతుంది. మన వస్త్రాలను లాండ్రీ అతను ఏం చేస్తాడు? కేవలం మడతపెట్టి, వాటి మీద కాస్త చందనం పొడి చల్లి, మడతల్లో మల్లెపూలు పెట్టి తిరిగి ఇచ్చెయ్యడు కదా? వాటిని మొదట సలసల మరిగే నీళ్ళలో నానబెడతాడు. అందులో సబ్బుపొడి వేస్తాడు. ఆ తరువాత వాటిని బండమీద బాదుతాడు. అనంతరం కింద పడేసి, దొర్లించి, గట్టిగా పిండుతాడు. తరువాత వాటిని ఎండలో ఆరేస్తాడు. ఆరగానే వాటిని వేడి ఇస్త్రీపెట్టెతో ఇస్త్రీ చేస్తాడు. అప్పుడే ఆ వస్త్రాలు తమ మురికిని కోల్పోయి, స్వచ్ఛంగా తయారై, ధరించడానికి అనువుగా ఉంటాయి. అంటే... వస్త్రాలు తీవ్రమైన తపస్సుకు లోనై, శుభ్రంగా, శుద్ధంగా మారుతాయి. లాండ్రీ వ్యక్తికి ఆ వస్త్రాల మీద ద్వేషమేమీ లేదు. పైన చెప్పిన విధానం అంతా వాటి మాలిన్యం తొలగించడానికే.



అదేవిధంగా... మనస్సును ఉతకాలి, పిండాలి. దులపాలి, ఎండవేయాలి. ఇస్త్రీ చెయ్యాలి. ఎవరైనా మనకు బాధ కలిగించినప్పుడు... వారు మనల్ని ద్వేషిస్తున్నారని అనుకోకూడదు. మనల్ని మనం పరిశుద్ధం చేసుకోవడానికి సహాయపడుతున్నారని భావించాలి. అప్పుడే మనం నిజమైన యోగిలా ఆలోచించగలుగుతాం. మన భావాల్ని ఎవరైనా గాయపరచినప్పుడు... వాళ్ళను చూసి చిరునవ్వు నవ్వగలగాలి. "ధన్యవాదాలు. ఇలాంటివి నాకు ఇంకా ఇంకా కావాలి. మీరు నన్ను పవిత్రం చేస్తున్నారని మీకు తెలుసు. మీ మిత్రుల్ని కూడా పిలుచుకురండి. నన్ను గాయపరచాలనే వారి కోరిక నెరవేరుతుంది" అని చెప్పాలి. మనకు ఈ విషయం బోధపడితే... మనల్ని దూషించే, నిందించేవారిని తప్పుపట్టం సరికదా... వాటన్నిటినీ అంగీకరించి, భరిస్తాం. పొగడ్తలకు ఆనందిస్తూ, అవమానాలకు కుంగిపోతున్నామంటే... మన మనస్సు ఇంకా స్థిరంగా... దృఢంగా లేదన్న మాట. ఒక దూషణ... మన బలహీనతను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. 'ఒదిగిపో, కుదురుకో, సర్దుకుపో' అనే తత్త్వాన్ని అలవరచుకోవాలి. అవమానాలను భరించాలి, గాయాలను సహించాలి. ఇదే ఉత్తమ సాధకుడి లక్షణం. ఏకాంత ప్రదేశంలో ఉంటూ, ఏదో ఒక మంత్రాన్ని జపిస్తూ కూర్చోవడం ఎవరైనా చేయగలరు.. నిందలనూ, అవమానాలనూ భరిస్తూ... మనస్సును స్థిమితంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంచుకోవడం... జపమాలను వేల సార్లు తిప్పుతూ మంత్రాన్ని ఉచ్చరించడం కన్నా ఎంతో గొప్పది. శరీరాన్ని, ఇంద్రియాలను నియంత్రించడం తపస్సువల్ల లభిస్తుంది. మనం అన్నిటినీ అంగీకరించినప్పుడు... ఏది మనల్ని ప్రభావితం చేస్తుంది? ఎవరో మనల్ని మూర్ఖుడన్నా ఒప్పుకోవాలి. అద్భుతమైన వ్యక్తి అన్నా ఒప్పుకోవాలి.

> 'తపస్' అనే శబ్దానికి నిజమైన అర్థం... దహించడం. 'కాయేంద్రియ సిద్ధిః అశుద్ధా క్షయాత్ తపసః' అని నిర్వచించాడు పతంజలి మహర్షి... తన 'యోగదర్శనం'లో. 'శారీరకమైన, మానసికమైన కల్మషాలను తొలగించేదే తపస్సు' అని ఈ సూత్ర భావం.

ఒకప్పుడు ఒక యోగి ఓ ఊరికి వచ్చాడు. ఊరు బయట ఉన్న రావి చెట్టు కింద కూర్చున్నాడు. ఆ ఊరి ప్రజలు ఆయనను దర్శించుకొనేవారు. ఆయన వాళ్ళ సందేహాలు తీర్చేవాడు. సాయంత్ర వేళల్లో సత్ప్రవర్తన గురించీ, మంచి చెడుల గురించి బోధించేవాడు. ఆ ఊర్లోనే ఉన్న ఒక ధనవంతుడికి ఇది కంటగింపుగా ఉండేది. ఒకనాడు... యోగి ఒంటరిగా ఉన్న సమయంలో ఆయన దగ్గరకు వచ్చాడు. ఆయనను అవమానించి, కోపం తెప్పించాలనుకున్నాడు. ఆయనను నిందించడం ప్రారంభించాడు.

"ఓరీ దుష్టుడా! వంచకుడా! నీవు జనాలను మోసం చేస్తున్నావు. నీ బోధనల వల్ల ఎంతమంది పనీపాటా లేకుండా నష్టపోయారో తెలుసా?..." ఇలాంటి మాటలతో ఆ ధనికుడు దూషిస్తున్నా... యోగి మాత్రం చిరునవ్వుతో ప్రశాంతంగా చూస్తున్నాడు.

"నీకు నా భాష అర్థం కావడం లేదా?" అని అడిగాడు ధనికుడు.

"బాగా అర్థం అవుతోంది" అన్నాడు యోగి.

"అంటే నేను నిన్ను అవమానిస్తున్నట్టు తెలుస్తోందా?" అని నమ్మలేనట్టుగా ప్రశ్నించాడు ధనికుడు.

"అవును" అన్నాడు యోగి.

"అయితే, మౌనంగా ఎలా ఉండగలుగుతున్నావు?" అని అడిగాడు ధనికుడు.

అప్పుడు సాధువు "నాయనా! నీవు నా వద్దకు వచ్చేటప్పుడు ఒక పండో, ఫలమో, ఏదైనా కానుకో తెచ్చావనుకుందాం. నేను వాటిని తీసుకోకుండా నిరాకరించానని అనుకుందాం. అప్పుడు నీవేం చేస్తావు?" అన్నాడు.

"వాటిని తిరిగి తీసుకువెళ్తాను."

"అదే విధంగా... ఇంతవరకూ నీవు పలికిన నిందా వాక్యాలు, తిట్లు నేను స్వీకరించడం లేదు. వాటిని నీవే తీసుకువెళ్ళు" అన్నాడు యోగి ప్రశాంతంగా.

ఈ విధంగా వ్యవహరించడం వల్ల... నిజమైన మానసిక శక్తి, ధైర్యం కలుగుతాయి. ఎవరినైనా శారీరకంగా ఎదిరించి, భౌతికంగా పోరాడేవారికి దేహదారుఢ్యం ఉంటుంది. అతను మానసికంగా బలహీనుడన్నమాట. తపస్సువల్ల మానసిక స్థైర్యం లభిస్తుంది. ఇది బాధను సహించడంతో ఏర్పడుతుంది. ఆ స్థితిలో బాధ, నొప్పి ఇక ఉండవు. ఆనందం మిగిలిపోతుంది. వేదనను సహించడం వల్ల కలిగే ప్రయోజనాన్ని మనం వాస్తవంగా గ్రహించడమే దీనికి కారణం.

ఈ లోకంలో మనకు ఒక చిన్న, అందమైన ఉదాహరణ కనిపిస్తుంది. అదే అమ్మ. తనకు ఎదురైన అత్యంత కష్టమైన ప్రసవవేదనను భరించి... బిడ్డకు జన్మను ఇవ్వడంలో ఆనందాన్ని అమ్మ అనుభవిస్తుంది. తనకు ఆ బాధ వద్దని ఆమె అనుకోదు సరికదా... పురిటినొప్పులతో సహా ప్రసవంలో కలిగే ప్రతి బాధనూ ఆహ్వానిస్తుంది. దానికి మూల్యమేమిటో, ప్రతిఫలమేమిటో ఆమెకు బాగా తెలుసు. ఆమెది నిజమైన తపస్సు.

• అప్పరుసు విజయరామారావు,
9177086363

దైవమార్గం

మాటే మంత్రమై

ఏసు జననం అద్భుతమైతే, మరణానంతరం ఆయన పునరుత్థానం మహా అద్భుతం. ఈ రెండిటి మధ్యా ఆయన ఎన్నో అద్భుతాలు చేశాడు. వాటిలో వికలాంగునికి స్వస్థత కలిగించే ఘట్టం ఒకటి.

యెరూషలేం దేవాలయ ద్వారం దగ్గర ఒక కోనేరు ఉంది. దాని పేరు బెథెస్దా. అది ఎంత పెద్దదంటే... దానికి అయిదు మండపాలు ఉన్నాయి. బెథెస్దా (బెత్ హెస్ద) అంటే 'దయా నిలయం' అని అర్థం. కొన్ని సమయాల్లో ఒక దేవదూత ఆ కోనేటిలోకి దిగుతుందనీ, అందులోని నీటిని కదిలిస్తుందనీ, అప్పుడు ఆ నీటిలో మొదట దిగిన వ్యక్తికి ఉన్న వ్యాధులు, వైకల్యాలు తక్షణం మటుమాయం అవుతాయని నమ్మకం ఉండేది. అందుకే... ఆ కోనేరు దగ్గర మండపాల్లో అంధులు, వికలాంగులు... ఇంకా రకరకాల దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారూ గుంపులుగా నిరీక్షిస్తూ ఉండేవారు. వారిలో నడవలేని ఒక వ్యక్తి ఉన్నాడు. తను బాగుపడే అవకాశం దొరక్కపోతుందా? అని ముప్పై ఎనిమిది ఏళ్ళుగా అతను అక్కడే ఎదురుచూస్తున్నాడు. అతణ్ణి ఎవరూ పట్టించుకొనేవారు కారు.

ఒకసారి ఏసు ప్రభువు అక్కడికి వచ్చాడు. ఆ వికలాంగుణ్ణి చూశాడు. "నీకు స్వస్థత చేకూరాలని కోరుకుంటున్నావా?" అని అడిగాడు.

"అయ్యా! ఆ కోనేటిలోని నీటిని దేవదూత కదిలించగానే... అందులో దిగాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ ముందుగా వెళ్ళలేకపోతున్నాను. ఎప్పుడూ ఎవరో ఒకరు నాకన్నా ముందు దిగుతున్నారు. నాకు సాయపడేవాళ్ళు ఎవరూ లేరు. అందుకే ఇలా ఉండిపోయాను" అంటూ అతను మొరపెట్టుకున్నాడు.

తనకు మంచి జరుగుతుందనీ, దైవం తనను కరుణిస్తాడనీ అతనిలో ఉన్న నమ్మకాన్ని ఏసు గమనించాడు. "అయితే సరే! నువ్వు లేచి నిలబడు, నీ పరుపును తీసుకొని నడువు" అని చెప్పాడు.

మామూలుగా లేవడం కష్టమైన ఆ వ్యక్తి... ఏసు మాటలు వినగానే లేచాడు. ప్రభువు మాటే మంత్రమయింది. తక్షణమే అతనికి స్వస్థత లభించింది. తన పరుపు తీసుకొని... గబగబా నడిచాడు. అతని ఆనందానికి అవధులు లేవు. "ఇదంతా ప్రభువు చూపిన దయ" అని చుట్టుపక్కలవారికి చెబుతూ, ఏసుకు మొక్కుతూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఏసు క్రీస్తు చేసిన అద్భుతాల్లో మూడవదిగా బైబిల్‌లో దీని ప్రస్తావన ఉంది. కాగా... అది విశ్రాంతి దినం అనీ, ఆ రోజు ఎలాంటి మహిమలూ చేయకూడదనీ కొందరు మూఢులు ఏసును నిలదీశారు. "మానవతను విస్మరించిన ఆచారం మరొకటి లేదు" అంటూ వారి మాటలను ఏసు ఖండిం



చాడు. మంచి జరగాలనే ఆశ మనలో ఉన్నప్పుడు... ఏదో ఒక రూపంలో దైవం నుంచి సాయం అందుతుందనడానికి ఆ కథ ఒక ఉదాహరణ.

• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

జెన్ కథ

జ్ఞానోదయం

టిబెట్‌లో ఒక బౌద్ధ సన్యాసి ఉండేవాడు. అతను విపరీతమైన జ్ఞాన తృష్ణ కలిగినవాడు. ఎక్కడైనా జ్ఞాని ఉన్నాడని తెలిస్తే... ఆ ప్రదేశం ఎంత దూరంలో ఉన్నా... తక్షణం అతణ్ణి కలుసుకోవడానికి వెళ్ళేవాడు. ఆ జ్ఞాని బోధను వినాలని ఆత్రుతపడేవాడు. ఒక రోజు అలాంటి జ్ఞాని సమీప గ్రామానికి వచ్చాడని తెలిసింది. అది సూర్యాస్తమయ సమయం. తన వెంట ఏదైనా తీసుకువెళ్ళాలనే ఆలోచనైనా లేకుండా... ఆ సన్యాసి బయలుదేరాడు.

చాలాసేపు నడిచి, నడిచిన సన్యాసి అలసిపోయాడు. అతని గొంతు ఎండిపోతోంది. ఇంతలో చీకటి పడింది. ఆకాశంలో అక్కడక్కడ నక్షత్రాలు మెరుస్తున్నాయి. అది జన సంచారం లేని ప్రదేశం. ఏదీ తినకుండా, తాగకుండా నడుస్తూ ఉండడం వల్ల అతనికి శోష వచ్చినట్టయింది. చీకట్లో అటూ ఇటూ వెతికాడు. ఎక్కడా పండ్లు కానీ, నీరు కానీ, తనకు సాయం చేసేవారు కానీ కనిపించలేదు.

అతను నేల మీద మోకరిల్లి, ఆకాశం వైపు చూసి, చేతులు జోడించి... "భంతే! ఒంటరిగా ఉన్నాను. అలసిపోయాను. దాహంగా ఉంది. నీవే దిక్కు. నన్ను కాపాడు. లేకపోతే నేను మరణిస్తాను. సత్యాన్ని తెలుసుకోకుండానే కన్ను మూస్తే... నా జీవితం వ్యర్థమవుతుంది. కరుణించు. నన్ను కాపాడు" అని బుద్ధ భగవానుణ్ణి ప్రార్థించాడు.

అతను అటు ఇటూ కదులుతూ ఉంటే... చేతికి ఏదో తగిలింది. మూతపడుతున్న కళ్ళను శక్తికొద్దీ తెరచి చూశాడు. అది బంగారు పాత్రలా ఉంది. అందులో నీరు ఉంది. 'బుద్ధ భగవానుడు కరుణాసాగరుడు' అనుకుంటూ అందులోని నీటిని తాగేశాడు. దప్పిక తీరింది. తృప్తిగా, హాయిగా అక్కడే నిద్రపోయాడు.

మరుసటిరోజు సూర్యుడి వెచ్చటి కిరణాలు అతణ్ణి నిద్రలేపాయి. ముందురోజు జరిగింది గుర్తుకువచ్చింది. అతను లేచి, చుట్టూ చూశాడు. అక్కడ బంగారు పాత్రా లేదు, నీరూ లేదు. కొద్దిరోజుల కిందట మరణించిన మనిషి కపాలం ఉంది. బహుశా ఏదో క్రూరజంతువు దాడిలో మరణించిన మనిషిలా అనిపించింది. అక్కడక్కడ రక్తపు మరకలు ఉన్నాయి. కుళ్ళిన మాంసం ముక్కలు ఉన్నాయి. అవి కీటకాలతో నిండి ఉన్నాయి. తను రాత్రి తాగింది ఆ కపాలంలోని నీళ్ళనేనని అతనికి అర్థమయింది.

అతను ఆశ్చర్యానికి, ఆందోళనకు గురయ్యాడు. తనకు బాగా దాహంగా ఉండడం వల్ల, చీకటిలో ఉండడం వల్ల అదొక బంగారు పాత్రలా, అందులోని జలం మంచి నీళ్ళలా అనిపించి తాగేశాడు. పగటి వెలుగులో నిజం తెలుసుకున్న తర్వాత అతనికి కడుపులో వికారం మొదలైంది. వాంతి చేసుకున్నాడు. కాసేపు నిశ్చలంగా కూర్చున్నాడు. అతనిలో అనేక ఆలోచనలు కదలాడాయి. తనకు జ్ఞానోదయమైనట్టు, విశ్వరహస్యం తెలుసుకున్నట్టు అనుభూతికి లోనయ్యాడు.

జ్ఞానం తీవ్రమైనప్పుడు ఏదో ఒక విధంగా జ్ఞానజ్యోతి వెలుగుతుంది. అజ్ఞానంలో ఉన్నప్పుడు అందంగా, ఆకర్షణీయంగా, విలువైనదిగా కనిపించినవన్నీ జ్ఞానోదయం అయిన వెంటనే జుగుప్సాకరం, నిస్తేజం, నిర్జీవం, నిష్ప్రయోజనమైనవిగా గోచరిస్తాయి. అందుకే సాధారణ జనులు సంపదలను, పదవులను, బంధుత్వాలను అంటిపెట్టుకొని ఉంటే... జ్ఞానులు వాటన్నిటినీ తృణీకరిస్తారు. సత్యాన్ని, జ్ఞానాన్ని మాత్రమే అనుసరిస్తారు, అనుభవిస్తారు.

• రాచమడుగు శ్రీనివాసులు



'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/oeRMnGNలో చదవండి.

సరికొత్త శిఖరాలకు సూచీలు

23,000కు చేరువలో నిఫ్టీ ◆ మళ్లీ 75,000 ఎగువన సెన్సెక్స్ ◆ మార్కెట్లకు ఆర్‌బీఐ డివిడెండ్ జోష్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. గత ఆర్థిక సంవత్సరానికిగాను ఆర్‌బీఐ కేంద్ర ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో డివిడెండ్ ప్రకటించడం మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం పెంచింది. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో షేర్లలో మదుపరులు భారీగా కొనుగోళ్లు జరిపారు. దాంతో సెన్సెక్స్ 1,196.98 పాయింట్ల లాభంతో 75,418.04 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఈ జనవరి 29 తర్వాత ఒక రోజులో సూచీకిది అతిపెద్ద లాభం. అంతేకాదు, ఒకదశలో సెన్సెక్స్ 1,278.85 పాయింట్ల వరకు ఎగబాకి 75,499.91 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డునూ నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే ఒకదశలో 395.8 పాయింట్లు పెరిగి 22,993.60 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని, చివరికి 369.85 పాయింట్ల లాభంతో 22,967.65 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును నమోదు చేసింది. కొనుగోళ్ల జోరుతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.28 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.420.22 లక్షల కోట్లకు (5.05 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. అలాగే, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటైజేషన్ తొలిసారిగా 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.416.57 లక్షల కోట్లు) మైలురాయిని దాటింది.

30లో 27 లాభపడ్డాయ్.. : సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 27 లాభపడ్డాయి. ఎల్ అండ్ టీ షేరు 3.64 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎం అండ్ ఎం, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకీ షేర్లు సైతం మూడు శాతానికి పైగా పెరిగాయి.



అదానీ షేర్లు జిగేల్

వరుసగా రెండో రోజూ అదానీ గ్రూప్ షేర్లు ర్యాలీ తీశాయి. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఏకంగా 8 శాతం పుంజుకుంది. ఈ కంపెనీని సెన్సెక్స్‌లో చేర్చవచ్చన్న అంచనాలు ఇందుకు దోహదపడ్డాయి. కాగా, ఎన్‌డీటీవీ 7.56 శాతం, అదానీ పోర్ట్స్ 4.72 శాతం, ఏసీసీ 2.86 శాతం, అదానీ పవర్ 2.79 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 2.30 శాతం, అంబుజా సిమెంట్స్ 2.09 శాతం, అదానీ విల్మర్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. దాంతో గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17.23 లక్షల కోట్లకు చేరుకుంది. బుధవారం గ్రూప్ మార్కెట్ క్యాప్ 20,000 కోట్ల డాలర్ల (రూ.16.9 లక్షల కోట్లు) మైలురాయిని దాటింది.

సెన్సెక్స్‌లోకి అదానీ ఎంటర్‌ప్రైజెస్

తొలిసారిగా అదానీ గ్రూప్ కంపెనీ సెన్సెక్స్‌లో చోటు దక్కించుకోబోతోంది. సెన్సెక్స్ జాబితా నుంచి విప్రోను తొలగించి, దాని స్థానంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ను చేర్చే అవకాశం ఉంది. శుక్రవారం నిర్వహించనున్న అర్ధ వార్షిక సమీక్షలో బీఎస్ఈ ఈ విషయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. జూన్ 21న సెన్సెక్స్ కంపెనీల సర్దుబాటు అమలులోకి రానుంది.

గో డిజిట్ షేరు తొలిరోజు వృద్ధి 12 శాతం

గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ గురువారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ చేసింది. ఐపీఓ ధర రూ.272తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 3.34 శాతం ప్రీమియంతో రూ.281.10 వద్ద లిస్టయింది. ఒకదశలో 15.44 శాతం వరకు పెరిగి రూ.314 స్థాయికి చేరిన షేరు ధర చివరికి 12.40 శాతం లాభంతో రూ.305.75 వద్ద ముగిసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.28,043.46 కోట్లుగా నమోదైంది.

భారీగా తగ్గిన బంగారం, వెండి

దేశీయంగా బంగారం ధరలు వరుసగా రెండో రోజూ తగ్గుముఖం పట్టాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం రూ.1,050 తగ్గి రూ.73,550 వద్దకు దిగివచ్చింది. కిలో వెండి సైతం రూ.2,500 తగ్గుదలతో రూ.92,600కు పరిమితమైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు తగ్గడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ సెంటర్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం మళ్లీ 2,400 డాలర్ల దిగువకు పడిపోయింది. ఒకదశలో రేటు 42 డాలర్లు తగ్గి 2,375 డాలర్ల వద్ద ట్రేడైంది. వెండి సైతం 30.80 డాలర్లకు దిగివచ్చింది.

స్టెరిలైట్ వ్యాపార విభజనకు ఆమోదం

విద్యుత్ సరఫరా వ్యాపారాన్ని విభజించేందుకు తమ వాటాదారులు ఆమోదం తెలిపారని స్టెరిలైట్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ (ఎస్‌టీపీఎల్) వెల్లడించింది. విభజించిన ట్రాన్స్‌మిషన్ వ్యాపారాన్ని స్టెరిలైట్ గ్రిడ్ 5 లిమిటెడ్‌లో చేర్చనున్నారు. గ్లోబల్ ప్రాడక్ట్స్, ఈపీసీ సేవల విభాగాలు మాత్రం ఎస్‌టీపీఎల్ పరిధిలో కొనసాగనున్నాయి.

ఇండిగో లాభాలు రెట్టింపు



న్యూఢిల్లీ: ఇండిగో కంపెనీ 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.17,825.3 కోట్ల ఆదాయంపై రూ.1,894.8 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 26 శాతం మాత్రమే పెరిగినా, నికర లాభం మాత్రం మాత్రం రెండు రెట్లకుపైగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.71,200 కోట్ల ఆదాయంపై రూ.8,172.5 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం అన్ని త్రైమాసికాల్లోనూ లాభాలు నమోదు చేసినట్టు కంపెనీ సీఈఓ పీటర్ ఎల్బర్స్ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రద్దీగా ఉండే మార్గాల్లో బిజినెస్ క్లాస్ ప్రవేశపెట్టబోతున్నట్టు కంపెనీ తెలిపారు.

అజాద్ ఇంజనీరింగ్‌కు జీటీఆర్ఈ కాంట్రాక్టు

హైదరాబాద్: ప్రెసిషన్ ఇంజనీరింగ్, తయారీలో అగ్రగామి అయిన అజాద్ ఇంజనీరింగ్‌కు డీఆర్‌డీఓ అనుబంధ సంస్థ జీటీఆర్ఈ (గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్) నుంచి ప్రతిష్ఠాత్మకమైన కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు కింద అజాద్ ఇంజనీరింగ్ రక్షణ అప్లికేషన్లలో ఉపయోగించేందుకు వీలైన ఆధునిక గ్యాస్ టర్బైన్ ఇంజన్ తయారుచేయవలసి ఉంటుంది. తొలి బ్యాచ్ ఇంటిగ్రేటెడ్ ఇంజన్లను 2026 ప్రారంభంలో డెలివరీ చేయాల్సి ఉంటుంది.

నవనామి నుంచి 'మెగాలీవో' ప్రాజెక్టు

ఫ్లాటు ధర రూ8-12 కోట్లు

హైదరాబాద్: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నవనామి ప్రాజెక్ట్స్ హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపట్టింది. అప్పా జంక్షన్ వద్ద 'మెగాలీవో' పేరుతో చేపట్టిన ఈ లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు కోసం కంపెనీ రూ.800 కోట్ల నుంచి రూ.900 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో రూ.250 కోట్లు బ్యాంకుల నుంచి రుణంగా, మిగతా మొత్తాన్ని అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంటామని కంపెనీ ఎండీ నవీన్ గద్దె చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 4.1 ఎకరాల్లో 50 అంతస్తుల్లో 150 ఫ్లాట్లతో రెండు టవర్లు నిర్మిస్తామన్నారు. ఒక్కో ఫ్లాటు విస్తీర్ణం 8,888 ఎస్ఎఫ్‌టీ, 9,999 ఎస్ఎఫ్‌టీ, 11,111 ఎస్ఎఫ్‌టీ మధ్య ఉంటాయన్నారు. విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో ఫ్లాటు ధర కనిష్ఠంగా రూ.8 కోట్లు, గరిష్ఠంగా రూ.12 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాలకు 15 నుంచి 20 నిమిషాల డ్రైవింగ్‌తో చేరుకునే 'మెగాలీవో' ప్రాజెక్టు నిర్మాణం నాలుగేళ్లలో పూర్తవుతుందని నవీన్ గద్దె చెప్పారు.

స్వల్పంగా తగ్గిన ఐటీసీ లాభం

ITC Limited

ఒక్కో షేరుపై రూ.7.5 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీసీ నికర లాభం మార్చి త్రైమాసికంలో స్వల్పంగా తగ్గింది. ఈ కాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.19,446.49 కోట్ల ఆదాయంపై రూ.5,190.71 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం రెండు శాతం పెరిగినా నికర లాభం రూ.5,242.59 కోట్ల నుంచి 1.3 శాతం తగ్గి రూ.5,190.71 కోట్లకు చేరింది. ఖర్చులు మూడు శాతం పెరగడం ఇందుకు కారణం. స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన క్యూ 4లో ఐటీసీ ఆదాయం ఆరు శాతం పెరిగి రూ.6,534 కోట్లకు చేరింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ రూ.69,446 కోట్ల ఆదాయంపై రూ.20,422 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 6.8 శాతం, నికర లాభం 8.9 శాతం పెరిగాయి.

రూ.7.5 చొప్పున తుది డివిడెండ్: క్యూ4లో నికర లాభం స్వల్పంగా తగ్గినా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.7.5 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని ఐటీసీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన రూ.6.25 మధ్యంతర డివిడెండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే, గత ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.13.75 చొప్పున డివిడెండ్‌గా చెల్లించినట్టవుతుంది.

మార్కెట్లో ఐక్యూ జడ్9ఎక్స్ స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మార్కెట్లో ఐక్యూ జడ్9ఎక్స్ స్మార్ట్‌ఫోన్లను గురువారం విడుదల చేశారు. అత్యుత్తమ ఫీచర్లతో వచ్చిన ఈ స్మార్ట్‌ఫోన్ల ధర వేరియెంట్‌ను బట్టి రూ.11,999 నుంచి రూ.15,999 మధ్యన ఉంది. 7.99 ఎంఎం మందంతో అతి సన్నగా కనిపించే ఈ హ్యాండ్‌సెట్లకు 6000ఎంఏహెచ్ బ్యాటరీ అమర్చారు. ఎంటర్‌టైన్‌మెంట్, అడ్వెంచర్ ఔత్సాహికులకు ఇది చక్కని స్మార్ట్‌ఫోన్ అని ఐక్యూ సీఈఓ నిపుణ్ మార్యా అన్నారు. అమెజాన్‌లోని ఐక్యూ ఇ-స్టోర్‌లో ఈ హ్యాండ్‌సెట్లు రెండు కలర్ వేరియెంట్లలో అందుబాటులో ఉంటాయి.

తాజ్‌జీవీకే లాభం రూ.26 కోట్లు

హైదరాబాద్: తాజ్ జీవీకే హోటల్స్ మార్చి త్రైమాసికంలో స్టాండ్ అలోన్ ప్రాతిపదికన రూ.116 కోట్ల ఆదాయంపై రూ.26 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.106 కోట్ల ఆదాయంపై రూ.14 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా తాజ్ జీవీకే హోటల్స్ రూ.410 కోట్ల ఆదాయంపై రూ.74 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

జీఓసీఎల్ లాభం రూ.5 కోట్లు

హైదరాబాద్: నాలుగో త్రైమాసికంలో జీఓసీఎల్ కార్పొరేషన్ రూ.237 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.5 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ రూ.949 కోట్ల ఆదాయంపై రూ.48 కోట్ల నికర లాభం ఆర్జించింది. అసాధారణ మార్కెట్ ఆటుపోట్లు, ప్రధాన ముడి పదార్థాల ధరలు పెరిగి పోవడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నా వాటిని తట్టుకుని లాభాలు నమోదు చేసినట్టు కంపెనీ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,420 ▼	67,300 ▼	97,000 ▼
ముంబై	72,830 ▼	66,710 ▼	90,055 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	149
వరంగల్	140	విజయవాడ	149
కరీంనగర్	140	గుంటూరు	149
మహబూబ్‌నగర్	142	ఒంగోలు	149
కర్నూలు	142	చిత్తూరు	163
విశాఖపట్నం	141		

స్పోర్ట్స్



ప్రీతిస్మిత వరల్డ్ రికార్డు

స్వర్ణంతో మెరిసిన భారత లిఫ్టర్

లిమా (పెరూ): భారత వెయిట్ లిఫ్టర్ ప్రీతిస్మిత భోయ్ వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్‌లో అదరగొట్టింది. గురువారం జరిగిన మహిళల 40 కిలోల విభాగంలో 15 ఏళ్ల ప్రీతిస్మిత క్లీన్ అండ్ జెర్క్‌లో ప్రపంచ రికార్డు తిరగరాసింది. 75 కిలోల గత ప్రపంచ రికార్డును ఆమె 76 కిలోలు ఎత్తడం ద్వారా అధిగమించింది. స్నాచ్‌లో 57 కేజీలు ఎత్తిన ఆమె..టోటల్‌గా 133 కేజీల బరువెత్తి స్వర్ణ పతకం కొల్లగొట్టింది. భారత్‌కు చెందిన జోష్న సబర్ (56+69=125కి.) రజతం, టర్కీ లిఫ్టర్ ఫత్మా (55+65=120కి.) కాంస్యపతకం నెగ్గారు. మహిళల 45 కి.లలో పాయల్ రజతం, పురుషుల 49 కి.లలో బాబూలాల్ కాంస్య పతకం గెలిచారు.

భారత్-పాక్ పోరు..

టిక్కెట్ @ రూ. 16.50 లక్షలా?



న్యూఢిల్లీ: భారత-పాకిస్థాన్ జట్ల మధ్య పోరు..అందునా వరల్డ్ కప్..అదీ టీ20 ప్రపంచ కప్..ఇంకేం ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ టిక్కెట్లకు ఉన్న డిమాండ్ అంతా ఇంతాకాదు. సరిగ్గా ఈ డిమాండ్‌నే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) భారీగా క్యాష్ చేసుకుంటోందట! జూన్ తొమ్మిదిన న్యూయార్క్‌లోని నసౌ స్టేడియంలో జరిగే ఈ మెగా పోరు ఒక్కో టిక్కెట్‌ను ఐసీసీ ఏకంగా రూ. 16.50 లక్షలకుపైగానే అమ్ముతోందని ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ ఆరోపించాడు. స్టేడియంలోని డైమండ్ క్లబ్ సెక్షన్‌లో సీట్ టిక్కెట్‌కు ఈ రేటు నిర్ణయించడాన్ని అతడు ఆక్షేపించాడు. 'క్రికెట్‌ను మరింత విస్తరించే లక్ష్యంతో అమెరికాలో ప్రపంచ కప్‌ను నిర్వహిస్తున్నారు. కానీ ఐసీసీ మాత్రం కలెక్షన్లకు ఈ టోర్నీని ఉపయోగించుకుంటోంది. ఇతర టిక్కెట్లను కూడా రూ. 2.30 లక్షలకు తక్కువ కాకుండా అమ్మడం లేదు' అని అన్నాడు.

అథ్లెట్లూ మనుషులే: బింద్రా

న్యూఢిల్లీ: అథ్లెట్లూ మనుషులేనని, పతకాలు గెలవాలంటూ వారిపై ఒత్తిడి తేవొద్దని ఒలింపిక్ స్వర్ణ పతక షూటర్ అభినవ్ బింద్రా సూచించాడు. అథ్లెట్లు పతకాలు తెచ్చే రోబోలు కారని, వారితోపాటు కోచ్‌లు, క్రీడా సైకాలజిస్టులు కూడా మానసికంగా ఆరోగ్యంగా ఉండడం ఎంతో ముఖ్యమని చెప్పుకొచ్చాడు.

ఇద్దరికీ ఇదే

నేడు ఐపీఎల్ క్వాలిఫయర్ 2

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో

లాస్ట్ చాన్స్

గెలిచిన జట్టు ఫైనల్‌కు

రాజస్థాన్ × సన్‌రైజర్స్ మధ్య పోరు

చెన్నై: ఐపీఎల్ ఫైనల్‌కు ముందు చిట్టచివరి ప్లేఆఫ్స్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. అద్భుత హిట్టింగ్‌తో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లకు.. తమ సుడులు తిరిగే బంతులు, పదునైన పేస్‌తో ఉచ్చులో బిగిస్తున్న రాజస్థాన్ రాయల్స్ బౌలర్ల మధ్య ఆసక్తికర పోరు జరుగనుంది. గెలిచిన జట్టు కోల్‌కతాతో ఆదివారం ఫైనల్లో పోటీ పడుతుంది. చెపాక్ స్టేడియం వేదికగా శుక్రవారం క్వాలిఫయర్ 2లో ఇరు జట్లు తలపడబోతున్నాయి. అయితే వరుస విజయాలతో జోరు మీదున్న రైజర్స్‌కు కోల్‌కతాతో క్వాలిఫయర్ 1లో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పుడు ఆ ఓటమిని మరిపిస్తూ ఈ కీలక పోరులో కచ్చితంగా గెలవాల్సిందే. లేనిపక్షంలో లీగ్‌లో ఇప్పటిదాకా రికార్డులను తిరగరాసిన తమ ఆటతీరుకు ఫలితం దక్కకుండా పోతుంది. ఇక రాజస్థాన్ ఆరంభ తొమ్మిది మ్యాచ్‌ల్లోనే 16 పాయింట్లు సాధించినప్పటికీ.. ఆ తర్వాత దాదాపు 25 రోజుల పాటు మరో విజయమే లభించలేదు. కానీ ఎలిమినేటర్‌లో చక్కటి ప్రదర్శనతో బెంగళూరును ఇంటిముఖం పట్టించింది. ఇప్పుడు మరో గెలుపుతో ఫైనల్‌కు అర్హత సాధించి గత ఓటములను మర్చిపోవాలనుకుంటోంది. ఇరు జట్ల మధ్య జరిగిన ఏకైక లీగ్ మ్యాచ్‌లో రైజర్స్ ఆఖరి బంతికి పరుగు తేడాతో నెగ్గింది. మరోవైపు చెన్నై వేదికలో ఈ రెండు జట్లకు మెరుగైన రికార్డు లేదు. సీఎస్‌కేపై రైజర్స్ 134, రాజస్థాన్ 141 పరుగులే చేసి ఓటమిపాలయ్యాయి.

పిచ్, వాతావరణం

శుక్రవారం వర్షం నుంచి ఎలాంటి అంతరాయం లేదు. వేడితో పాటు తేమ ఎక్కువగా ఉండనుంది. రాత్రి మంచు ప్రభావం ఉంటుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపుతుంది. ఈ సీజన్‌లో జరిగిన ఏడు మ్యాచ్‌ల్లో ఐదుసార్లు చేజింగ్ టీమ్ గెలిచింది.



కెప్టెన్లు ప్యాట్ కమిన్స్ సంజూ శాంసన్

'ట్రావిషేక్' శుభారంభమే కీలకం

సన్‌రైజర్స్ జోరుకు ఆ జట్టు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మల మెరుపు ఆటతీరే కారణం. పవర్ హిట్టింగ్‌ను ఈ ఇద్దరూ మరో స్థాయికి తీసుకెళ్లారు. హెడ్ 199.62 స్ట్రయిక్ రేట్‌తో, అభిషేక్ 207.40 స్ట్రయిక్ రేట్‌తో బెంబేలెత్తిస్తూ పవర్‌ప్లేలోనే రెండుసార్లు వంద పరుగులను దాటించారు. జట్టు బాదిన 166 సిక్సర్లలో వీరిద్దరివే 72 ఉండడం విశేషం. వీరి మెరుపు ఆరంభాలు మిడిలార్డర్‌పై ఒత్తిడి పడకుండా కాపాడుతున్నాయి. కానీ చివరి మ్యాచ్‌లో కోల్‌కతాపై ఇద్దరూ విఫలం కావడంతో జట్టు చిత్తుగా ఓడాల్సి వచ్చింది. అందుకే బ్యాటింగ్‌ను మరింత పటిష్టపర్చేందుకు మార్‌క్రమ్, ఫిలిప్స్‌లలో ఒకరిని తీసుకోవాల్సి ఉంటుంది. మిడిలార్డర్‌లో త్రిపాఠి, క్లాసెన్ వేగంగా ఆడుతున్నారు. నితీశ్ కుమార్ రాజస్థాన్‌పై 42 బంతుల్లోనే 76 పరుగులతో ఆకట్టుకున్నాడు. అదే ఫామ్‌ను ఈ మ్యాచ్‌లోనూ చూపాల్సి ఉంది. కెప్టెన్ కమిన్స్ ఫినిషర్ పాత్ర పోషిస్తున్నాడు. బౌలింగ్‌లో పేసర్లు కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్ కీలకం కానున్నారు. స్పిన్నర్‌గా మార్కండేను ఆడించే అవకాశం ఉంది.

బౌలింగే బలంగా..

సన్‌రైజర్స్‌తో పోలిస్తే రాజస్థాన్ బ్యాటర్లు విధ్వంసకరంగా కనిపించకపోయినా.. వీరి విజయాల్లో బౌలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆరంభంలో లెఫ్టామ్ పేసర్ బౌల్ట్ వికెట్లను తీస్తుండగా.. వరల్డ్ క్లాస్ స్పిన్నర్లు చాహల్, అశ్విన్‌లతో మధ్య ఓవర్లలో ప్రత్యర్థి జట్లను నిలువరిస్తున్నారు. ఇక డెత్ ఓవర్లలో అవేశ్ ఖాన్, సందీప్ శర్మ పరుగులను కట్టడి చేయగలుగుతుండడం ఆర్ఆర్‌కు కలిసివచ్చే విషయం. బ్యాటింగ్‌లో జైస్వాల్, కెప్టెన్ శాంసన్‌లపై భారం పడుతోంది. అయితే ఉప్పల్‌లో రైజర్స్‌పై 202 పరుగుల ఛేదనలో ఆఖరి బంతికి రెండు పరుగులు చేయలేక ఓడింది. గెలుపు ముంగిట బోల్తా పడిన ఆ మ్యాచ్‌కు బదులు తీర్చుకోవాలనుకుంటోంది. చెపాక్ స్లో పిచ్‌పై మూడో స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్‌ను కూడా బరిలోకి దిగే అవకాశముంది. అయితే అప్పుడు ఇద్దరు పేసర్లతోనే ఆడాల్సి ఉంటుంది.

తుది జట్లు (అంచనా)

రాజస్థాన్ రాయల్స్: జైస్వాల్, క్యాడ్‌మోర్, శాంసన్, పరాగ్, జురెల్, పోవెల్/కేశవ్ మహరాజ్, అశ్విన్, బౌల్ట్, అవేశ్ ఖాన్, సందీప్, చాహల్.

సన్‌రైజర్స్ హైదరాబాద్: హెడ్, అభిషేక్, రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్, క్లాసెన్, సమద్, షాబాజ్ అహ్మద్, కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్, నటరాజన్, మార్కండే.

వర్షంతో రద్దయితే..

రానున్న రోజుల్లో తమిళనాడులో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే మ్యాచ్ రోజు శుక్రవారం మాత్రం ఆకాశం మేఘావృతంగా కనిపించినా వాన కురిసే చాన్స్ 2 శాతం మాత్రమే ఉంది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ వీలు కాకపోతే రిజర్వ్‌డే ఉంటుంది. ఒకవేళ శనివారం కూడా మ్యాచ్ రద్దయితే పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన సన్‌రైజర్స్ జట్టు ఫైనల్‌కు వెళుతుంది.

క్వార్టర్స్‌లో సింధు, అస్మిత



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు కష్టంగా ముందంజ వేయగా.. మూడో సీడ్ బీవెన్ జాంగ్‌పై అస్మిత సంచలన విజయం నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో సింధు 21-13, 12-21, 21-14తో సిమ్ యు జిన్ (కొరియా)పై చెమటోడ్చి నెగ్గింది. శుక్రవారం జరిగే క్వార్టర్స్ పోరులో టాప్ సీడ్ హన్ యు (చైనా)తో సింధు అమీతుమీ తేల్చుకోనుంది. కాగా, అస్మిత 21-19, 16-21, 21-12తో బీవెన్ జాంగ్ (అమెరికా)పై పోరాడి గెలిచింది. ఈ క్రమంలో భారత్ నుంచి సింధు, సైనా తర్వాత ఈ టోర్నీలో క్వార్టర్స్ చేరిన మూడో మహిళా ప్లేయర్‌గా అస్మిత రికార్డులకెక్కింది. పురుషుల ప్రీక్వార్టర్స్‌లో కిరణ్ జార్జ్ 13-21, 18-21తో లీ జి జియా చేతిలో ఓడాడు. డబుల్స్‌లో గాయత్రి పుల్లెల-ట్రీసా జాలీ జంట 18-21, 22-20, 14-21తో చైనీస్ తైపీకి చెందిన సంగ్ షు ఇన్-యు చీన్ హుయ్ చేతిలో, సిమ్రన్ సింగ్-రితిక ఠాకర్ 17-21, 11-21తో మలేసియా జంట పియర్లీ టాన్-మురళీధరన్ చేతిలో, కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్ జోడీ 11-21, 9-21తో చైనా ద్వయం హి జి టింగ్-రెన్ జియాంగ్ యు చేతిలో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్‌లో సిక్కిరెడ్డి-సుమీత్ జంట 9-21, 15-21తో మలేసియా జోడీ చెన్ టాంగ్ జి- తి యి వి చేతిలో చిత్తయ్యింది.

జ్యోతి సురేఖ పరాజయం

ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2

యెచియాన్ (కొరియా): ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2లో కాంపౌండ్ ఆర్చర్ జ్యోతి సురేఖకు షాక్ తగిలింది. వరల్డ్ కప్ స్టేజ్-1లో హ్యాట్రిక్ స్వర్ణాలు సాధించిన సురేఖ.. గురువారం జరిగిన కాంపౌండ్ మహిళల వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్‌లో సారా లోపెజ్ (కొలంబియా) చేతిలో 142-145తో ఓడింది. పురుషుల విభాగంలో ప్రథమేష్ 146-145తో మాజీ వరల్డ్ చాంపియన్ నికో వీనర్ (ఆస్ట్రియా)పై గెలిచి సెమీస్‌కు చేరుకొన్నాడు. కాగా, రికర్వ్ విభాగంలో పురుషులు, మహిళల జట్లు తీవ్రంగా నిరాశపర్చాయి. రెండో రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్, మృణాల్ చౌహాన్‌లతో కూడిన భారత జట్టు 3-5తో కెనడా చేతిలో పరాజయం పాలైంది. దీపిక కుమారి, అంకిత భక్త్, భజన్ కౌర్‌లతో కూడిన మహిళల టీమ్ రెండో రౌండ్‌లో 4-5తో వియత్నాం చేతిలో ఓడింది.

ఇకనైనా.. ఆర్సీబీని వదిలెయ్!

కోహ్లీకి కేపీ సూచన



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆవిర్భావం నుంచి ప్రయత్నిస్తున్నా విరాట్ కోహ్లీకి ట్రోఫీ అందని ద్రాక్షగానే మిగిలింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ క్రికెటర్, ఐపీఎల్ కామెంటేటర్ కెవిన్ పీటర్సన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ఈ మాట నేను గతంలో చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నా. కోహ్లీ 17 సంవత్సరాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ టైటిల్ అందుకోలేకపోయాడు. అయిందేదో అయిపోయింది. విరాట్ ఇప్పటికైనా ఆర్సీబీని వీడి వేరే జట్టుకు వెళితే తన ఐపీఎల్ కప్పు కలను అతడు నిజం చేసుకోగలడు' అని పీటర్సన్ కుండబద్దలుగొట్టాడు. అంతేకాదు..కోహ్లీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడడం ఉత్తమమని సూచించాడు. అందుకు రెండు కారణాలను అతడు చెప్పాడు. 'ఒకటి..ఢిల్లీ విరాట్‌కు సొంత ప్రదేశం. రెండు...ఐపీఎల్ టైటిల్ కోసం ఢిల్లీ జట్టు ఆకలిగొన్న పులిలా ఉండడం' అని కేపీ వివరించాడు.

అర్థమైందా..అతి చేయొద్దని..: చెన్నైతో ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధించాక బెంగళూరు ఫ్యాన్స్ చేసిన అతిని టీమిండియా మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తప్పుపట్టాడు. 'అతి సంబరాల వీడియోలను, ఫొటోలను బెంగళూరు ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయకుండా ఉండాల్సింది. అలా అతి చేసిన వారికి స్పిన్నర్ అశ్విన్ తన బౌలింగ్‌తో బుద్ధి చెప్పాడు. అందువల్ల క్రికెట్‌లో ఒళ్లు దగ్గర పెట్టుకొని ఆడాలి' అని పరోక్షంగా బెంగళూరు జట్టుకు చురకలు అంటించాడు. ఇక కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో డకౌటైన ఆర్సీబీ ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్‌పై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ సెటైర్లు వేశాడు. భారీగా బ్యాంక్ బ్యాలెన్స్ ఉండడం, క్రమం తప్పకుండా చెక్కులు (ఐపీఎల్ జీతం) రావడంతో అతడిలో ఉదాసీనత పెరిగిపోయిందని అన్నాడు.

పిన్నెల్లిపై ఈసీ సీరియస్‌గా ఉంది

- నిర్లక్ష్యంగా ఉన్న పీవో, ఏపీవోల సస్పెన్షన్‌కు ఆదేశించాం
- ఎన్నికల ప్రధానాధికారి మీనా వెల్లడి
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం ధ్వంసం కేసులో మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం చాలా సీరియస్‌గా ఉందని, త్వరలోనే అరెస్టు చేసి తీరుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. గురువారం మీడియాతో దీనిపై ఆయన మాట్లాడారు. మాచర్లలోని పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో సరైన సమాచారం ఇవ్వని పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశించామని చెప్పారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసేందుకు హైదరాబాద్‌లో అదనపు ఎస్పీ, డీఎస్పీ, నలుగురు సీఐలతో కూడిన ఎనిమిది బృందాలు పని చేస్తున్నాయన్నారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తలను పరామర్శించేందుకు టీడీపీ నేతలు వెళ్లడం ఇప్పుడు మంచిది కాదని సూచించారు. ఇప్పుడిప్పుడే అక్కడి పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయని వివరించారు. టీడీపీ నేతలు వెళితే పరిస్థితులు మళ్లీ అదుపు తప్పే అవకాశం ఉందన్నారు.

రేపటి నుంచి స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన

ఈ నెల 25వ తేదీ నుంచి నియోజకవర్గాల్లో స్ట్రాంగ్ రూంల పరిశీలన జరపనున్నట్టు మీనా తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల లెక్కింపునకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని, కచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు ప్రణాళికా బద్ధంగా చేసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు.

ఆ వీడియో ఆధారంతో చర్యలా?: సజ్జల

మాచర్ల జిల్లా పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేశారంటూ సామాజిక మధ్యమంలో వచ్చిన వీడియో నిజమైందో కాదో నిర్ధారించుకోకుండానే చర్యలకు ఎలా దిగుతారని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఒకవేళ ఆ వీడియో నిజమైనదే అయితే.. అది సోషల్ మీడియాలోకి ఎలా వచ్చిందని గురువారం ఆయన ట్వీట్ చేశారు.

సత్తెనపల్లిలో 500 మంది బైండోవర్

సత్తెనపల్లి, మే 23: పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ సర్కిల్ పరిధిలో 500 మందిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి. రాజుపాలెం, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి రూరల్ మండలాల పరిధిలో ఈ కేసులు పెట్టినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు గురువారం విలేకరులకు తెలిపారు. వీరిలో కొంత మంది ఎన్నికలకు సంబంధించిన కేసుల్లో కూడా ఉన్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గురజాల నియోజకవర్గంలో 84 మందికి రిమాండ్

నరసరావుపేట లీగల్, మే 23: పోలింగ్ సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి గురువారం 84 మంది నిందితులకు స్థానిక ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రిమాండ్ విధించింది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో 33 మంది, పిడుగురాళ్లలో 50 మంది, నరసరావుపేటలో ఒక్కరిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని గురువారం గురజాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ ఎదుట హాజరుపరచగా.. ఆయన వారికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



పిన్నెల్లి ఎక్కడ?

రెండోరోజూ పోలీసుల వేట.. దొరకని పిన్నెల్లి ఆచూకీ..

ఈవీఎం ధ్వంసం వ్యవహారంలో పోలింగ్ కేంద్రం పీవో, ఏపీవోలు సస్పెండ్

జాయింట్ కలెక్టరు తీరుపైనా సందేహాలు

నరసరావుపేట, మే 23 : పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్లను ధ్వంసం చేసి అరాచకం సృష్టించిన మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంకా పరారీలోనే ఉన్నారు. ఆయన పట్టుకునేందుకు వరుసగా రెండోరోజు కూడా పోలీసుల వేట కొనసాగింది. ఒక దశలో పిన్నెల్లి పల్నాడు జిల్లా నరసరావుపేట కోర్టులో లొంగిపోతారని సోషల్ మీడియా ప్రచారం జరిగింది. దీంతో కోర్టు వద్ద పోలీసులు మోహరించారు. అయినా, పిన్నెల్లి ఆచూకీ పోలీసులకు లభించలేదు. ఆయనను అరెస్టు చేశారని వచ్చిన వార్తలను పోలీసులు ఖండించారు. పిన్నెల్లి భారీ హింసను పాల్పడిన పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించిన పీవో, ఏపీవోలను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. మరోవైపు పిన్నెల్లి సహా ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులందరిపైనా వచ్చే నెల ఆరో తేదీ వరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఏపీ హైకోర్టు గురువారం రాత్రి ఆదేశాలు జారీచేసింది. ఈ నెల 13న పోలింగ్ రోజున మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి చెలరేగిపోయారు. అక్కడ టీడీపీకే ఎక్కువ ఓట్లు పోలవుతున్నాయని.. తనకు ఓట్లు వేయడం లేదన్న అక్కసుతో బరితెగించారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించి.. ఈవీఎంను ఎత్తి నేలకేసికొట్టారు. 14వ తేదీన మాచర్లలోని తన ఇంటి నుంచి పరారయ్యారు. ఆ సమయంలో హౌస్ అరెస్టులో ఉన్న ఆయన తప్పించుకునేందుకు పోలీసులు సహకరించారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈవీఎంను పగలగొట్టిన వ్యవహారాన్ని ఈసీ సీరియస్‌గా తీసుకుని ఆయన అరెస్టునకు ఆదేశించింది. దీంతో పోలీసులకు దొరక్కుండా హైదరాబాద్, ఆ చుట్టుపక్కల జిల్లాల్లో పిన్నెల్లి సోదరులు షెల్టర్ తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు సోదరులిద్దరూ విదేశాలకు వెళ్లిపోయారనే వార్తలు వినవస్తున్నాయి. వారిద్దరూ తమిళనాడులో తల దాచుకుంటున్నారనే వదంతులూ వ్యాపించాయి. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నాయకత్వంలోని ఎనిమిది బృందాలు.. పిన్నెల్లి సోదరుల కోసం గాలిస్తున్నాయి. కాగా, ఈవీఎంల ధ్వంసం, పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు సృష్టించిన వారిపై చర్యల కోసం సీసీటీవీ ఫుటేజీని పోలింగ్ జరిగిన మర్నాడే పోలీసులకు అందజేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించడం సంచలనం కలిగించింది. సీసీటీవీ ఫుటేజీ బయటకు వచ్చింది కాబట్టి కేంద్ర ఎన్నికల సంఘం హుటాహుటిన స్పందించి.. ఎమ్మెల్యే పేరును నిందితుల జాబితాలో చేర్చేలా చేయగలిగింది. లేదంటే నిజాన్ని సమాధి చేసేవారని, ఎమ్మెల్యే పారిపోవాల్సిన అవసరం కూడా ఉండేది కాదన్న విమర్శలొస్తున్నాయి. కాగా, గురువారం పీవో, ఏపీవోలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈవీఎం ధ్వంసం సమయంలో పోలింగ్ కేంద్రంలో ఉన్న పీవో తన డైరీలో జరిగిన ఘటన నమోదు చేసినప్పటికీ, పిన్నెల్లి పేరు నమోదు చేయలేదని చెబుతున్నారు. ఆర్వో (జేసీ) శ్యామ్‌ప్రసాద్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఈవీఎంలను పునరుద్ధరించారు. అయితే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన అంశాన్ని తన నివేదికలో పేర్కొనలేదని సమాచారం.

గిరిజనులనూ వదల్లేదు

- పోలింగ్ కేంద్రం నుంచి టీడీపీ ఏజెంట్ల తరిమివేత
- తప్పించుకొని పారిపోతున్న రేఖ్యానాయక్‌పై దాడి
- పిన్నెల్లి హింసాపర్వాన్ని పట్టించిన మరో వీడియో..

మాచర్ల రూరల్, మే 23: పోలింగ్ రోజు మాచర్ల వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అకృత్యాలు ఒక్కొక్కటి ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. పిన్నెల్లి హింసాపర్వాన్ని పట్టించే మరో వీడియో తాజాగా వైరల్ అయింది. మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో 118, 119, 120 పోలింగ్ బూత్‌లలో కేతావత్ రేఖ్యానాయక్, హనుమంతునాయక్, బాణావత్ చిన మంత్రియానాయక్, మల్లునాయక్, మూఢావత్ అంజినాయక్, తులస్యానాయక్, సంతోష్‌నాయక్‌లు టీడీపీ ఏజెంట్లుగా కూర్చున్నారు. అక్కడకు వచ్చిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి.. వారిని బయటకు లాగేయమని తన అనుచరులను ఆదేశించారు. దీంతో వైసీపీ మూకలు ఆ ఏజెంట్లను బయటకు లాగేశారు. టెంట్లు పడేసి దాడికి పాల్పడ్డారు. టీడీపీ ఏజెంట్లను పిన్నెల్లి బలవంతంగా తన కార్లో ఎక్కిస్తుండగా, రేఖ్యానాయక్ పరారయ్యాడు. వైసీపీ మూకలు వెంటపడి కర్రలు, మారణాయుధాలతో రేఖ్యానాయక్‌పై దాడి చేసి గాయపరిచారు. మిగిలిన టీడీపీ ఏజెంట్లను కారులో బలవంతంగా ఎక్కించుకుని పోలింగ్‌కేంద్రానికి దూరంగా మాచర్లలో పిన్నెల్లి వదిలేశారు. రేఖ్యానాయక్‌ను బంధువులు మాచర్ల ఆస్పత్రికి తరలించారు. కాగా, మాచర్ల మండలం రాయవరంలో 51వ పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ మూకలు దాడిచేశాయి. అడ్డువచ్చిన పోలీసులపైనా దౌర్జన్యం చేశారు.

రక్తమోడుతున్నా ప్రతిఘటన

- తీవ్రంగా గాయపడీ.. వైసీపీ మూకలను వెంబడించిన శేషగిరిరావు... ఆలస్యంగా వీడియో వెలుగులోకి



వైసీపీ దాడిలో తీవ్రంగా గాయపడిన శేషగిరిరావు(ఫైల్)

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే, అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, అనుచరులను పోలింగ్ నాడు ప్రతిఘటించిన టీడీపీ ఏజెంట్ నంబూరు శేషగిరిరావు ఉదంతం ఇప్పుడు రాష్ట్రమంతా చర్చనీయాంశమైంది. ఈ నెల 13న పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లోకి పిన్నెల్లి ప్రవేశించి ఈవీఎంను ఎత్తి నేలకేసి కొట్టాడు. అక్కడ ఉన్న పోలింగ్ సిబ్బంది, పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నప్పటికీ టీడీపీ ఏజెంట్‌గా ఉన్న శేషగిరిరావు పిన్నెల్లిపైకి దూసుకెళ్లాడు. ఇంతవరకు అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డయింది. అయితే ఆ రోజు ఈవీఎం ధ్వంసం తర్వాత బూత్ వెలుపల శేషగిరిరావుపై వైసీపీ మూకలు దాడిచేయడం.. తలపగిలి రక్తమోడుతున్నా ఆయన వారిని వెంబడించి దాడి చేసిన వీడియో గురువారం వెలుగులోకి వచ్చింది. జరిగిన ఘటనలను సమీపంలో ఉన్న ఒక యువతి తన సెల్‌ఫోన్‌లో బంధించారు. పిన్నెల్లి ప్రేరేపించడంతో శేషగిరిరావుపై వైసీపీ రౌడీ మూకలు బూత్ వెలుపల కర్రలు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. కింద పడేసి కాళ్ల మీద, తల మీద తీవ్రంగా కొట్టారు. ఈలోపు గ్రామస్థులంతా అప్రమత్తమై రావడంతో రౌడీ మూకలు తమ కార్లలో పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్పటికే తల పగిలి రక్తం కారుతున్నప్పటికీ శేషగిరిరావు ఓపిక తెచ్చుకుని వారిని వెంబడించారు. ఒకరిద్దరిపై దాడి కూడా చేశారు. అదే సమయంలో కారులో నుంచి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు దిగేందుకు ప్రయత్నించడంతో ఆయనపైకి కూడా వెళ్లబోయారు. ఈలోపు రౌడీ మూకలు తమ వాహనాల్లో వేగంగా వెళ్లిపోయారు.



మాచర్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మాచర్లలో హైఅలర్ట్

మాచర్ల టౌన్, మే 23: పోలింగ్ రోజు, ఆ మర్నాడు పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ పరిధిలో వైసీపీ రౌడీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ నేతలను పరామర్శించేందుకు టీడీపీ రాష్ట్ర నాయకత్వం గురువారం 'చలో మాచర్ల'కు పిలుపిచ్చింది. అలాగే వైసీపీ ఎమ్మెల్యే, అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేస్తారని ప్రచారం జరగడంతో మాచర్ల పట్టణంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం కూడా 144 సెక్షన్ కొనసాగించారు. ఉదయం 10 గంటలకే పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య ట్రైనీ డీఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో కవాతు కూడా నిర్వహించారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని,గుంపులుగా ఉండవద్దని మైక్‌లో ప్రకటిస్తూ దుకాణాలను మూసివేయించారు. ఇంకోవైపు.. 'చలో మాచర్ల'కు అనుమతి లేదని జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ స్పష్టం చేశారు. మాచర్ల వెళ్లకుండా టీడీపీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గుంటూరులో నక్కా ఆనందబాబు, కనపర్తి శ్రీనివాసరావు ఇళ్ల వద్ద బలగాలను మోహరించారు. పోలింగ్ మరుసటి రోజు నుంచే మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని హౌస్ అరెస్టు చేశారు.

పోలీసుల సహకారంతోనే పరార్

- రామకృష్ణారెడ్డిలా పారిపోక ముందే కాకాణిని అరెస్టు చేయాలి: టీడీపీ

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల నుంచి పారిపోవడానికి పోలీసులే సహకరించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి పలు అంశాలపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. '13వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అక్రమంగా పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఈవీఎం పగలగొడితే పీవో ఎందుకు ఫిర్యాదు చేయలేదు? గుర్తు తెలియని వ్యక్తి ఈవీఎం ధ్వంసం చేశారని వీఆర్వో చేత ఫిర్యాదు చేయించడం ఏంటి? ఎలక్షన్ కమిషన్ ఏం చేస్తుంది? వెబ్ కాస్టింగ్ పెట్టామన్నారు. ఏం చేశారు? ఎమ్మెల్యే ఈవీఎం పగలగొట్టి బయటకి వెళ్తుంటే బూతు వద్ద బందోబస్తులో ఉన్న కానిస్టేబుళ్లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎందుకు అరెస్టు చేయలేదు? ఈ పరిస్థితి చూస్తుంటే ఓట్ల లెక్కింపు సజావుగా జరుగుతుందన్న నమ్మకం లేదు. పిన్నెల్లి మాచర్ల నుంచి పారిపోవడానికి కారణం పోలీసులే. దీనికి ఎవరు సహకరించారు? ఎస్పీనా, డీఐజీనా? ఇదంతా ఈసీకి తెలియకుండా జరిగిందా?' అని వర్ల ప్రశ్నించారు. దేవినేని ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ...మాచర్లలో పోలీస్ వ్యవస్థ ఫెయిల్ అవ్వడం వల్లే టీడీపీ పోలింగ్ ఏజెంట్ శేషగిరిపై దాడి జరిగిందన్నారు. అన్నింటికీ కారణం సీఎస్ జవహర్‌రెడ్డేనని మండిపడ్డారు. కాగా, పల్నాడులో పోలింగ్ రోజు, ఆ తర్వాత టీడీపీ కార్యకర్తలు, ఓటర్లపై దాడులకు పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ దేవినేని ఉమా డీజీపీకి లేఖ రాశారు.

చంద్రగిరి, సత్తెనపల్లిల్లో

రీపోలింగ్ వ్యాజ్యాలు కొట్టివేత

- ఫాం-17(ఏ)లను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచాం
- కౌంటింగ్ రోజు మాత్రమే బయటకు తీయగలం
- ఎన్నికల ప్రక్రియలో కోర్టుల జోక్యానికి వీల్లేదు
- హైకోర్టులో ఈసీ వాదనలు.. ఏకీభవించిన ధర్మాసనం

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, సత్తెనపల్లి నియోజకవర్గాల పరిధిలోని వివిధ బూత్‌ల్లో రీపోలింగ్ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ అభ్యర్థులు దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టివేసింది. గురువారం వ్యాజ్యాలు విచారణకు రాగా కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. పిటిషన్లకు విచారణార్హత లేదని, ఈవీఎం, వీవీప్యాట్ల స్క్రూటినీ సమయంలో అభ్యర్థులు ఉండాలని ఎలాంటి చట్టబద్ధమైన నిబంధన లేదని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూంలు సీజ్ చేసేముందు అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం, వీవీప్యాట్లను స్క్రూటినీ చేయాలని ఆర్వోలకు ఈసీ సూచనలు మాత్రమే ఇచ్చిందన్నారు. ఈవీఎంల స్క్రూటినీకి సంబంధించిన 17(ఏ) ఫాంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామని, కౌంటింగ్ రోజు మాత్రమే వాటిని బయటకు తీయగలమని తెలిపారు. అన్ని వివరాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాత రీపోలింగ్ అవసరం లేదని ఈసీ నిర్ణయించిందని చెప్పారు. పిటిషనర్లకు అభ్యంతరం ఉంటే ఈసీకి పిటిషన్ దాఖలు చేసుకోవాలి తప్ప హైకోర్టులో రిట్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 329(బి) మేరకు ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని, అందుకు సంబంధించి సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని విన్నవించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తులు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం పిటిషన్లను కొట్టివేసింది. ఈవీఎం, వీవీప్యాట్ల స్క్రూటినీ తన సమక్షంలో నిర్వహించి ఫాం-17(ఏ)లను రూపొందించేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని పలు బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే సత్తెనపల్లి నియోజకవర్గంలోని వివిధ బూత్‌లలో వెబ్ కెమెరా ఫుటేజ్‌లు, తాము సమర్పించిన ఆధారాలను పరిశీలించి ఆయా పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అక్కడి వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబు మరో పిటిషన్ దాఖలు చేశారు. మోహిత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి, అంబటి రాంబాబు తరఫున న్యాయవాది వీఎస్ఆర్ ప్రశాంత్ వాదనలు వినిపించారు.

తుఫాన్ వచ్చినా సకాలంలోనే 'నైరుతి'!

విశాఖపట్నం, అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): నైరుతి, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది శుక్రవారం నాటికి వాయుగుండంగా, ఆ తరువాత కూడా ఈశాన్యంగా పయనించి శనివారం ఉదయానికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫాన్‌గా మారనున్నది. దీనికి 'రేమెల్' అని పేరు పెట్టనున్నారు. మరింత బలపడి తీవ్ర తుఫాన్‌గా మారి ఆదివారం సాయంత్రం బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటుతుందని వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. దీని ప్రభావంతో పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశాల్లో భారీవర్షాలు కురుస్తాయని, తీరం దాటేటప్పుడు వంద కిలోమీటర్లకుపైగా వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. అయితే, ఆంధ్రప్రదేశ్‌కు ముప్పు లేనట్టేనని వాతావరణ నిపుణులు తెలిపారు. ఇదే సమయంలో తీరానికి దూరంగా తుఫాన్ పయనించనున్నందున ఆ దిశగా భూ ఉపరితలం మీద నుంచి వేడి గాలులు వీయనున్నాయి. ఇప్పటికే వాయువ్య భారతం నుంచి తీవ్ర వడగాడ్పులు మధ్య భారతం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మీదుగా అల్పపీడనం దిశగా వీస్తున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో వడగాడ్పుల తీవ్రత మరింత పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రానున్న నాలుగు రోజులు ఎండ తీవ్రత పెరగడంతో పాటు వడగాడ్పులు వీచే అవకాశముందని హెచ్చరించారు. ఇదిలావుండగా కేరళకు ఆనుకుని ఆగ్నేయ, అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో కేరళ, కర్ణాటక తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా, తుఫాను వచ్చినా రుతుపవనాల రాకలో జాప్యం ఉండదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కేరళకు ఆనుకుని అరేబియా, హిందూ మహా సముద్రంలో రుతుపవన మేఘాలు భారీగా ఆవరించి ఉన్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం బలపడి తుఫాన్‌గా మారి బంగ్లాదేశ్ వద్ద తీరం దాటే క్రమంలో అరేబియాలో ఉన్న రుతుపవన మేఘాలు కేరళ వైపు వస్తాయని అంచనా వేస్తున్నారు. అప్పుడు ఈ నెల 29, 31 తేదీల మధ్య ఏ క్షణమైనా రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో 103 శాతం వర్షాలు కురుస్తాయని ఇంతకు ముందు అంచనా వేయగా, తాజా పరిస్థితులను బట్టి 105 శాతం వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అలాగే, నైరుతి రుతుపవనాల నిష్క్రమణ కూడా ఈ ఏడాది ముందే జరుగుతుందని పేర్కొన్నారు. మొత్తంగా ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, వర్షం కురిసే రోజుల సంఖ్య తక్కువని, ఫలితంగా కుంభవృష్టిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు

రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో అక్కడక్కడ చెదురుమదురుగా, శనివారం అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాగల మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా చెదురుమదురు వర్షాలు, అక్కడక్కడా పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పలు చోట్ల ఎండలు తీవ్రంగా ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. శుక్రవారం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది.

పిన్నెల్లికి ముందస్తు బెయిల్

- 6 వరకు ఆయన్ను అరెస్టు చేయొద్దు: హైకోర్టు
- పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోవద్దు
- ఆయన కదలికలపై నిరంతరం నిఘా
- పిన్నెల్లి వెంట నలుగురికి మించి ఉండకూడదు
- దర్యాప్తునకు ఆటంకం కలిగించరాదు
- సాక్షులను బెదిరించడానికి వీల్లేదు
- ఎలాంటి నేరాలకూ పాల్పడకూడదు
- న్యాయమూర్తి స్పష్టీకరణ
- తాడిపత్రి టీడీపీ, వైసీపీ అభ్యర్థులకూ బెయిల్
- చింతమనేని, గోపిరెడ్డికి సైతం ఊరట

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఈవీఎంను ధ్వంసం చేసిన వ్యవహారంలో మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఊరట లభించింది. ఆయనకు షరతులతో కూడిన మధ్యంతర ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. జూన్ 6 వరకు ఆయన్ను అరెస్టు చేయవద్దని, తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఆయన కదలికలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిఘా ఉంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)ని ఆదేశించింది. ఆయన వెంట నలుగురు వ్యక్తులకు మించి ఉండకూడదని తేల్చిచెప్పింది. ఆయన దర్యాప్తునకు ఆటంకం కలిగించడం గానీ, సాక్షులను బెదిరించడం గానీ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మధ్యంతర ముందస్తు బెయిల్ సమయంలో ఎలాంటి నేర ఘటనలకు పాల్పడడానికి వీల్లేదని ఆదేశించింది. విచారణను జూన్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం రాత్రి ఆదేశాలిచ్చారు. ఈ నెల 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మాచర్ల నియోజకవర్గం పాల్వాయ్ గేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేసిన వ్యవహారంలో పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. కోర్టు విచారణ చేపట్టగా.. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసులేనని.. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పోలీసులు సీఆర్పీసీ 41(ఏ) నిబంధనలు పాటించాలని తెలిపారు. ఘటన ఈ నెల 13న జరుగగా.. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఈవీఎం ధ్వంసం చేశారని వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈనెల 15న పోలీసులు కేసు నమోదు చేశారని.. టీడీపీ నేత లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియో ఆధారంగా పిటిషనర్‌ను అరెస్టు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడం సరికాదన్నారు. ప్రతిపక్షానికి చెందిన వ్యక్తి వీడియోను మార్ఫింగ్ చేసి ఉండవచ్చని తెలిపారు. పిన్నెల్లిని అరెస్టు చేయాలని ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయని.. ఆ ఆదేశాలతో పోలీసు యంత్రాంగం మొత్తం ఆయన్ను వెంబడిస్తోందని వివరించారు. ఆయన్ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేసే ప్రమాదం ఉందన్నారు. కనీసం వారం పాటు పిటిషనర్‌ను అరెస్టు చేయకుండా మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పోలీసుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై అదనంగా ఏమైనా సెక్షన్లు నమోదు చేశారా లేదా అనే వివరాలు తెలుసుకోవలసి ఉందని.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని.. అందుకు సమయం ఇవ్వాలని కోరారు. మరోవైపు టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిన్నెల్లి పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎంను పగులగొట్టారన్నారు. అడ్డువచ్చిన శేషగిరిరావుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని.. బాధితుడి వాదన వినకుండా పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని అభ్యర్థించారు. ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతించాలని కోరారు.

పలువురు అభ్యర్థులకు మధ్యంతర ముందస్తు బెయిల్..

మరోవైపు.. ఎన్నికల సందర్భంగా నమోదైన పలు కేసుల్లో నిందితులుగా ఉన్న టీడీపీ, వైసీపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు తమను పోలీసులు అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. తాడిపత్రి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పరిమి సోమశేఖర్ నాయుడు, దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, నరసరావుపేట వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆ రెండు పార్టీలకు చెందిన పలువురు నాయకులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపైనా గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ఉందని.. దానికిముందు పోటీ చేసిన అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకోవలసి ఉందని.. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించాల్సి ఉందని.. ఈ దశలో వారిని అరెస్టు చేస్తే వారి హక్కులకు భంగం కలుగుతుందని తెలిపారు. ఈ దశలో వారికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే కౌంటింగ్ సందర్భంగా మరిన్ని గొడవలు సృష్టించే ప్రమాదం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి పేర్కొన్నారు. మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోర్టు భావిస్తే కఠిన షరతులు విధించాలన్నారు. తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో పోలీసులు 144 సెక్షన్ విధించారని.. అభ్యర్థులు తాడిపత్రిలో అడుగుపెట్టడానికి వీల్లేదని జిల్లా ఎస్పీ సమాచారం ఇచ్చారని తెలిపారు. పిటిషనర్లపై నమోదైన కేసుల విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని.. అందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరుతున్నారని.. వ్యాజ్యాలపై తుది నిర్ణయం వెల్లడించాలంటే లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. పోటీ చేసిన అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకోవాలని.. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించాల్సి ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారని.. ఈ నేపథ్యంలో పిటిషనర్లకు షరతులతో కూడిన మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యాజాలపై విచారణను జూన్ 6కి వాయిదా వేశారు. అప్పటి వరకు పిటిషనర్లను అరెస్టు చేయవద్దని, వారిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. పిన్నెల్లి విషయంలో విధించిన షరతులనే వీరికీ వర్తింపజేశారు. అభ్యర్థులు జేసీ అస్మిత్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలో ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

రేయ్.. నరుకుతాం కొడకల్లారా!

- మద్యం మత్తులో వైసీపీ వర్గీయుల హల్‌చల్
- అనంతలో ఏమాత్రం తగ్గని అధికారపార్టీ అరాచకాలు



విష్ణు బిల్డర్స్ తేజను బెదిరిస్తున్న వైసీపీ కార్యకర్త మల్లికార్జున రెడ్డి

అనంతపురం క్రైం/బెళుగుప్ప, మే 23: పోలింగ్ పూర్తయినా వైసీపీ వర్గీయుల అరాచకాలు మాత్రం తగ్గడంలేదు. అనంతపురం నగరంలో అధికార పార్టీ కార్యకర్త మల్లికార్జున రెడ్డి మద్యం సేవించి.. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ జనాన్ని బెంబేలెత్తించాడు. 'జై జగన్.. జై వైఎస్సార్' అంటూ గురువారం సాయంత్రం కారును వేగంగా నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు. రూరల్ మండలం పిల్లిగుండ్ల కాలనీకి చెందిన మల్లికార్జునరెడ్డి, తన మిత్రులతో కలిసి ఇలా రచ్చ చేశాడు. ఈ క్రమంలో బైక్‌పై వెళుతున్న విష్ణు బిల్డర్స్ యజమాని తేజ బైక్‌ను ఢీ కొట్టినంత పనిచేశాడు. దీంతో తేజ కారును వెంబడించి.. డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద అడ్డుకున్నాడు. కారు తాళాలు తీసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో 'రేయ్.. ఏమనుకున్నావ్.. నేను జగన్ మనిషిని.. నరుకుతాం లే.. కొడకల్లారా..' అని బీరాలు పలికాడు. పోలీసులు రాగానే పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకుని టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. కాగా, అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం గుండ్లపల్లి అధికారపార్టీకి చెందిన సర్పంచ్ పురుషోత్తం మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. అర్ధరాత్రి కారును గ్రామంలో తిప్పుతూ జనానికి నిద్రలేకుండా చేశాడు.

వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రక్షణ లేదు

- పిన్నెల్లి అరాచకాలకు అడ్డూఅదుపు లేదు : సయ్యద్ రఫీ

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రక్షణ లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ ఆరోపించారు. వైసీపీ పాలనలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాడులు, దౌర్జన్యాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. టీడీపీకి ఓటు వేశారని వంద ముస్లిం కుటుంబాలను వేధించడంతో వారు మాచర్ల నుంచి వేరే ప్రాంతాలకు తరలిపోయి బతుకుతున్నారని తెలిపారు.

స్ట్రాంగ్ రూంల దగ్గర సీసీ కెమెరాలు లేవు!

- పోలీసులు కూడా లేరు: సీపీఐ నారాయణ

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు ఉన్నతాధికారులను ఈసీ బదిలీ చేసినప్పటికీ కింది స్థాయిలో ఉన్న కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐలు ఎన్నికల్లో అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా పనిచేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. ఏపీలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల దగ్గర పోలీసులు లేరని, సీసీ కెమెరాలు కూడా లేవని ఆరోపించారు.

జగన్ నివాసం కేంద్రంగా టీడీపీపై దాడులకు రూపకల్పన: కనకమేడల

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజున గొడవలు జరిగిన అన్ని ప్రదేశాలలో వెబ్‌కాస్టింగ్ వీడియోలను బయటపెట్టాలని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. తాడేపల్లిలో సీఎం జగన్ నివాసం కేంద్రంగా రాష్ట్రంలో టీడీపీ సానుభూతిపరులు, ఓట్లు వేసిన వారిపై దాడులకు రూపకల్పన జరిగిందని ఆరోపించారు.

గులకరాయి కేసులో కౌంటర్ దాఖలు

విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): జగన్‌పై విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద జరిగిన గులకరాయి దాడి కేసులో పోలీసులు గురువారం కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడు వేముల సతీష్‌కుమార్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని, కేసులో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలో ఉందని పేర్కొన్నారు. ఈ దశలో సతీష్‌కుమార్‌కు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఇబ్బందికరంగా ఉంటుందని కోర్టుకు వివరించారు. తదుపరి విచారణను ఈనెల 27వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

బీఎల్‌వోల బకాయిలు చెల్లించండి

▸▸ రాష్ట్ర అదనపు సీఈవోకు వీఆర్వోల సంఘం వినతి

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో పని చేస్తున్న బీఎల్‌వోలకు మూడు సంవత్సరాల నుంచి గౌరవ వేతనం ఇవ్వడంలేదని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేసింది. గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి(అదనపు సీఈవో) కోటేశ్వరరావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశామని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రరాజు, అప్పలనాయుడు తెలిపారు. బీఎల్‌వోల గౌరవ వేతనం ఫైల్ ఆర్థికశాఖలో ఉందని, త్వరలోనే నిధులు విడుదల చేస్తారని అదనపు సీఈవో హామీ ఇచ్చారని తెలిపారు.

రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ పోస్టుకు వలవన్ దరఖాస్తు

▸▸ సిఫారసు చేస్తూ కేంద్రానికి లేఖ రాసిన సీఎస్

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన గతేడాది జూలైలో రిటైరయ్యారు. ప్రభుత్వం ఆయన సేవలను కొనసాగిస్తూ దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. కొంతకాలంగా కేంద్ర సర్వీస్‌లోకి వెళ్లాలని విశ్వప్రయత్నాలు చేస్తున్న ఆయన ఇప్పుడు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ పోస్టుకు దరఖాస్తు చేశారు. ఆయన దరఖాస్తును సీఎస్ జవహర్‌రెడ్డి కేంద్రానికి సిఫారసు చేశారు.

రైతు బిడ్డకు సీఎంఏలో 9 బంగారు పతకాలు

కొత్తచెరువు/ పుట్టపర్తి రూరల్, మే 23: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మునిసిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లికి చెందిన గొల్ల శ్రీకాంత్ కుమార్ యాదవ్ ఇటీవల జరిగిన సీఎంఏ (కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్) పరీక్షల్లో జాతీయ స్థాయి మొదటి ర్యాంకు సాధించారు. కోల్‌కతాలో గురువారం నిర్వహించిన ఐసీఎంఏఐ సంస్థ వార్షికోత్సవంలో బ్రిటిష్ హై కమిషనర్ ఆండ్రీవ్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చేతుల మీదుగా 9 బంగారు పతకాలు, ఒక ప్లాటినం మెడల్, ప్రైజ్‌మనీ అందుకున్నారు. శ్రీకాంత్ తల్లిదండ్రులు గొల్లకేశవ, నాగేంద్రమ్మ దంపతులు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఈ సందర్భంగా శ్రీకాంత్ 'ఆంధ్రజ్యోతి'తో గురువారం ఫోన్‌లో మాట్లాడారు. భారత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిర్వహించిన సీఎంఏ పరీక్షల్లో జాతీయస్థాయి మొదటి ర్యాంకు సాధించానని అన్నారు. దీంతో భారత ప్రభుత్వం బంగారు పతకాలతోపాటు ప్రైజ్‌మనీతో సత్కరించందని తెలిపారు. ప్రస్తుతం తాను హైదారాబాద్‌లోని ఐటీసీలో ఫైనాన్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. తన తల్లిదండ్రులతో కలిసి కోల్‌కతాలో సత్కారం అందుకోవడం గర్వంగా ఉందన్నారు.



తల్లితండ్రులతో కలిసి బంగారు పతకాలను అందుకున్న శ్రీకాంత్ యాదవ్

చికెన్ కిలో రూ.300

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు బాగా పెరిగాయి. వారం రోజుల్లో ఏకంగా కిలోకు రూ.60పెరిగింది. ప్రస్తుతం విత్‌స్కిన్ రూ.280, స్కిన్‌లెస్ రూ.300 చొప్పున అమ్ముతున్నారు. బోన్‌లెస్ చికెన్ రూ.400దాకా పలుకుతోంది. ఫారం కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో చికెన్ ధర పెరిగినట్లు వ్యాపారులు చెప్తున్నారు. వేసవి కారణంగా పౌల్ట్రీల నిర్వాహకులు కోళ్ల సంఖ్య తగ్గించారు. ఓవైపు వేడిగాలులు తగ్గి, చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో చికెన్ వినియోగం పెరిగింది. ఎన్నికల సమయం కావడంతో హోటళ్లు, రెస్టారెంట్లలో నాన్‌వెజ్ అమ్మకాలు పెరిగాయి. డిమాండ్ తగ్గట్టుగా కోళ్ల ఉత్పత్తి లేక చికెన్ ధరలు పెరుగుతున్నాయి. నెల క్రితం కిలో రూ.200-రూ.220 వరకు ఉన్న చికెన్.. పోలింగ్ దగ్గర నుంచి క్రమంగా పెరుగుతోంది. కౌంటింగ్ తర్వాత కూడా కొద్దిరోజుల వరకు ధరతగ్గే అవకాశం లేదని భావిస్తున్నారు. గుడ్డు రిటైల్‌గా రూ.7 పలుకుతోంది. వచ్చేనెల 10-15 తర్వాత పౌల్ట్రీల నిర్వాహకులు కొత్త బ్యాచ్‌లను తీసుకువచ్చాక చికెన్ ధర తగ్గే అవకాశం ఉందని చెప్తున్నారు.

వాడుకోలేదా... వడ్డీతో సహా ఇచ్చేయండి

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

▸▸ గిరిజన సంక్షేమ శాఖకు ఇచ్చిన నిధులు వాపసు

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమ కోసం విడుదల చేసిన నిధులు ఖర్చు కాకపోవడంతో వాటిని తిరిగి వడ్డీతో సహా తిరిగి వెనక్కి పంపించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆదేశించింది. ఈ నెల 14న కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ వివిధ రాష్ట్రాల్లో గిరిజన పథకాల అమలుపై సమీక్షించారు. మన రాష్ట్రానికి సంబంధించి ఖర్చు కాని కేంద్ర పథకాల నిధుల విషయంపై రాష్ట్ర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీవీటీజీ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చూపిన వివరాలు సరిగా లేవని, వాటి వివరాలను సరిచేసి 10 రోజుల్లోపు ఇవ్వాలని సూచించారు. కాగా, కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలో ఖర్చు చేయకుండా ఉన్న నిధులను తిరిగి కేంద్రానికి పంపించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సీఎస్‌కు లేఖ రాసింది. కేంద్రం ఇచ్చిన నిధులు ఖర్చు కాకుండా రాష్ట్ర ఖజానాలో ఉన్నాయని, వాటిని వెనక్కి ఇచ్చేయాలని తెలిపింది. పీఎం-జన్‌మాన్ పథకం నిధులు రూ.14.97 కోట్లు, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు సంబంధించి రూ.85.88 కోట్లు రాష్ట్ర ఖజానాలో నెలదాటి అక్కడే ఉన్నాయని.. వెంటనే వాటిని బదిలీ చేయాలని ఆదేశించింది. పది రోజుల్లోపు వడ్డీతో సహా ఈ నిధులను కేంద్ర ప్రభుత్వ ఖాతాల్లోకి జమ చేయాలని ఆదేశించింది.

బిష్కెక్ నుంచి ఢిల్లీకి

రోజూ రెండు విమానాలు: ఏపీఎన్ఆర్టీఎస్

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్ నుంచి న్యూఢిల్లీకి గురువారం నుంచి ప్రతిరోజూ నేరుగా రెండు విమానాలు నడుస్తాయని ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) తెలిపింది. ఏపీఎన్ఆర్‌టీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఈమేరకు గురువారం ఒక ప్రకటన చేశారు. 'కిర్గిజిస్థాన్‌లో ఉన్న ఏపీ విద్యార్థుల భద్రత, అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, యురేషియా అదనపు కార్యదర్శి చరణ్‌జీత్‌సింగ్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. అక్కడ పరిస్థితులు ప్రస్తుతం సాధారణంగానే ఉన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయపడవద్దు. కిర్గిజ్‌స్థాన్‌లో ఉన్న భారతీయ, తెలుగు విద్యార్థులు ఏదైనా అత్యవసర సహాయం కోసం బిష్కెక్‌లోని భారత రాయబార కార్యాలయం వారి హెల్ప్ లైన్ నంబరు 0555710041ను సంప్రదించాలి. కిర్గిజిస్థాన్‌లోని ఏపీ విద్యార్థుల సహాయం కోసం ఏపీఎన్ఆర్‌టీఎస్ కూడా 24/7 హెల్ప్‌లైన్ నంబర్లు +918632340678, +9185000 27678 (వాట్సాప్) లేదా ఈ-మెయిల్ info@apnrts.com, helpline@apnrts.com లో సంప్రదించాలి' అని కోరారు.

మీ ఖచ్చితమైన ఊహా!
మిమ్మల్ని గెలిపిస్తుంది
లక్షాధికారిని చేస్తుంది!!
QR స్కాన్ చేయండి

అంత ఆత్రమేల జవహరా!

(మొదటి పేజీ తరువాయి)

చేసుకునేందుకు జవహర్ రెడ్డి ఆరాట పడుతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇంటర్వ్యూలు జూన్ 7వ తేదీని నిర్వహిద్దామని, ఆ సమయానికి ఢిల్లీలో అందుబాటులో ఉండాలని యుపీఎస్సీ లేఖలో స్పష్టంగా పేర్కొంది. దీంతో ఆయన యూపీఎస్సీకి లేఖ రాశారు. "జూన్ 4 వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉంది. ఆ తర్వాత రెండు రోజులపాటు మా షెడ్యూల్ బిజీగా ఉంటుంది. అందువల్ల 7వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలకు రాలేకపోవచ్చు. ఇంటర్వ్యూలు మే చివరి వారంలో లేదా మే 31వ తేదీన పూర్తి చేద్దాం" అంటూ యూపీఎస్సీకి ఉచిత సలహా ఇచ్చారు. జవహర్ రెడ్డి స్పందన వెనుక ఉద్దేశాలు సుస్పష్టం! ఈ లేఖను పరిశీలించిన యూపీఎస్సీ సూటిగా, ఘాటుగా సమాధానం పంపింది. "జూన్ 6 వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. మే నెలలో ఇంటర్వ్యూలు చేయడం కుదరదు" అని సీఎస్‌కు స్పష్టం చేసింది. దీంతో సీఎస్‌కు ఇప్పుడు దిక్కు తోచడం లేదు.

ఆది నుంచీ రహస్యమే..

ప్రస్తుతం రాష్ట్రంలో నాన్ రెవెన్యూ ఐఏఎస్ పోస్టులు రెండు ఖాళీలున్నాయి. ఈ రెండు పోస్టుల్లో 'తమ' వారినే నియమించుకోవాలని వైసీపీ ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. అందులోనూ సీఎస్ జవహర్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ రెడ్డి ఇద్దరూ చక్రం తిప్పుతున్నారు. ఈ రెండు పోస్టుల కోసం నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి ప్రభుత్వం అత్యంత రహస్యంగానే వ్యవహరిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 8న జీఏడీ రెండు పోస్టుల భర్తీకి గుట్టుగా నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 7నాటికి అన్ని శాఖల ఉద్యోగులు దరఖాస్తులు అందించాలని పేర్కొంది. కొన్ని శాఖల్లో అర్హత కలిగిన ఉద్యోగులకు నోటిఫికేషన్ ఇచ్చారన్న సమాచారం కూడా లేదు. దీంతో రెండు పోస్టులకు 46 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వీటిని జీఏడీ అధికారులు స్ర్కూటినీ చేసి 10మంది పేర్లు సిఫారసు చేశారు. ఈ లిస్ట్ చూస్తే చాలు.. దీనిపై సీఎస్ ప్రభావం అర్థమవుతుంది. గడికోట మాధురి, భూమిరెడ్డి మల్లికార్జున రెడ్డి, ఎం.కె.వి.శ్రీనివాసులు, డా.ఎం.వరప్రసాద్, డి.దేవానంద రెడ్డి, పి.ఎస్.సూర్యప్రకాశ్, జి.రాజారత్న, సి.బి.హరినాథ్ రెడ్డి, సి.హెచ్.వుల్లారెడ్డి, ఏఏల్ పద్మావతి పేర్లను కన్ఫర్డ్ ఐఏఎస్ హోదాకోసం ప్రతిపాదించారు. వీరిలో ఐదుగురు కడప జిల్లాకు చెందిన రెడ్డి సామాజికవర్గం అధికారులు కావడం గమనార్హం. అందులోనూ... ఈ పదిమందిలో ఏడుగురు గత ఏడాది పంపిన జాబితాలోనూ ఉన్నారు. అప్పట్లో కడప జిల్లాకు చెందిన నీలకంఠా రెడ్డి, అనిల్ రెడ్డిలకు ఐఏఎస్ దక్కింది. ఇందులో నీలకంఠా రెడ్డి సీఎం కార్యదర్శి ధనుంజయ రెడ్డి పేషీలో అధికారి. ఇక... అనిల్ రెడ్డిని జగన్ నేరుగా ఎంపిక చేసినట్లు చెబుతారు. ఇక... తాజా జాబితాలోనూ కనిపించిన ఇందులో గడికోట మాధురి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఆమె స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ అధికారి. డీడీ స్థాయిలో కనీసం ఎనిమిదేళ్లు పనిచేస్తేనే కన్ఫర్డ్ ఐఏఎస్‌కు అర్హత లభిస్తుంది. 2007 గ్రూప్-1 బ్యాచ్ చెందిన మాధురి 2023లో డిప్యూటీ డైరెక్టర్ కేడర్‌లోకి వచ్చారు. కేవలం ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి ఓఎస్డీగా పని చేయడమే అర్హతగా భావిస్తూ.. కనీస అనుభవం లేకున్నా కన్ఫర్డ్ ఐఏఎస్‌ల జాబితాలో చేర్చేశారు. జవహర్ రెడ్డి, ధనుంజయ రెడ్డి అండదండలే దీనికి కారణమని చెబుతారు. ఆమెకు ఐఏఎస్ ఇప్పించేందుకు ఇద్దరు అధికారులు చేయని ప్రయత్నాలు, పడని పాట్లు లేవు. ఎన్నికల కోడ్ ఉన్నందున యూపీఎస్సీ ఇంటర్వ్యూలు ఆపేయకపోతే ఆమెకు ఐఏఎస్ ఖరారయ్యేదని చెబుతున్నారు.

దరఖాస్తులే తీసుకోలేదు..

కన్ఫర్డ్ ఐఏఎస్‌ల విషయంలో ప్రభుత్వం, సీఎస్, ధనుంజయరెడ్డి గేమ్‌లో చాలా మంది అర్హత కలిగిన ఉద్యోగులు బలైపోయారు. నోటిఫికేషన్ రహస్యంగా ఉంచడంతో పాటు కొన్ని శాఖల అధికారుల దగ్గర నుంచి దరఖాస్తులే తీసుకోలేదు. ఈ పోస్టులకు వాణిజ్య పన్ను శాఖ అధికారుల నుంచి ఎక్కువగా దరఖాస్తులు అందుతాయి. కానీ.. నోటిఫికేషన్ ఇచ్చిన సంగతే తెలియకపోవడంతో ఒక్కరంటే ఒక్కరూ దరఖాస్తు చేసుకోలేకపోయారు. చివరి నిమిషంలో ఈ విషయం తెలిసి... సుమారు పది మంది తమ దరఖాస్తులు సిద్ధం చేసుకుని మార్చి 7వ తేదీ సాయంత్రం జీఏడీకి వెళ్లారు. కానీ.. వాటిని తీసుకునేందుకు అధికారులు ససేమిరా అన్నారు. అత్యంత రహస్యంగా అస్మదీయులకు ఐఏఎస్‌లు కట్టబెట్టేందుకు ఆడిన నాటకంలో ఇలా ఎంతోమంది అర్హులు బలైపోయారు.

మోదీ రోడ్ షోలో డ్రోన్‌పై

కేంద్రం సీరియస్

▸▸ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు లేఖ

అమరావతి, విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రోడ్‌షో సందర్భంగా డ్రోన్లు ఎగురవేయడంపై కేంద్రం సీరియస్ అయింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా 8న విజయవాడలో ఎన్డీఏ నేతలు చంద్రబాబు, పవన్‌తో కలిసి మోదీ రోడ్‌షో నిర్వహించారు. బందరు రోడ్డులో మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్‌సర్కిల్ వరకూ సాగిన ఈ రోడ్డుషో సాయంత్రం 6.15కు మొదలైంది. అంతకు 45 నిముషాల ముందు రోడ్ షో ప్రారంభమయ్యే ప్రాంతంలో ఒకటి, ముగించే దగ్గర మరొకటి గాల్లో ఎగురుతున్న డ్రోన్లను ప్రధాని రక్షణ బాధ్యతలు పర్యవేక్షించే నేషనల్ సెక్యూరిటీ గ్రూప్(ఎన్ఎస్‌జీ) గమనించి వాటిని కిందికి దించేసింది. ప్రధాని పర్యటించే ప్రాంతంలో కనీసం 2కిలోమీటర్ల దూరంలో ఎలాంటి డ్రోన్లు ఎగరకుండా నిషేధం ఉందంటూ అడ్డుకుంది. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖకు తెలియజేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రధాని పర్యటనకు సంబంధించి సెక్యూరిటీపై మే 5న జరిగిన చర్చలో ఈ విషయాన్ని వివరించినప్పటికీ ఏపీ పోలీసులు డ్రోన్లు ఎందుకు ఎగురవేశారని ప్రశ్నించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు, ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వీవీఐపీల భద్రతలో భాగంగా పోలీసు శాఖ నిఘా కోసం డ్రోన్లను ఎగురవేస్తుంది. ప్రధాని రోడ్‌షో ప్రాంతం నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటిస్తూ సీపీ ఆదేశాలు ఇచ్చారు. దీంతో డ్రోన్ ఎగరవేయాలంటే ముందుగా పోలీసు కమిషనర్ అనుమతి తీసుకోవాలి. కాగా, ప్రకాశం జిల్లా నుంచి పోలీసులు ఈ డ్రోన్‌ను ఎగురవేసినట్టు పోలీసు కమిషనర్‌కు సమాచారం అందింది. దీనిపై అంతర్గతంగా విచారణ చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌లో హడావిడి ఆడిట్!

కౌంటింగ్‌కి ముందే పూర్తికావాలని ఒత్తిళ్లు

రెండు నెలలు జరిగే ప్రక్రియ 20 రోజుల్లోనే...

49కోట్లు వైసీపీ కార్యకర్తలకే వెళ్లినట్లు గుర్తింపు

గుంటూరు సిటీ, మే 23: సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)నిధుల వినియోగంపై హడావిడిగా ఆడిట్ జరుగుతోంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఆడిట్ మొదలుపెట్టాలని ఆదేశించిన ప్రభుత్వ పెద్దలు... ఫలితాలు వచ్చేలోగా ముగించాలని సూచించారు. సదరు పెద్దల ఒత్తిడితో సుమారు రెండు నెలల పాటు జరిగే ఆడిట్ ప్రక్రియను 20రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారులు హైరానా పెడుతున్నారు. తగినంత సిబ్బంది లేకపోవడంతో బయటనుంచి కొందరిని తీసుకువచ్చి ఆడిట్‌ను మమ అనిపించేందుకు సిద్ధమయ్యారు. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సీఎం సహాయ నిధి నుంచి వెళ్లిన సుమారు రూ.49కోట్లు కేవలం వైసీపీ నేతలు, కార్యకర్తలకే వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఈ విషయాలన్నీ గోప్యంగా ఉంచుతున్నారు. లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) కింద ముందస్తుగా ఇచ్చిన అనుమతులు, వాటికి సంబంధించిన రూ.48కోట్ల బిల్లుల వ్యవహారంలోనూ లోటుపాట్లు ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.120కోట్ల చెల్లింపుల్లో గుర్తించిన అవకతవకలతో ఆడిట్ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నట్లు సమాచారం. లోతుగా విచారణ జరిపితే సీఎంఆర్‌ఎఫ్ పేరిట జరిగిన అక్రమాలన్నీ వెలుగులోకి వస్తాయన్న ఆలోచనతో ఆడిట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయించేందుకు ప్రభుత్వంలోని పెద్దమనిషి ఒకరు హడావిడి చేస్తున్నట్లు సమాచారం.

జలజీవన్ కాంట్రాక్టర్లకు ఝలక్!

▸▸ మొత్తం 1,000 కోట్ల బిల్లుల్లో సగం తిరస్కరణ

▸▸ విజయవాడ సమావేశంలో కాంట్రాక్టర్ల ఆందోళన

విజయవాడ, మే 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా సంస్థ పరిధిలోని జల్ జీవన్ మిషన్(జేజేఎం) కాంట్రాక్టర్లకు జగన్ సర్కారు ఝలక్ ఇచ్చింది. వీరికి దాదాపు రూ.1,000 కోట్ల వరకూ బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. అప్‌లోడ్ చేసినవాటిలో సగం కాంట్రాక్టర్లకు రిటర్న్ చేశారు. ఈ ముసుగులో సొంత పార్టీకి చెందిన ఎంపిక చేసిన బడా కాంట్రాక్టర్లకు మాత్రమే పేమెంట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తమవద్ద పెండింగ్ బిల్లులు లేవని చెప్పుకోవడానికి, కోర్టును సైతం తప్పుదారి పట్టించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కొద్దిరోజుల కిందట అప్‌లోడ్ చేసిన వాటికి బిల్లులు చెల్లించాలని జేజేఎం కాంట్రాక్టర్లు గట్టిగా అడగటంతో పాటు సీఈవోకి కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల విడుదల చేసిన మెమోను అడ్డంపెట్టుకుని సగం బిల్లులు వెనక్కి పంపారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. మెమోను కొత్త పనులకు అన్వయించుకోవాలి గానీ.. అగ్రిమెంట్ ప్రొసీడింగ్స్‌కు విరుద్ధంగా పాత పనులకు అన్వయించడం సరికాదని పేర్కొంటున్నారు. గురువారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జేజేఎం పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు భేటీ అయ్యారు. ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. జగన్ సర్కారు అంతర్గతంగా తీసుకొచ్చిన మెమోపైనా చర్చించారు. మెమో జారీ కేవలం కుట్ర కోణమని, సొంత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు చిన్న కాంట్రాక్టర్లను ప్రభుత్వం తెలివిగా పెండింగ్ జాబితా నుంచి తప్పించిందని కాంట్రాక్టర్లంతా అభిప్రాయపడ్డారు. ఇదే విధానం కొనసాగితే పనులన్నింటినీ ఆపివేయాలని, గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి నీటి సరఫరాను కూడా ఆపివేసి నిరవధిక దీక్ష చేయాలని సంకల్పించారు. తమ కార్యాచరణను అమల్లోకి తీసుకువచ్చే ముందు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీతో పాటు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని మరోసారి కలవాలని కాంట్రాక్టర్లు నిర్ణయించారు.



విజయవాడలోని హోటల్‌లో సమావేశమైన కాంట్రాక్టర్లు

అంతర్గత మెమోపై అనుమానాలు

ప్రభుత్వం జారీచేసిన అంతర్గత మెమోపై మాకు కొన్ని అనుమానాలు ఉన్నాయి. పైపుల సరఫరాపై పేమెంట్లు తగ్గించాలని సొంత నిర్ణయం తీసుకున్నారు. ఇది కాంట్రాక్టర్లెవరికీ సమ్మతం కాదు. ఇప్పటివరకు అప్‌లోడ్ అయ్యి రిలీజ్ చేయాల్సిన బిల్లులు రూ.700 కోట్ల వరకు ఉన్నాయి. పనులు చేసి, అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులు రూ.300 కోట్ల వరకు ఉన్నాయి. ఇప్పటికే అప్‌లోడ్ అయిన బిల్లుల్లో సగం రిటర్న్ చేశారు. మేమంతా సంఘటితమయ్యాం. భవిష్య కార్యాచరణ దిశగా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నాం. - బొమ్మినేని రామాంజనేయులు, వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ఏబీవీపై క్యాట్ ఉత్తర్వుల రద్దుకు అప్పీల్

▸▸ హైకోర్టులో ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌ను తప్పుబడుతూ, ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఒకే అభియోగంపై రెండుసార్లు సస్పెండ్ చేయడాన్ని క్యాట్ తప్పుపట్టిందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా ఆయనను సర్వీసులోకి తీసుకోకముందే రెండోసారి సస్పెండ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిందన్నారు. ఏబీవీని రెండోసారి సస్పెండ్ చేసేందుకు న్యాయసలహా సైతం తీసుకుందన్నారు. అందుకు సంబంధించిన నోట్ ఫైల్, ఇతర వివరాలను కోర్టు ముందు ఉంచారు. రెండోసారి సస్పెండ్ చేయాలని ఎందుకు నిర్ణయానికి వచ్చారో కారణాలు పేర్కొనలేదన్నారు. సాక్షులను బెదిరిస్తున్నందునే సస్పెండ్ చేశామని చెబుతున్నారన్నారు. ఎవరిని బెదిరించారో, ఆ వివరాలను ట్రైబ్యునల్ ముందు ఉంచలేదన్నారు. ఎఫ్ఐఆర్ దాఖలు చేయకముందే శాఖాపరమైన విచారణ పేరుతో 15నెలల పాటు పిటిషనర్‌ను సస్పెన్షన్‌లో ఉంచారన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే తక్షణం ఏబీవీని విధుల్లోకి తీసుకోవాలని, వేతన బకాయిలు చెల్లించాలని ట్రైబ్యునల్ ఆదేశించిందని, ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం అవసరం లేదన్నారు. మరోవైపు అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ...కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా ఉన్నాయన్నారు. సస్పెన్షన్‌కు తగిన కారణాలు ఉన్నాయని గుర్తించడంలో ట్రైబ్యునల్ విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ అభియోగాలపై విచారణ ముగిసేవరకు ఒక అధికారిని సస్పెండ్ చేసే విచక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, ట్రైబ్యునల్ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని కోరారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.



సంద్రం.. వెనక్కి తగ్గింది!

సంద్రం వెనక్కి వెళ్లిపోయింది. ఒకటీ రెండూ కాదు ఏకంగా 50 మీటర్ల మేర బంగాళాఖాతం వెనక్కి వెళ్లింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం శివసాగర తీరంలో గురువారం సముద్రం వెనక్కి వెళ్లి.. తీరం విశాలంగా కనిపిస్తుండటాన్ని స్థానికులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. గతంలో కూడా వెనక్కి వెళ్లింది కానీ.. ఎప్పుడూ ఇంతలా వెనక్కి పోలేదని మత్స్యకారులు అంటున్నారు.

- వజ్రపుకొత్తూరు



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఎంటెక్



పుణె ఐఐఐటీ

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీపీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. సీఎస్ఈలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఈసీఈలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా మొదటి ఏడాది కోర్సు వర్క్‌లు; రెండో ఏడాది ప్రాజెక్ట్ వర్క్‌లు, థీసిస్ సబ్మిషన్ ఉంటాయి. సంస్థ నిర్వహించే రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్‌లో 24 సీట్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ స్పెషలైజేషన్‌లో 10 సీట్లు చొప్పున మొత్తం 34 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ లేదా ఎంసీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఐటీలు, నిట్‌లు, ఐఐఐటీలు, సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

రాత పరీక్ష వివరాలు

- ఈసీఈ విభాగానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంజనీరింగ్ మేథమెటిక్స్, నెట్‌వర్క్స్, సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రోమేగ్నటిక్స్ అంశాలనుంచి గేట్ సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు.
- సీఎస్ఈ విభాగానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంజనీరింగ్ మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, కంప్యూటర్ ఆర్గనైజేషన్ అండ్ ఆర్కిటెక్చర్, ప్రోగ్రామింగ్ అండ్ డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్ థియరీ ఆఫ్ కంప్యూటేషన్, కంపైలర్ డిజైన్, ఆపరేటింగ్ సిస్టమ్, డేటా బేస్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.590; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.295
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 10
- **చిరునామా:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-పుణె(ఐఐఐటీపీ), పుణె సర్వే నెం.9/1/3, అంబెగాన్ బద్రుక్, సింహగడ్ ఇన్‌స్టిట్యూట్ రోడ్, పుణె-411041
- **వెబ్‌సైట్:** www.iiitp.ac.in

విట్

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్)- ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. వెల్లూరు, చెన్నై, ఏపీ, భోపాల్ క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్ ప్రకారం మూడు కేటగిరీల కింద అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది.

క్యాంపస్‌లు - ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

విట్ వెల్లూరు: సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(వర్చూసా సహకారంతో), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్)

- **విట్ చెన్నై:** సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(బిజినెస్ అనలిటిక్స్)
- **విట్ ఏపీ:** సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(వర్చూసా సహకారంతో)
- **విట్ భోపాల్:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్స్)

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 65 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు 2004 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ఎన్ఐఓఎస్, కరస్పాండెన్స్ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్/పన్నెండోతరగతి మార్కుల పత్రాలు, ఆధార్ కార్డ్
- **ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 10
- **క్యాంపస్, స్పెషలైజేషన్‌ల ప్రాధాన్యాలు తెలిపే తేదీలు:** జూన్ 10 నుంచి 12 వరకు
- **సీట్ల అలాట్‌మెంట్:** జూన్ 19
- **అడ్వాన్స్ ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 1
- **ట్యూషన్ ఫీజు మొత్తం చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 7
- **వెబ్‌సైట్:** www.vit.ac.in

ఐఐటీ గువహటీలో బీఎస్సీ ఆనర్స్

గువహటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజీ)- 'బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (ఆనర్స్) ఇన్ డేటాసైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' సెప్టెంబరు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని కోర్సెరా ప్లాట్‌ఫామ్‌లో నిర్వహిస్తున్నారు. ఇది ఆన్‌లైన్ ప్రోగ్రామ్. దీనికి 'మెహతా ఫ్యామిలీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' సహకారం అందిస్తోంది. క్వాలిఫయర్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఏ సంవత్సరంలోనైనా జేఈఈ(అడ్వాన్స్‌డ్)కు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు నేరుగా అడ్మిషన్ ఇస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించడంలో సంస్థ సహకారం అందిస్తుంది. ఆసక్తిగలవారు ఐఐటీ గువహటీ అలూమ్నీ నెట్‌వర్క్‌లో చేరవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయవచ్చు. ఏడాదికి మూడు టర్మ్‌లు ఉంటాయి. ఒక్కో టర్మ్ వ్యవధి 12 వారాలు. టర్మ్‌ల మధ్య రెండు వారాల గ్యాప్ ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 299 క్రెడిట్లు నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో మల్టీ ఎగ్జిట్ ఆప్షన్స్ ఉన్నాయి. ఏటా నిర్దేశించిన కోర్సులు పూర్తిచేసి సంబంధిత సర్టిఫికెట్‌తో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.
- మొదటి ఏడాది కోర్సు పూర్తిచేసి అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ; రెండేళ్ల కోర్సు పూర్తిచేసి డిప్లొమా ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ; మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఎస్సీ డిగ్రీ ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ; నాలుగేళ్లూ పూర్తిచేసి బీఎస్సీ ఆనర్స్ ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ సర్టిఫికెట్‌లు పొందవచ్చు.
- ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. రికార్డెడ్ వీడియోస్, లైవ్ సెషన్స్ ద్వారా సంస్థ ఫ్యాకల్టీ మెంబర్లు తరగతులు నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా డిస్కషన్ అవర్స్, ఇండస్ట్రియల్ ఇంటరాక్షన్స్, గెస్ట్ లెక్చర్స్ ఇండస్ట్రీ కోర్సులు, నాలుగు వారాల క్యాంపస్ ఇమ్మర్షన్ ప్లాన్, ఇంటర్న్‌షిప్స్, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు, హెచ్ఎస్సీ ఒకేషనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు, ఎన్ఐఓఎస్ అభ్యర్థులు, నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలోని జాయింట్ సర్వీసెస్ వింగ్ నిర్వహించే రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అడ్మిషన్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌లో చేరదలచుకున్న అభ్యర్థులు ముందుగా నాలుగు మాడ్యూళ్ల వ్యవధిగల మేథమెటిక్స్ ప్రిపరేటరీ కోర్సు పూర్తిచేసి బేసిక్ మేథమెటిక్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(క్వాలిఫయర్ టెస్ట్) రాయాల్సి ఉంటుంది. ఇది 80 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

- అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారికి ఈ మెయిల్ ద్వారా పేమెంట్ లింక్ పంపుతారు. దీని ద్వారా అభ్యర్థులు రూ.2000 చెల్లించాలి. వీరికి వెంటనే ప్రిపరేటరీ కోర్సుకు సంబంధించిన ఆన్‌లైన్ యాక్సెస్ పంపుతారు.
- క్వాలిఫయర్ టెస్ట్ స్కోర్, పదోతరగతి మార్కులు, ఇంటర్/పన్నెండోతరగతి మార్కుల ఆధారంగా రూపొందించిన కాంపోజిట్ స్కోర్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** iitg.ac.in



రాయ్‌పూర్ ఎయిమ్స్‌లో ఎంపీహెచ్

రాయ్‌పూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం ఆరు సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు రూ.25000ల స్టయిపెండ్ చెల్లిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/ బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఎన్‌వైఎస్/బీయూఎంఎస్/బీఎస్ఎంఎస్/బీటెక్/బీఈ/బీవీఎస్సీ ఉత్తీర్ణులు; నర్సింగ్ సైన్సెస్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఫార్మసీ కోర్సులు చేసినవారు; పీజీ(స్టాటిస్టిక్స్/ బయోస్టాటిస్టిక్స్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/న్యూట్రిషన్/సోషియాలజీ/ఎకనామిక్స్/సైకాలజీ/ఆంత్రపాలజీ/సోషల్ వర్క్/మేనేజ్‌మెంట్/లా) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో పాపులేషన్ సైన్సెస్, బయోస్టాటిస్టిక్స్, ఎపిడిమియాలజీ, హెల్త్ ఎకనామిక్స్, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్, కంప్యూటర్ నాలెడ్జ్, ఇంగ్లీష్ అంశాల నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 2
- **అభ్యర్థుల ఈ మెయిల్‌కు అడ్మిట్ కార్డులు పంపు తేదీ:** జూన్ 17
- **పరీక్ష కేంద్రం:** ఎయిమ్స్ రాయ్‌పూర్
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూన్ 26
- **జాయినింగ్ రిపోర్ట్‌కు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.aiimsraipur.edu.in

జాబ్ కార్నర్

ఏపీ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 29

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్... డైరెక్ట్ ఎంట్రీ, లేటరల్ ఎంట్రీ ద్వారా కొత్త మెడికల్ కాలేజీల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్

అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ(ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం) ఉత్తీర్ణులై ఉండాలి.

స్పెషాలిటీ: మైక్రోబయాలజీ అండ్ ఫార్మకాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక విధానం: విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. బీసీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 25

వెబ్‌సైట్: https://dme.ap.nic.in/



జేకే బ్యాంకులో అప్రెంటిస్‌లు

ఖాళీలు 276

జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంకు... అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. స్థానిక అభ్యర్థుకు ప్రాధాన్యం ఉంటుంది.

వయసు: 2024 జనవరి 1 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం **స్టయిపెండ్:** నెలకు రూ.10,500

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీకి రూ.700. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 28

వెబ్‌సైట్: https://www.jkbank.com/

బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 34

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ఎస్ఐ(వెహికల్ మెకానిక్): 3 పోస్టులు
2. కానిస్టేబుల్(ఓటీఆర్‌పీ): 1 పోస్టు
3. కానిస్టేబుల్(ఎస్‌కేటీ): 1 పోస్టు
4. కానిస్టేబుల్(ఫిట్టర్): 4 పోస్టులు
5. కానిస్టేబుల్(కార్పెంటర్): 2 పోస్టులు
6. కానిస్టేబుల్(ఏఈ): 1 పోస్టు
7. కానిస్టేబుల్(వెహికిల్ మెకానిక్): 22 పోస్టులు
8. కానిస్టేబుల్(బీఎస్‌టీఎస్): 2 పోస్టులు
9. కానిస్టేబుల్(అప్‌హోల్‌స్టర్): 1 పోస్టు

అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ, డిప్లొమా/డిగ్రీ(ఆటో మొబైల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణత తోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: గ్రూప్-బీకి రూ.200; గ్రూప్-సి పోస్టులకు రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 17

వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

ఐసెక్‌లో రీసెర్చ్ ఫెలో

ఖాళీలు 3

బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ చేంజ్(ఐఎస్ఈసీ), పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డేటా అసిస్టెంట్: 1 పోస్టు 2. రీసెర్చ్ ఫెలో: 2 పోస్టులు

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

జీతం: డేటా అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.19,352, రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.25,000

ఎంపిక: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 14

వెబ్‌సైట్: https://www.isec.ac.in/

డీఎంఆర్ఎల్‌లో ఐటీఐ అప్రెంటిస్‌లు

ఖాళీలు 127

కాంచన్‌బాగ్(హైదరాబాద్)లోని డీఆర్‌డీవోకి చెందిన డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(డీఎంఆర్ఎల్)...కింద పేర్కొన్న ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడులు: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **చివరి తేదీ:** మే 31

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

లిటిల్స్



అడవికి రాజు... తెలివిలో ఘనాపాటి!

సింహం చాలా తెలివైనదని అందరూ చెప్పుకునేవాళ్లు. ఎందుకంటే.. చెప్పుడు మాటలు వినదు. పైగా ప్రతి విషయాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంది. మృగరాజు మాట అంటే మాటే. జంతువులన్నీ ఆ మాటకు కట్టుబడి ఉండేవి.


ఒకరోజు రాజుగారు అడవి జంతువులకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని జంతువులూ హాజరయ్యాయి. అడవికి రాజు కావాలనే ఆశ పులి, నక్కకు ఉంది. అయితే అవి మనసులోనే




ఎప్పటినుంచో బాధపడుతున్నాయి. మేము మీ సహాయకుడిగా ఉంటానని నక్క అడిగింది రాజుగారిని. 'అవసరం లేదు' అన్నది సింహం. 'మీకు మంత్రిగా ఉంటాను' అనడిగింది పులి. 'మాకేమి కావాలో బాగా తెలుసు. మీరు చెప్పాల్సిన అవసరం లేద'న్నది సింహం. ఎదురుగా గజగజ వణుకుతూ ఉండే కుందేలుని దగ్గరకు రమ్మని సింహం పిలిచింది. 'ఈరోజు నుంచి నువ్వే నా బాగోగులు చూడాలి' అన్నది. నా గుహ దగ్గరే నీ ఇల్లు అని చెప్పింది. అయిష్టంతోనే.. నేను శాకాహారిని.. రాజుగారు అన్నది. 'తెలుసు కాబట్టే నువ్వే మాకు సహాయంగా ఉండాలి' అన్నది. రాజు దగ్గర సహాయకుడిగా కుందేలు ఉండేది. అప్పుడప్పుడు అడవిలోకి వెళ్లి ఇష్టమైన ఆహారం తినేసి వచ్చేది. ఆ సమయంలోనే కుందేలును కలిసి నక్క ఒక ఉపాయం చెప్పింది. రాజుగారికి తెలిస్తే ఎలా? అన్నది కుందేలు. 'అది అసంభవం' అన్నది.

ఒకరోజు కుందేలు పరిగెత్తుకొచ్చింది. 'రాజావారు దగ్గర కొలనులో ఓ సింహం ఉంది. ఈ అడవికి ఇదే రాజంట' అన్నది. కుందేలుతో కలిసి సింహం బయలుదేరింది. కొలనులో సింహం రూపం కనిపించింది. 'నేను ఎంత అందంగా ఉన్నానో కదా!' అని కుందేలును అడిగింది. నీటి కొలను ముందు గాండ్రించింది. దూరంగా ఉండే నక్కకు ఈ మాటలేవీ వినపడలేదు. పరిగెత్తుకుంటూ క్షణాల్లో నక్క వెనకాలే సింహం దగ్గరకు వచ్చి ఆగింది. 'రాజుగారూ.. నీళ్లలో దూకి ఆ పొగరుబట్టిన సింహాన్ని సంహరించండి' అన్నది. నీళ్లలోకి దూకినట్లు ముందుకు ఎగిరి.. క్షణాలలో వేగంగా వెనక్కి వచ్చింది. 'ఓహో.. తమరి తర్ఫీదా ఇది' అంటూ నక్క గొంతును కొరికేసింది సింహం. 'చెప్పుడు మాటలు ఇకమీదట వింటే నీకిదే గతి' అంటూ కుందేలుతో అన్నది. గజగజవణుకుతూ 'ఈసారి క్షమించండి' అన్నది. 'నీ మనసు నాకు తెలుసు. నా తెలివి నీకు తెలుసు' అంటూ సింహం నవ్వింది. కుందేలు కూడా గట్టిగా నవ్వింది.

6 తేడాలు గుర్తించండి









డైలీ సుడోకు - 315

8			7			3		
	7			4	1			
2					9			
						5	1	
9			1	7	4			6
	1	4						
			4					1
			8	3			5	
		2			7			9

సుడోకు - 314 సమాధానం

7	9	1	3	8	6	4	5	2
4	6	2	5	9	1	7	8	3
8	5	3	4	7	2	9	1	6
6	1	9	7	5	4	3	2	8
3	4	5	2	6	8	1	7	9
2	8	7	9	1	3	5	6	4
9	3	8	1	2	5	6	4	7
5	2	4	6	3	7	8	9	1
1	7	6	8	4	9	2	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.